# పాతనిబంధన చరిత్ర పరిశీలన

# The Old Testament History Review

CLCI BIBLE INSTITUTE

Christianpet - NIDUBROLU

# CLCI BIBLE INSTITUTE
Christianpet - NIDUBROLU

**పాతనిబంధన చరిత్ర పరిశీలన**

(The Old Testament History Review)

Lesson:- 1

## ఆదికాలము - అబ్రాహాము ప్రయాణము
## Genesis - Journey of Abraham

ఆదికాండ గ్రంధములో దేవుని అనాది సృష్టి కార్యక్రమ వివరణ వ్రాయబడెను. "ఆదికాలము"ను అనగా అనాదిసృష్టి కాలపరిమాణాన్ని మనం ఇదమిద్ధంగా నిర్ణయించలేము. కాని మన పితరుడు అబ్రహాము చరిత్రకాలం నుండి తేదీలు షుమారుగా వ్రాయగలం. ఆదికాలంలోని వేలాది సంవత్సరములలో జరిగిన చరిత్ర, ఆదికాండంలోని మొదటి 11 అధ్యాయములలో ఇమిడియున్నది. ఆదికాండము అనాది సృష్టి కార్యక్రమమును తెలిపే చరిత్ర గ్రంధముకాదు. ఆ గ్రంధమునుండి దేవుని మహత్కార్యములు, ప్రపంచ నిర్మాణము మొదలగు విషయములను మనము నేర్చుకోగలము. దేవుడు ఆది నరులను ఏదేను తోటలోనుంచెను. అది యూఫ్రటీసు, టైగ్రీసు నదుల మధ్యనున్న మెసపొటేమియ ప్రాంతము.(**ఆది 2:10-14**) బైబిలు ఆరంభ చరిత్రలో నాలుగు ముఖ్య సంఘటనలు వివరించబడినవి. వీటి ద్వారా నాలుగు ప్రాముఖ్యమైన సత్యములు అర్ధము చేసికొనగలము.

1. **సృష్టి**:- సృష్టికర్త దేవుడే. ఆయనే జీవప్రదాత. (**ఆదికాండము 1-2అధ్యాయములు.**)

2. ***పావము శావము***:- మంచి చెడులు దేవునికి తెలుసును, ఆయనే వాటిని నిర్ధారించువాడు. నీతి న్యాయములకు కర్త స్థాపకుడు ఆయనే. ***(3వ అధ్యా)***


3. ***ప్రవంచ జలప్రళయము***:- పశ్చాతపులు కాని పాపాత్ములకు తీర్పు తీర్చు అధికారి దేవుడే. ***(6-8 అధ్యా)***

4. ***బాబేలు గోపురం***:- బాషలు తారుమారగుట, ప్రజలు చెదరగొట్టబడుట. ప్రజలు చేయు పనులు, నివసించవలసిన దేశములు నిశ్చయించువాడు దేవుడే.

ఆదికాండము 12వ అధ్యాయము నుండి, ఇశ్రాయేలీయుల మూలపురుషుడైన అబ్రాహామును గూర్చి, తదితర పితరులను గూర్చియు చరిత్ర వ్రాయబడినది. అనగా ఇశ్రాయేలీయుల జనాంగ చరిత్ర ఇక్కడనుండి ప్రారంభమగుచున్నది. అబ్రాహాము కల్దీయ దేశములోని ***ఊరు*** అను పట్టణములో షుమారు 2000 బి.సి సంవత్సరములో నివసించెడివాడు. అతడు గొప్ప శ్రీమంతుడు. ఈ ***ఊరు*** అను పట్టణము గొప్ప నాగరికతగలది. అది చిత్రవిచిత్రమైన భవనములతో నిండియున్నది. క్రీ.శ 1923 సంవత్సరమునుండి నేటి వరకు పురావస్తు శాస్త్రజ్ఞులు త్రవ్విన త్రవ్వకాలలో బయల్పడిన గొప్ప పట్టణాలలో ఈ 'ఊరు' అను



ఊరు పట్టణపు త్రవ్వకాలలో లభించిన నిమ్రోదు రాణి శిరోభరణములు.



డెబ్బది అడుగుల ఎత్తయిన గోపురము ఇది నిమ్రోదు భార్య పేరిట నిర్మించిన చంద్ర దేవతారాధన ఆలయము.

పట్టణముకూడా ఉన్నది. త్రవ్వకాలలో బయల్పడిన ఆధారాలను బట్టి పట్టణము మధ్యలో 70 ఎత్తైన గోపురముతో ఒక బ్రహ్మాండమైన దేవాలయం వున్నది. ఇందు చంద్ర దేవునికి ఆరాధన జరుగుతుండేది.ఇంకా త్రవ్వకాలలో అనేకమైన బంగారుపాత్రలు, నగలు, వెలగలరాళ్ళు, వాయిద్యములు, ఆ కాలపు ఆయుధములు, మొదలగునవి దొరికినవి. వారు త్రవ్విన త్రవ్వకాలలో ఊరు పట్టణములోని వీధులు, దుకాణములు, 15నుండి 20 గదులు గల రెండంతస్తుల భవనములు అనేకం బయల్పడినవి. వాటి గోడలపై వెలగల రాళ్ళతో చెక్కబడిన విలువైన చిత్రములు అనేకము కనుగొనబడినవి. ఇంకా ఆ మహానగరంలో వ్రాతలు గలిగిన 22,000 మట్టి పలకలు దొరికినవి. ఆ వ్రాతపలకలు కనుగొన్న పురావస్తు శాస్త్రజ్ఞులు ఆ మట్టి పలకలమీదనున్న వ్రాతలు చదివి ఆ కాలములోని నాగరికతను గూర్చి అనేక సంగతులు తెలిసికొనిరి. జన సంఖ్య, పన్నులు వసూలు చేయుట, నీటిపన్ను, కాలువలోని ఇసుక మేటలు త్రవ్వుట ఇంకా అనేకమైన విషయములు తెలిసికొనిరి. అంతేకాక ప్రజలు విస్తారమైన అన్య దేవతలను కొలిచెడివారు.

దీనంతటినిబట్టి శ్రీమంతుడైన అబ్రాహాము గొప్ప భవనములో నవనాగరికతలుగల నగరములో నివసించెడివాడని గ్రహించగలము. అటువంటి ఉన్నత స్థితిలో తరతరాల భయంకరమైన విగ్రహారాధీకుల మధ్య జీవిస్తూ ఉన్న అబ్రాహామును దేవుడు అద్భుతరీతిగా పిలిచినాడు. ఎందుకు? సర్వమానవాళి రక్షణ కొరకై ఏర్పరచబడిన రక్షణ ప్రణాళికను అబ్రాహాము వంశము ద్వారా అమలు పరచుటయే దేవుని ఉద్దేశ్యము.

“నీవు లేచి నీబంధువులయొద్ద నుండియు, నీ తండ్రి యింటినుండియు, బయలుదేరి నేను నీకు చూపించుచున్న దేశమునకు వెళ్ళుము'' అని అబ్రాహాముతో మాట్లాడి ఆ భయంకరమైన విగ్రహారాధనకూడిన స్థలమునుండి వెలుపలికి రప్పించెను.(ఆది.కా *12వ* అధ్యాయము) అబ్రాహాము తన జీవితకాలములో మొదటిసారిగ సజీవుడైన దేవుని స్వరమును వినినను, ఆ దివ్య స్వరము విషయములో

ఎటువంటి సంశయములకు లోనుకాకుండ, సందేహములు లేకుండ, విగ్రహారాధీకుల విమర్శలను లెక్కచేయకుండ, తోటి బంధుమిత్రులు అధైర్యపరచినను, ధృడవిశ్వాసముతో కనిపించని ఆ దేవదేవుని వాక్కులను హృదయపూర్వకముగా అంగీకరించుట బహు ప్రశంసనీయము.

అబ్రాహాము ఆ నాగరికతగల పట్టణమును, తన దివ్య భవనములను విడిచిపెట్టి అప్పటినుండి యాత్రికునివలె తన జీవితకాలమంతయు గుడారములలో నివాసము చేయుచు దేవుని చిత్తప్రకారము గమ్యము తెలియని ఆ సుదూర దేశమునకు బహు వ్యయప్రయాసలతో ప్రయాణము సాగించెను. అతడు యూఫ్రటీసు నది వెంబడి వెళ్ళి తన తండ్రి చనిపోయేవరకు హారానులో ఉండెను. తన సోదరుడి కుమారుడైన లోతు తననుండి వేరై సొదమ వైపు వెళ్ళిన తదుపరి అబ్రాహాము కానాను దేశమునకు వెళ్ళెను. అయితే కొంత కాలమునకు కానాను దేశములో కరవు వచ్చినందువల్ల అతడు ఐగుప్తు దేశమునకు వెళ్ళి, కొన్ని నెలలచ్చుట నివాసము చేసి తిరిగివచ్చెను. అతడు ప్రయాణము చేయునపుడెల్ల తన కుటుంబమును, పశువులను, గొర్రెల మేకల మందలను, పనివారిని, వారి కుటుంబములను వెంటబెట్టుకుని పోయెడివాడు. వారందరును డేరాలలో నివాసము చేయుచూ కానాను దేశములో పశువులకు ఎక్కడ పచ్చిగడ్డి దొరకునో అక్కడ మకాము వేయుచు సంచరించుచుండెడివారు.

---

**Lesson:- 2** బైబిల్ పాఠము - 2

# ఐగుప్తు దేశము-Egypt


అబ్రాహాము, తన కుమారుడైన ఇస్సాకు, అతని కుమారులైన యాకోబు ఏశావులు కానాను దేశములో నివసించిరి. యాకోబు కుమారుడైన యోసేపు ఐగుప్తుకు పోవుచున్న ఇష్మాయేలీయులకు బానిసగా అమ్మబడెను, కాని దేవుడతనికి తోడైయున్నందువల్ల అతడు అన్ని శ్రమల నుండి రక్షించబడి తుదకు ఆ దేశమునకు ప్రధానమంత్రి అయ్యెను.

కల్దీయ దేశమువలె ఐగుప్తుకూడ గొప్ప నవనాగరికతలు గల దేశము. పురావస్తు శాస్త్రజ్ఞులు ఆ దేశములోకూడ త్రవ్వకాలు సాగించి అనేక విలువగల వస్తువులను కనుగొనిరి. ఐగుప్తీయులు, ఐగుప్తురాజుల సమాధుల కొరకై పిరమిడ్స్ అను గొప్ప కట్టడములను కట్టించిరి. అవి నేటివరకు నిలిచి యున్నవి. ఆ సమాధులలో ఒక దానియందు అనగా టూటంకమెన్ అను యువరాజు యొక్క సమాధిలో విస్తారమైన బంగారు వస్తువులు దొరికినవి. బంగారముచే పొదింగింపబడిన సింహాసనము, బంగారు ఆయుధములు, ఎంతో విలువైన నగలు, రత్నాలు, వజ్రాలు మొదలైన విలువగల వస్తువులు ఎన్నో ఆ యువరాజు సమాధియందు కనుగొనిరి.

ఆ దేశ ప్రజలు సూర్యారాధన చేసెడివారు. మరియు అన్నిరకాల క్రిమికీటకాదులను పూజించెడివారు. ముఖ్యముగా పెంకు పురుగు తలగా కలిగిన దేవతను పూజించెడివారు. భారతదేశములో ముఖ్య నదులను

పుణ్యనదులని పూజించుచున్నట్లే, వారుకూడా నైలునదిని పూజించెడివారు. ఎందుకనగా ఆ దేశ సిరిసంపదలన్నియు దానిలో గుప్తమైయున్నవని వారి నమ్మకము. నైలునది నీరు ప్రవహించని భూములు కేవలము ఇసుకమయమైన ఎడారులుగా వున్నవి. యెహోవా దేవుడు ఐగుప్తీయులమీదకు పది తెగుళ్ళు పంపించినప్పుడు వారి ఆరాధ్య దేవతలన్నిటిపై సర్వ హక్కులు, సర్వ స్వతంత్రత, సంపూర్ణమైన అధికారము యెహోవాకే కలదని వారికి తెలియపర్చెను. ఐగుప్తీయులు ఆరాధ్య దేవతలుగా ఆరాధించే సూర్యుడు, నైలునది అందులో నివసించెడి జలచరములు, కప్పలు కీటకములు మొదలైనవాటిని ఆయన మొత్తెను. దేవుడు మోషే ద్వారా రప్పించిన పది తెగుళ్ళు ఆ ఐగుప్తు దేవతలకు తలవంపులు తెచ్చినవి. ఐగుప్తు శకునగాండ్రు సహితము ఆ పరాభవమును ఆపుచేయలేకపోయిరి. అనగా యెహోవా దేవుడు ఒక్కడే సమస్త దేవతలపై సంపూర్ణ అధికారము కలిగినవాడని రుజువు చేయబడెను. తద్వార ఇశ్రాయేలీయులు తమ దేవుడైన యెహోవా సర్వశక్తిమంతుడని గ్రహించుకోగలిగిరి.

ఐగుప్తు దేశములోని ప్రతి రాజుకు ఫరో అను బిరుదు ఇవ్వబడెను. ఫరో అను మాటకు గొప్ప వంశస్థుడు, చక్రవర్తి అరి అర్థము. ఆ కాలములోని రాజులందరు దేవుండ్లుగా ఎంచబడిరి. అందు వలన వారు తమ ఇష్టము వచ్చినట్లుగా శాసనములు గావించినను ఎవరును వారికి ఏమాత్రము ఎదురు చెప్పలేకపోయిరి. వారు సూర్య కుమారులని కూడా పిలువబడిరి. కనుక వారు చనిపోయినపుడు వారి ఆత్మలు నైలునది మీదుగ ప్రయాణముచేసి సూర్యభగవానునిలో లీనమైపోవునని ఐగుప్తీయులు తలంచెడివారు. అందువలననే ఒక మహారాజు మరణించినపుడు అతని మృత కళేబరముతోపాటు, అతని ప్రయాణము మరియు జీవనోపాధికొరకై ఒక రథము, ఒక పడవ, ఆహార సామాగ్రి, దుస్తులు, ఆరాజు వాడుకొను బంగారు ఆభరణములు, రత్న ఖచిత సింహాసనము, విలువగలిగిన ఎన్నో ఆయుధములు ఆ మహారాజు సమాధిలో ఉంచెడివారు. ఒకరాజు చనిపోయినపుడు అతని సేవకులుకూడ విషము త్రాగి మరణించు అలవాటు ఆరంభములో కలదు. అప్పుడు వారి మృతదేహములనుకూడ రాజు మృతదేహముతో కలిపి ఆ సమాధిలో నుంచెడివారు. అయితే రానురాను ఆ ఆచారమును ఆపివేసి, మట్టితో చేయబడిన దాసదాసీల బొమ్మలు, మృతమైన రాజుకు సేవలు చేయడానికి సమాధిలో ఉంచెడివారు. మరియు రాజుల మృతదేహములను విలువగల సుగంధ లేపనములు పూసిన గుడ్డతో చుట్టెడివారు. తదుపరి ఆ మృతదేహమును




*(''సార్కొఫగస్'' అనగా మనిషి ఆకారములో ఉన్న శవపేటిక.)*

మనిషి ఆకారముగల శవ పేటికలోనుంచి, ఆ రాజు ముఖమును, అతని దేహనిర్మాణమును ఉన్నదివున్నట్లు రంగులతోను, వెలగల రాళ్ళతోను, ఆ శవ పేటికపైన చిత్రించెడివారు. ఆ శవపేటిక పేరు "సార్కాపగస్"(Sarcophagus). సుగంధ లేపనములతో చుట్టబడిన ఆ దేహమును "మమ్మి" (Mummy) అందురు.(***ఆది.కా 50:2-3***) సామాన్య ప్రజలుకూడా తమ కుటుంబములో చనిపోయిన వ్యక్తుల యొక్క శవములకు అదేవిధముగా సుగంధ ద్రవ్యములు పూసిబట్ట చుట్టెడివారు. ఐగుప్తు దేశములో వర్షపాతము కడు అల్పము. అందువల్ల అప్పటి రాజుల మృతదేహములు 2000 బి.సి నుండి చెక్కుచెదరక అలాగే నిలిచియున్నవి. అనగా దాదాపు 4000 సంవత్సరములు నిలిచినవి. పురావస్తు శాస్త్రజ్ఞులు వాటిని పిరమిడ్స్ సమాధుల నుండి బయటకు తీసి అనేక ఇతర దేశములకు పంపి వస్తు ప్రదర్శనశాలలో ఉంచిరి. టూటంకమెన్ యువరాజు సమాధిలో లభ్యమైన అపార సంపద, అమూల్యమైన

వస్తువులు ఐగుప్తు దేశములో నేటికిని చూడగలము.

ఐగుప్తు దేశీయులు తమ వ్రాతలు మట్టి పలకల మీద వ్రాయలేదు గాని జమ్ము, రెల్లు కలిపి అల్లిన పలుచని తడికెల మీద బొమ్మల సంకేతములతో వ్రాత వ్రాసి వాటిని చుట్టలుగా చట్టెడివారు. వాటిని **పెపైరస్** అని పిలిచేవారు. అయితే ఈ వ్రాత కొంతకాలము మాత్రమే నిలువ ఉండేది. వ్రాత చాలాకాలము నిలువవలసి వచ్చినప్పుడు వారు గోడల మీద బొమ్మల వ్రాతలను చెక్కించెడివారు. చెక్కబడిన ఆ బొమ్మలకు అందమైన రంగులు వేయించెడివారు.




పిరమిడ్ ఫరో రాజు సమాధి మరియు స్పింక్స్ విగ్రహము

పిరమిడ్ ఫరో రాజు సమాధి మరియు స్పింక్స్ విగ్రహం.

ఆ విధంగా గోడల మీదను, స్థూపముల మీదను చెక్కబడిన ఆ బొమ్మల వ్రాతలనుబట్టి ఆనాటి పరిస్థితులను తెలిసికొనవచ్చును. ఆకాలములో విద్య చాలవరకు జ్యోతిష్కములతో కూడియుండెడిది. సంపన్న కుటుంబీకులు మాత్రమే పూజారుల దగ్గర చదువు నేర్చుకొనగలిగిరి. గణిత శాస్త్రము కూడ బొమ్మల పద్ధతిలో విచిత్రముగా నేర్పబడేది. రానురాను వారు ఆ బొమ్మల పద్ధతి మానివేసి గుర్తులు పెట్టుట నేర్చుకొనిరి. ఈ బొమ్మల వ్రాతలను హైరోగ్లిఫిక్స్ అందురు.

యోసేపు ఐగుప్తులో ఉండిన కాలమందు ఐగుప్తును ఏలుచుండిన రాజులు హిక్సాస్ జాతి రాజులు. ఈ హిక్సాస్ యను జాతివారు ఐగుప్తు వాస్తవ్యులు కాక, ఆసియా ఖండమునకు చెందినవారు. ఉత్తర ప్రాంతమునుండి ఆసియాలోని సిరియా మీదికి ఆర్యులు దండెత్తి అక్కడ యుండిన హిక్సాస్ యను జనాంగమును దక్షిణమునకు తరిమిరి. దక్షిణమునకు తరుమబడిన హిక్సాస్ జనాంగము ఐగుప్తును వశపర్చుకొని క్రీ.పూ 1720 నుండి 1350 వరకు అనగా షుమారుగా 370 సంవత్సరములు ఐగుప్తును పరిపాలించిరి. సరిగ్గా ఈ కాలములోనే దేవుడు యాకోబు కుమారుడైన యోసేపును ఆశ్చర్యకరముగా

ఐగుప్తునకు చేర్చినాడు. అక్కడ యోసేపు, దేవుని కృపవలన, ఫరోఅనబడిన హిక్సాస్ రాజు చేత అత్యధికముగా హెచ్చింపబడి ఐగుప్తు మీద గొప్ప అధికారిగా నియమింపబడెను. యోసేపు తన తండ్రిని, తన తండ్రియైన యాకోబు (ఇశ్రాయేలు) కుటుంబపు వారినందరిని ఐగుప్తునకు రప్పించెను. యాకోబు తన కుమారుడైన యోసేపును కలుసుకొనుటకు ఐగుప్తునకు వెళ్ళినప్పుడు తన కుటుంబములో 70 మంది మాత్రమే ఉండిరి.(***ఆది.కా 46:27***)



[illegible] శ్రమను-ఐగుప్తు గోడలపైన చిత్రించబడిన చిత్ర

వారు 400 సంవత్సరములు తరువాత ఐగుప్తును విడచునప్పుడు  కేవలం పురుషుల కాల్బలము 6 లక్షలమంది యైనారు. యాకోబు కుటుంబీకులు ఐగుప్తు చేరినప్పుడు వారి ముఖ్యవృత్తి గొర్రెలు మేపుట. గొర్రెలు ఐగుప్తీయులకు హేయమైన జంతువులు గనుక ఫరో వారిని గోషేను అను ప్రదేశములో ఉంచెను. అది ఐగుప్తునకును, ఫిలిష్తీయుల దేశమునకును మధ్య ఉన్నది. యాకోబు కుటుంబము క్రీ.పూ 1650 సంవత్సరములో ఐగుప్తులో ప్రవేశించి గోషేనులో క్రీ.పూ 1350 సంవత్సరము వరకు అనగా దాదాపు 300 సంవత్సరములు ఎంతో సంతోషముగా జీవించిరి. ఈ కాలములోనే ఇశ్రాయేలీయులు అత్యధికముగా విస్తరించి గొప్ప జనాంగముగా మారెను. క్రీ.పూ 1350 సంవత్సరములో పాత ఐగుప్తు రాజ వంశీయులు హిక్సాస్ రాజులను జయించి తిరిగి ఐగుప్తును వశపరచుకొనిరి. హిక్సాస్ రాజులను జయించిన ఐగుప్తు రాజులు యోసేపును ఎరుగనివారు. నిర్గమ 1:8లో చెప్పబడిన యోసేపునెరుగని ఆ క్రొత్త రాజు పేరు రెండవ రామ్సేస్. ఈయన పరిపాలనయందు ఇశ్రాయేలీయులు బహు కఠిన బానిసత్వమును అనుభవించి, వెట్టి పనులతో బాధ పడుచు భయంకరమైన శ్రమను అనుభవించుచుండిరి. క్రీ.పూ 1300 నుండి 1234 వరకు రెండవ రామ్సేస్ పరిపాలించెను, అనగా అతడు దాదాపు 65 సంవత్సరములు పాలించెను.

ఈ రెండవ రామ్సేస్ ఇశ్రాయేలీయుల చేత విపరీతమైన వెట్టి చాకిరి చేయించి తన పేరు చిరస్మరణీయముగా నుండుటకు వారిచేత "పీతోము, రామెసెసు" అను పట్టణములను కట్టించుకొనెను. (***నిర్గమ 1:11***) ఆతరువాత ఇశ్రాయేలీయులు అనేక శ్రమలు అనుభవించినను వారింకా విస్తారమైన జనాంగముగా మారిరి. ఈ రెండవ రామ్సేస్ అను రాజు పాలించుచుండిన కాలమందే మోషే పుట్టెను. రాజశాసనం ద్వారా నైలునదిలో వదలబడిన మోషేను రెండవ రామ్సేస్ యొక్క కుమార్తె కనుగొని, తన కుమారునిగా పెంచుకొనెను. (***నిర్గమ 2:1-10***) ఈమె పేరు థెర్మూతిస్. భర్త చనిపోయి బిడ్డలు లేని విధవరాలు. తన స్వంత రాజమందిరంలో మోషేను ఫరోకుమార్తె థెర్మూతిస్ ఎంతో ప్రేమతో పెంచి పెద్దజేసి సకలరాజవిద్యలయందు ప్రవీణునిగా చేసెను. దేవుడు మోషే ద్వారా ఇశ్రాయేలీయులను క్రీ.పూ 1280సం.లో ఐగుప్తునుండి విమోచించెను.

Lesson No: 3

# ఇశ్రాయేలీయుల అరణ్య ప్రయాణము Exodus


మోషే 40 సంవత్సరములు ఫరో కుమార్తెకు కుమారునిగా, గొప్ప అధికారిగా ఐగుప్తు దేశములో ఉండెను. తరువాత అతడు మిద్యాను అరణ్యము లోనికి పారిపోయి అక్కడ మరియొక 40 సంవత్సరములు గొర్రెల కాపరిగా ఉండెను. ఒకనాడు హోరేబు పర్వతము దగ్గర మహిమగల దేవుడు మండుచున్న పొదలో మోషేకు ప్రత్యక్షమై అతడు ఇశ్రాయేలీయులను ఐగుప్తురాజు వశములో నుండి విడిపించవలసినదని, వారిని ఆ హోరేబు పర్వతమునకే నడిపించి అక్కడ వారందరు యెహోవాను ఆరాధించ వలసినదనియు, అందుకు దేవుడు అతనిని ఏర్పరచుకొనెననియు సెలవిచ్చెను. హోరేబు పర్వతమునకు మరియొక పేరు సీనాయి పర్వతము. ఈ పర్వత ప్రాంతమంతయు భయంకరమైన అరణ్యములు, లోయలతో ఉన్నది, గాని అనావృష్టి ప్రాంతమగుటవలన నదులేమి అక్కడ లేవు. ముళ్ళపొదలు తప్ప మరి ఎటువంటి వృక్షజాతి అక్కడ కనిపించదు. అక్కడ పాములు, తేళ్ళు విస్తారముగా కనిపించును. అది అతి భయంకరమైన ఉష్ణ ప్రదేశము. (***ద్వితీ. కాం.8:15***) కొద్దిపాటి మందలు మేపెడి జాతివారు తప్ప మరి ఎవరును నివసింపలేరు.

యెహోవా హోరేబు పర్వతము దగ్గర మోషేకు ప్రత్యక్షమైన పిదప ఐగుప్తు తిరిగి వెళ్ళి, దేవుని మహా గొప్పశక్తి చొప్పున గొప్ప అద్భుతకార్యములతో అనగా పది తెగుళ్ళతో ఐగుప్తీయులను బాధించి, ఇశ్రాయేలీయులకు విడుదల కలిగించెను. ఇశ్రాయేలు ప్రజలందరు ఐగుప్తును విడిచి, ఎర్ర సముద్రము యొద్దకు వెళ్ళవలసినదిగా యెహోవా ఆజ్ఞాపించెను. వారు మోషే, అహరోనులచే నడిపింపబడి ఎర్రసముద్ర గర్భమున ఆరిన నేలపై దాటిరి. తమ్మును తరుముచున్న ఐగుప్తురాజు తన సైన్యముతో సహా ఆ సముద్రములో మునిగి నాశనమాయెను. ఇశ్రాయేలీయులు ఎన్నడును దేవుడు చేసిన ఆ మహా గొప్ప విమోచనా కార్యమును మరువలేకపోయిరి. ఆయన చేసిన ఈ గొప్ప విడుదలతో వారి జనాంగపు చరిత్ర మొదలైనది.

దేవుడు ఇశ్రాయేలు జనాంగమును సీనాయి అరణ్య ప్రాంతము ద్వార నడిపింప నిర్ణయించెను. దానికి కొన్ని కారణములు కలవు.

1. దేవుడు ఈ ప్రయాణములో తన మహిమా ప్రభావములను, తన పరిశుద్ధతను, గుణలక్షణము లను తాను ఏర్పరచుకొనిన జనాంగమునకు నేర్పించగోరెను.

2. దేవుడు ఇశ్రాయేలీయులను తనకు ఒక ప్రత్యేకమైన జనాంగముగా తయారు చేయవలెనని,




# అరణ్య ప్రయాణము Exodus

వారు ఐగుప్తు దేశములోని విగ్రహారాధన మరచి పోయి పరిశుద్ధ దేవుని సేవించి ఆయనపై ఆధారపడి నీతి న్యాయములు అలవర్చుకొనునట్లు ఆయన వారిని అరణ్యమార్గమున నడిపించెను.

3. దేవుడు వారిని మధ్యధరా సముద్రపు సరిహద్దు ననుసరించి వర్తకులు పయనించు మార్గము ద్వార నడిపించినచో, బానిసలుగా ఉన్న ఇశ్రాయేలీయులు దేవుని మహిమ తెలియక పిలిష్తీయులను ఎదిరింపలేక పిరికివారిలా వెనుకకు పారిపోయే ప్రమాదం ఉన్నది.

4. అవిధేయులను, తిరుగుబాటుదారులను ఆయన మరణ దూతచే నాశనం చేయించిన తదుపరి, మిగిలినవారి ద్వార కానానుపై విజయాన్ని యెహోవా దయచేసినాడు.

ఐగుప్తులోనుండి వారిని పూర్తిగ విడిపించుట ద్వార ఇశ్రాయేలీయులు ఆ దినమునుండియే తమ సంవత్సరములు, నెలలు లెక్కపెట్టుట మొదలు పెట్టిరి.***(నిర్గమ 12:1)*** ఆ మహాద్భుత విమోచనాన్ని వారు ఎన్నడును మరువకుండునట్లు అప్పటినుండి ఇశ్రాయేలీయులు ప్రతి సంవత్సరము మొదటినెల 14వ దినమందు పస్కాపండుగను ఆచరించుదురు దేవుడు నమ్మకమైన సర్వశక్తిమంతుడని ఇశ్రాయేలీయులు ఏ విధముగా నేర్చుకొనిరనగా

1. సీనాయి పర్వత ప్రాంతంలో పగలు భయంకరమైన ఎండకాయును. రాత్రులు చాలా చల్లని గాలి వీచును. కనుక ఎండ తగులకుండ పగలు పాళెముపై మేఘ స్థంభమును, రాత్రులు శీతల వాయువులు వారికి తాకకుండునట్లును, వెచ్చగాను, వెలుగుగాను ఉండునట్లును, అడవి మృగములనుండియు, కౄరజంతువులనుండి రక్షణగా వారికి ఆయన అగ్ని స్థంభమును అనుగ్రహించెను.

2. మారా, ఏలీము, రెఫీదీము అను స్థలములలో దేవుడు అద్భుతరీతిగా వారి మందలకును, ఆ గొప్ప జనసమూహమునకును నీళ్ళు సమృద్ధిగా దయచేసెను. కనుక దేవుడు వారి అవసరములన్నియు తీర్చగలవాడని వారు నేర్చుకొనిరి. ***(నిర్గమ 13, 15, 17 అధ్యాయాలు)***

3. ఇశ్రాయేలీయులు తాము తీసుకొని వచ్చిన పులియని రొట్టెలు నిండుకొనగా దేవుడు సీను అరణ్యములో వారిని అత్యద్భుతముగా పోషించెను. విశ్రాంతి దినము మినహ అనుదినము వారి పాళెము పరిసరములలో మాత్రము పైనుండి మన్నాను కురిపింపజేసెను. ఇశ్రాయేలీయులు అరణ్యములో సంచరించిన 40 సంవత్సరములు ఈ అద్భుత ఆహారమును భుజించిరి. ***(నిర్గమ 16 వ అధ్యాయం)***

సీనాయి పర్వతము దగ్గర యెహోవాయైన దేవుడు మూడు రకములైన చట్టములు వారికి నియమించి ఇచ్చెను.

***a.* పది ఆజ్ఞలు - వ్యక్తిగత నైతిక ఆజ్ఞలు.**

***b.* సాంఘిక చట్టములు - సాంఘిక నీతి న్యాయములకు సంబంధించిన ఆజ్ఞలు.**

***c.* మత సంబంధమైన నియమములు, తన ప్రజలకు ఇచ్చిన ఆరాధన క్రమము.**

ఇట్లు దేవుడు తన ప్రజలకు ఆయన పరిశుద్ధతను బయలుపరెచెను. సీనాయి పర్వతము దగ్గర యెహోవా దేవుడు ఇశ్రాయేలీయులతోచేసిన నిబంధన సందర్భములో కొన్ని విషయములు మనము గమనించవలెను.

1. ప్రత్యక్షపు గుడారము నిర్మించి, ఆరాధన క్రమము స్థాపించునాటికి వారు ఐగుప్తునుండి బయలుదేరి ఒక సంవత్సరము పూర్తియాయెను.

2. ఆరాధన క్రమము ప్రారంభములో ఇశ్రాయేలీయులు ఒకే జనాంగమైరి. ఐగుప్తునుండి బయలుదేరినప్పుడు వారు విడుదల పొందినను క్రమము లేక, సణుగుకొనే బానిస ముఠాలుగా ఉండిరి. సీనాయి వద్ద వారు క్రమముగా నీతిన్యాయ నిబంధనలుగల యెహోవా యొక్క ప్రత్యేకపరిశుద్ధ జనాంగమైరి.

3. మరియు, వారిలో 20 సంవత్సరములకు మించిన వయస్కులకు సైన్యములోనికి పిలుపు ఇవ్వబడెను. ***(సంఖ్యా 1:1)***

4. ''మేము దేవుని ఆజ్ఞలను గైకొందుము, ఆయన ఆజ్ఞాపించునదంతయు చేసి, విధేయులమగుదము'' అని నాలుగుసార్లు ప్రమాణము చేసి, ***(నిర్గమ 19:9, 20:19, 23:4, 23:7)*** దేవునితో ఒక అంతిమ నిబంధన చేసినను, వారి విగ్రహారాధన వల్ల, దేవునిపై చేసిన తిరుగుబాటు వల్ల యెహోవా యొక్క తీర్పుకు తరచుగా గురియైరి. ***(నిర్గమ 32,33 అధ్యాయములు, సంఖ్యా 11-21 అధ్యాయములు.)***

ఈ విధముగా వారు పరిశుద్ధుడైన దేవుని కృపను తెలిసికొనిరి. దేవుని ప్రత్యేక జనాంగముగా ఆయన యెడల వారెట్లు ప్రవర్తించవలెనో అదియును వారు నేర్చుకొనిరి. వారు 40 సంవత్సరములు అరణ్యములో నివసింపవలెనని దేవుని ఉద్దేశము కాదు గాని వారు తమ అవిధేయతను బట్టియే 40 సంవత్సరములు అరణ్యములో సంచారము చేయవలసివచ్చెను. వారు కాదేషు మార్గమున నడిపింపబడి అక్కడనుండియే కానానులో దేశములో ప్రవేశింపవలెనని దేవుని ఉద్దేశము. అయితే వారికి దేవునిపై నమ్మకము తక్కువై కానాను వేగుచూడ వెళ్ళినవారి మాటలనే నమ్మి దేవుని మాటను అలక్ష్యము చేసి శిక్షకు పాత్రులైరి. తదుపరి వారు అరబ్బా అను లోతైన నీళ్ళులేని లోయగుండా ప్రయాణము చేసి, ఏదోమీయుల దేశమును చుట్టివెళ్ళి యోర్దానుకు తూర్పుదిశనున్న పర్వతప్రాంతములోని పల్లపు భూములకు

నడిపింపబడిరి. అక్కడ 4,000 అడుగుల ఎత్తయిన నెబో పర్వత శిఖరముపై మోషే మృతి చెందెను. అతని స్థానములో యెహోషువా నాయకుడుగా నియమింపబడెను. మోషే మృతి చెందకమునుపు ప్రజలందరికి ఆ 40 సంవత్సరములలో జరిగిన చరిత్ర అంతయు జ్ఞాపకము చేసి, వారికి మరియొకసారి పది ఆజ్ఞలను, న్యాయ చట్టములను తిరిగి అప్పజెప్పి దేవుడు వారిపట్ల చూపిన కృపా మహత్కార్యములు వివరించి ఆ సంగతులన్నిటిని ద్వితియోపదేశకాండమునందు వ్రాసెను. మోషే దేశములో అమలు జరుపవలసిన న్యాయచట్టముతోపాటు ఆరాధనా క్రమముకూడ వారికి రూపొందించెను. యెహోవా ఆజ్ఞ చొప్పున వారికి 7 పండుగలు నియమించినాడు. అవి

***1. పస్కా పండుగ,***

***2. పెంతెకొస్తు పండుగ,***

***3. శృంగ ధ్వనుల (బూరల) పండుగ,***

***4. ప్రాయశ్చిత్త పండుగ,***

***5. పర్ణశాలల పండుగ,***

***6. ప్రతిష్ఠిత పండుగ***

***7. పూరీము పండుగ*** అనునవి.

ప్రజలు కానాను దేశము చేరిన పిమ్మట వారు ప్రధానముగా సేద్యము చేయుదురని దేవునికి తెలుసును గనుక పై పండుగలలో మూడు ముఖ్యమైన పండుగలు వారి పంట పైరులకు చెందినవై యున్నవి. యెహోవా ఇశ్రాయేలీయులను విమోచించిన దేవుడు. అంతేకాక ఆయన సర్వ సృష్టికర్త మరియు సృష్టియావత్తు ఆయన ఆధీనములో వున్నది. అందువలననే ఆయనే ఏ ఏటికాయేడు తన అనుగ్రహము చొప్పున అందరికి పైరు పంటలు దయచేయుచున్నాడు.

## మూడు ముఖ్యమైన పండుగలు

**1. పస్కా పండుగ (పులియని రొట్టెలు),** యెహోవా తన ప్రజలను ఐగుప్తునుండి అద్భుత రీతిని విడుదల చేసిన విషయమును జ్ఞాపకార్థముగా ఆచరించవలసిన పండుగ. సంవత్సరములోని మొదటి నెలయగు అబీబు (మార్చి -ఏప్రిల్)లో ఈ పండుగ జరుపుకొనవలెను. ఆ పండుగ రోజునాడు ఇశ్రాయేలీయులు కృతజ్ఞతాభావముతో తమ ప్రథమ ఫలములుగా యవల పనను ఒకటి కోసి యెహోవా యెదుటికి తెచ్చి అల్లాడించి అర్పణముగా అర్పింతురు.

**2. పెంతెకొస్తు పండుగ (తొలిపంట యొక్క కోత),** అనగా 7 వారములు లేక 50 దినముల పండుగ అనికూడా అందురు. పెంతెకోస్తు అనగా ఏభై అని అర్థము. పస్కా తరువాత దీనిని ఆచరించవలయును. ఇది క్రొత్తపంట కొరకు కృతజ్ఞత తెలుపు పండుగ. యవల గోధుమల కోతలు మే - జూన్ అనగా సీవాను నెలలో ఆచరింపవలసిన పండుగ. సీనాయి పర్వతము దగ్గర దేవుడు వారికిచ్చిన దైవాజ్ఞలకు జ్ఞాపకార్థముగా కూడా ఈ పండుగను ఆచరించుదురు. (ద్వితీ 16:12)

**3. పర్ణశాలల (ఫల సంగ్రహ) పండుగ.** ఇది అక్టోబరు నెల, అనగా ఏతానీము నెలలో ఆచరింపబడును. ఇదే కాలములో ఒలీవ, ద్రాక్షాపంటలు కూడా సమకూర్చబడును. వీటితో సంవత్సరములో పండు పంటలన్నియు పూర్తి అగును. ఈ పండుగ ప్రాయిశ్చిత్తార్థమై, ప్రధానయాజకుడు అతి పరిశుద్ధ స్థలములోనికి

బలి రక్తము తీసికొని వెళ్ళి పాపములకు ప్రాయిశ్చిత్తము చేసెడివాడు.

ఈ మూడు పండుగ దినములలో ప్రతి పురుషుడు తప్పక యెహోవా సన్నిధిలో కనబడవలెను. ప్రత్యక్ష గుడారము లేక దేవాలయములో వారందరు కూడుకొనవలెను. ***(నిర్గమ 23:14-17, ద్వితియోవ 16:16-17)*** ఈ విధముగా ఇశ్రాయేలీయులు తమ విమోచకుడు, సృష్టికర్త, దయామయుడగు దేవుని జ్ఞాపకము చేసుకొని, ఘనపరచి, ఆరాధించెడివారు. మరియు పరిశుద్ధుడైన యెహోవా సన్నిధిలో తమ పాపముల నిమిత్తము బలులు అర్పించి, పాపక్షమాపణ పొంది తాము యెహోవాకు ప్రతిష్ఠింపబడిన ప్రజలమని యెహోవాతో చేసిన నిబంధనను వారు ఏటేట జ్ఞాపకముంచుకొనుచుండిరి.


సేద్యము చేయునది మగవారు గనుక వారి పైరు పంటలన్నియు ఆయన వాగ్దానముగా ఇచ్చిన దేశములోని పంటలే, గనుక వారాయన వాగ్దాములు నెరవేరినవనియు, ఆయన నిబంధన స్థిరమైనదనియు గ్రహించుచూ కృతజ్ఞతాస్తుతులు చెల్లింపవలెనని దేవుని ఉద్దేశ్యము. అందుకొరకే సంవత్సరమునకు ఒకసారి మగవారందరు తప్పక ఆయన సన్నిధిలో కనపడవలెనని ఆయన ఆజ్ఞాపించెను.



## <u>Bible Lesson No - 4</u> బైబిల్ పాఠము - 4

# కానాను దేశమును జయించుట (Conquering the Canaan)

యెహోషువా ఇశ్రాయేలీయులను 660 మీటర్ల ఎత్తయిన బల్ల పరుపు భూమినుండి 1000 మీటర్లు క్రిందికి అనగా మధ్యధరా సముద్ర నీటి మట్టముకన్న 330 మీటర్లు పల్లముగానున్న యొర్దాను లోయలోనికి నడిపించగా వారు నదిని ఆరిన నేలపై దాటి లోయ అద్దరి నెక్కి గిల్గాలు అనే స్థలము చేరిరి. అచ్చట వారు మజిలివేసి దేవుని మహా కృపాశక్తులను జ్ఞాపకము చేసికొని పస్కాపండుగను ఆచరించిరి. ఆ స్థలమందు యెహోవా దూత అనగా త్రిత్వములో రెండవ వ్యక్తియైన క్రీస్తు యెహోషువాకు యుద్ధ శూరుడుగా ప్రత్యక్షమై తాను యెహోవా సైన్యములను నడిపించుటకే వచ్చినట్లు తెలిపెను. కారణం అరణ్యములోగుండా తన సర్వోన్నతమైన మహిమతో 40 సంవత్సరములు ఇశ్రాయేలీయులను అగ్ని, మేఘ స్థంభములలో నుండి అద్భుతముగా ముందుకు నడిపించినదికూడా యెహోవా దూత అనబడిన క్రీస్తే. పాపులను ఎలప్పుడుకూడా రక్షణ మార్గములో నడిపించేది క్రీస్తే కనుక ఇప్పుడుకూడా వారిని దయతో నడిపించుటకు కృపామయుడైన క్రీస్తే యెహోవా దూతగా వచ్చినట్లుగా మనము గ్రహించవలెను. కనుపించని సైన్యాధిపతిగా క్రీస్తే వారికి తోడుగా నుండెను. (***యెహోషువా 1,5 అధ్యాయములు***)




బాహ్యనేత్రములకు కనిపించకపోయిననూ, వారు చేయనైయున్న యుద్ధములన్నింటిలోను ఇశ్రాయేలీయుల సైన్యమును నడిపించుటకు క్రీస్తే స్వయముగా పూనుకొనినాడు. ఆహా! ఆ మహాగొప్ప దేవుని ప్రేమకు ఎన్ని స్తోత్రములు అర్పించినా తక్కువే.


యెహోవా పంపిన ఆ మహా గొప్ప సైన్యాధిపతి అధిపత్యములో ఇశ్రాయేలీయుల సైన్యము బహువిచిత్రముగా పురోగమించి ఎత్తయిన, బలమైన ప్రాకారములుగల యెరికో పట్టణమును జయించి అందలి సమస్తమును నాశనము చేసెను. (***6వ అధ్యా***) తదుపరి యెహోషువా ప్రార్థన చేయక పోయినందున, మరియు దాచబడిన పాపము వారి మధ్య ఉన్నందువలనను హాయి అను చిన్న పట్టణముపైన అపజయము పొందిరి. అయితే కరుణామయుడైన దేవుడు ఇచ్చిన అవకాశమువలన ఆ పాపమును చక్కబెట్టుకొనిన తరువాత మాత్రమే వారు హాయిని జయించ గలిగినారు. (యెహో 7వ అ,8వ అ). అటు తరువాత వారు మూడు గొప్ప దండయాత్రలు చేసి దేశమంతటిని చాలవరకు జయించినారు. వారు ఈ క్రింది ప్రదేశములను స్వాధీనపరచుకొనిరి.

***మధ్య పర్వత ప్రదేశము***:- తమ అవిధేయతనుబట్టి హాయి పట్టణముమీద అపజయము పొందినామని ఇశ్రాయేలీయులు తెలుసుకొనిరి. దేవుని నడిపింపు లేనిచో జయము కలుగదని గ్రహించుకొనిరి.


అప్పటినుండి వారు ప్రార్ధనచేసి యుద్ధమునకు బయలుదేరెడివారు. షెకెమును జయించిన తరువాత దేవుడు మోషే ద్వారా వారికి సెలవిచ్చినట్లు వారు ఏబేలు, గెరెజీము పర్వతములమీద ధర్మ శాస్త్రములోని దీవెనలను శాపములను చదివి అక్కడ దేవునితో నిబంధన చేసిరి. ***(ద్వితియో 11:29, 28 అధ్యా; యెహోషువా 8:30-39)***

***<u>దక్షిణ పర్వత ప్రదేశము</u>***:-గిబియోనీయులు ఇశ్రాయేలీయులతో సంధిచేసికొనిరని విని అమ్మోనీయుల రాజులు ఏకమై గిబియోనీయులతో యుద్ధమాడుటకు బయలుదేరిరి. గిబియోనీయులు యెహోషువా యొక్క సహాయము కోరిరి. కావున వారి పక్షముగా యుద్ధముచేయుట దేవుని చిత్తమని గ్రహించుకొని, యెహోషువా, అమ్మోనీయుల ఐదుగురు రాజులమీదకు దండెత్తెను. యెహోషువా గిల్గాలు నుండి తన సైన్యమును మక్కేదా, లిబ్నా, లాకీషు, ఎగ్లోను, హెబ్రోను, దెబీరు అను పట్టణముల మీదుగా నడిపించి వాటిని నాశనము చేసెను. ఆదినమున దేవుడు బ్రహ్మాండమైన వడగండ్లు కురిపించినందున యుద్ధములో చనిపోయిన వారికంటె ఎక్కువమంది వడగండ్లవల్ల చనిపోయిరి. మరియు యెహోషువా ప్రార్ధనచేయగా దేవుడు సూర్యుని ఒకదినమెల్ల ఆకాశములోనే నిలిపివేసెను. ఈవిధముగా ఇశ్రాయేలీయులకు గొప్పవిజయము కలిగెను. అటుపిమ్మట దక్షిణ ప్రదేశమంతటిని వారు జయించి తిరిగి గిల్గాలు అను తమ పాళెమునకు వచ్చిరి. (యెహోషువా 10 వ అధ్యాయము)


***<u>ఉత్తర పర్వత ప్రదేశము</u>***:--ఇక్కడున్న కానాను రాజులందరు ఇశ్రాయేలీయులకు భయపడి ఒకరికొకరు సంధి చేసుకొని ఇశ్రాయేలీయులమీద యుద్ధమాడుటకువచ్చి మేరేము అను చిన్న సరస్సు దగ్గర తమ సైన్యములను కేంద్రీకరింపజేసిరి. వారి సైన్యము పెద్దది. వారికి విస్తారమైన రథములుగలవు. అయినను యెహోషువా దేవుని మాటచొప్పునచేయగా ఇశ్రాయేలీయులకు గొప్ప విజయము కలిగెను. యెహోషువా ఆరాజులందరిని హాజోరువరకు తరిమివేసి అక్కడనుండి ఉత్తరకొండలలో చాలా దూరము తరిమి వారిని చంపి దోపుడు సొమ్ముతో తిరిగి వచ్చి హసోరు పట్టణమును కాల్చి నాశనము చేసెను. ఈవిధముగా యెహోషువా కానాను దేశమంతటిని అనగా మన్యమును, పెఫెలా ప్రాంతమును, తీర ప్రాంతమునున్న మైదానమును జయించెను. అయినను ఆయాచోట్ల అన్యజనుల శేషము ఇంకను మిగిలిపోయెను.



# కానాను దేశవిభజన (Division of Canaan)




యకోబు 12 మంది కుమారులు 12 గోత్రకర్తలైరి. యోసేపు ఇద్దరు కుమారులైన ఎఫ్రాయిము, మనష్షేలనుండి రెండు గోత్రములు ఉద్భవించినవి. అనగా మొత్తం 13 గోత్రము. అయితే లేవి గోత్రికులు దేవునికి ప్రత్యేకించబడిన యాజకులు గనుక కానానులో వారికి స్వాస్థ్యమియ్యబడలేదు. ఇశ్రాయేలీయులు కానాను దేశములో ప్రవేశింపక మునుపు రూబేను, గాదు గోత్రికులు మరియు మనష్షే గోత్రీకులలో అర్థభాగము, యొర్దానుకు తూర్పువైపున ఉన్న సారవంతమైన ప్రదేశముగా ఉండుట చూచి దానిని స్వీకరించి అక్కడనే నివసింప మొదలుపెట్టిరి. అయినను కానాను దేశము పూర్తిగా స్వాధీనమగువరకు వారు యుద్ధములో సహాయము చేయవలసి వచ్చెను.


హిత్తీయులు
ఆరామీయులు
దాను
మధ్యధరా సముద్రం
ఆషేరు
నఫ్తాలి
గలిలీయ సముద్రం
మనష్షే అర్ధగోత్రం
జెబులూను
ఇశ్శాఖారు
గాదు
మనష్షే అర్ధ గోత్రం
యొర్దాను నది
అమోరీయులు
ఎఫ్రాయీము
బెన్యామీను
16
మృత సముద్రం
రూబేను
అమ్మోనీయులు
కనానీయులు
యూదా
ఫిలిష్తీయులు
షిమ్యోను
మోయాబీయులు
ఏదోమీయులు

యెహోషువా దండయాత్రలన్ని ముగిసిన తరువాత ప్రజలు చీట్లువేసి దేశమును విభాగించిరి.

1.ఆషేరు, జెబులూను, నఫ్తాలి గోత్రీకులు స్వాస్థ్యముగా పొందినది- ***ఎజ్రాయేలు లోయ, ఉత్తర కొండల ప్రదేశము.***

2. దాను, బెన్యామీను, యూదా, షిమ్యోను గోత్రీకులు స్వాస్థ్యముగా పొందినది- ***దక్షిణ పర్వతారణ్య ప్రదేశము.***

3. ఎఫ్రాయిము, మనష్షే అర్థగోత్రీకులు, ఇశ్శాఖారు స్వాస్థ్యము గా పొందినది- ***మధ్య పర్వత ప్రదేశము.***


4. రూబేను, గాదు, మరియు మనష్షే అర్ధ గోత్రీకులు స్వాస్థ్యముగా పొందినది.- ***యోర్దానుకు తూర్పునున్న బల్ల పరుపు భూమి.***

అన్ని గోత్రములకు స్వాస్థ్యములలో లేవీయులకు పట్టణములు ఇవ్వబడినవి. ప్రత్యక్ష గుడారము దేశము మధ్యలోనున్న షిలోహులో నిర్మింపబడెను. అక్కడనే యెహోవాకు ఆరాధన జరిపించి, పండుగలు ఆచరించు నిమిత్తము ప్రజలందరు అక్కడకు కూడి వచ్చెడివారు.

కానాను దేశములోని అన్య నివాసులు మిక్కిలి భ్రష్టులు మరియు ఘోరవ్యభిచారముతో కూడిన విగ్రహారాధనను జరిపించెడివారు. అందువలన వారి శరీర ఆత్మలు మరియు మనస్సులు పూర్తిగా చెడిపోయినవి. కనుక దేవుడైన యెహోవా, వారినందరిని నిర్మూలము చేయవలెనని తలంచి ఇశ్రాయేలీయులకు ఆజ్ఞయిచ్చెను. కాని ఇశ్రాయేలీయులు అట్లు చేయక దేవుని ఆజ్ఞను తిరస్కరించిరి. యెహోషువాయు మరియు ఇశ్రాయేలీయులపెద్దలు ఉన్నంతవరకు ప్రజలు యెహోవాను సేవించిరిగాని, వారి తదనంతరము ప్రజలందరుకూడా యెహోవానైనను, ఆయన కార్యములనైనను ఎరుగనటువంటి దుర్మార్గమైన తరముగా మారిపోయిరి. యెహోవాను ఎరుగక పోవుటయే దుర్మార్గముగా ప్రవర్తించుటకు కారణము ( 1 సమూయేలు 2:12). వారు యెహోవాను విసర్జించి అన్య దేవతలను పూజించిరి. అన్యజనులతో కలసి స్నేహముచేసి మరల విగ్రహారాధన చేయసాగిరి.

వారు ఆవిధముగా పాపముచేయుచూ తమ ఆత్మలకును దేహములకును అపవిత్రత కలుగజేసికొనిరి. దేవుడు ఏది వద్దని చెప్పెనో అదేచేసిరి. యెహోవాను విసర్జించుట శిక్షకే కారణం. ఈసంగతులన్నియు ఎరిగియుండియు వారు దేవుని విసర్జించి అన్య దేవతలను పూజించిరి. అందువలన యెహోవా కోపము వారిమీద మండెను కనుక ఆ పాపమునుబట్టి దేవుడు ఇశ్రాయేలీయులను శత్రువుల చేతికి అప్పగించియున్నాడు. అనగా శత్రువులను మాటిమాటికి ఇశ్రాయేలీయులమీదకు శిక్షగా పంపి వారికి మిక్కిలి బాధలను కలుగజేసెను (న్యాయా 1-2 అధ్యాయాలు).

# కనాను దేశ నైసర్గిక స్వరూపము (Archaeology of Canaan)




కొనాను దేశము చాల చిన్నదైనను, దానిలో విభిన్నములైన ప్రదేశములు కలవు. ఎత్తయిన కొండలు, మధ్యధరా సముద్రము మట్టముకన్న మిక్కిలి లోతైన యొర్దాను నదీ లోయ, వృక్ష సంపదగల ప్రదేశములు, చెట్లు చేమలులేని ఎడారులు, సారవంతమైన మైదానములు శిలా మయమైన నీరులేని ప్రాంతములున్నవి. మొత్తంమీద ఉత్తర ప్రాంతమంతయు ఎక్కువ వర్షపాతముగల సారవంతమైన ప్రదేశము. దక్షిణ ప్రాంతమంతయు, కొండలు మైదానములు, రాళ్ళు రప్పలతో విశేషముగా పచ్చికలేని ప్రదేశము. వర్షము బహు తక్కుగా కురియును. అది మందలను మేపే ప్రదేశము. ఉత్తర ప్రాంతమున శీతాకాలములో మిక్కిలి చల్లగా ఉండును. వేసవి కాలములో అంత ఎక్కువ ఉష్ణోగ్రత ఉండదు. అయితే దక్షిణ ప్రాంతములోను యోర్దాను లోయలోను శీతాకాలమందు చలి లేదు. మరియు వేసవి కాలములో

విపరీతమైన ఉష్ణోగ్రత వుండును. గలిలయ ప్రాంతములో కొండలు కూడ గలవు. భూమి సారవంతమైనదగుటవలనను, వర్షము అధికముగా కురియుచున్నందువల్లను చెట్లు ఎక్కువగా నున్నవి. ఆయా లోయలలో పంటలు ఎక్కువగా పండించుదురు. ఇప్పుడు ఆ ప్రదేశములన్నిటిని గూర్చి విపులంగా పటము సహాయంతో తెలుసుకుందాం.

1. ఉత్తర ప్రదేశము:-- దేశమునకు నైఋతి దిశను లెబానోను పర్వతములు కలవు. వీటిలో హెర్మోను పర్వతము అన్నిటికంటే మిక్కిలి ఎత్తయినది. దాని ఎత్తు 3,300 మీటర్లు. దానిపై నిత్యము మంచు నిలుచును. ఈ లెబానోను పర్వతముల మధ్యనే యొర్దాను నది ఉద్భవించినది. ఈ ఉత్తర ప్రాంతమున శీతాకాలమున మిక్కుటమైన చలి గాలులు వీచును. నవంబరు నుండి మార్చి వరకు వర్షపాతము కూడా అధికము. అందువలన అచ్చటి ప్రజలు చలితో బాధపడుదురు. ఏప్రిల్‌లో వసంత ఋతువు ప్రవేశముతో చలి తగ్గిపోవును. ఇచ్చటి కొండలన్నియు పచ్చని గడ్డితోను అందమైన అనేక గడ్డి పూవులతోను ఎంతో రమ్యముగా కనుపించును. (మత్తయి 6:28-30) వేసవి కాలమున గడ్డి చాలవరకు ఎండిపోవును. కాని వేడి అంత ఎక్కువ వుండదు.

2. మధ్య ప్రదేశము:-- మధ్యధరా సముద్రము నుండి యొర్దాను లోయ వరకు ఒకే ఒక విశాలమైన లోయ కలదు. దాని పేరు యెజ్రాయేలు లోయ. అది సారవంతమైన సస్యశ్యామల ప్రదేశము. గొప్ప సామ్రాజ్యాలైన బబులోను, అష్షూరులనుండి, ఈ లోయమీదుగ ఐగుప్తు వరకు ఒక రాజబాట పోవుచున్నందున ఇచ్చట పూర్వము అనేక యుద్ధములు జరిగినవి. దానికి ఉత్తరమున గలిలయ ప్రాంతపు కొండలు గలవు. దక్షిణమున గిల్బోవ పర్వతమున్నది. (దీనిపైనే సౌలు యోనాతానులు యుద్ధమందు మరణించిరి. 1 సమూయేలు 31 అధ్యాయము). మధ్యధరా సముద్రపు సరిహద్దున కర్మెలు పర్వతము గలదు. (ఇచ్చటనే ఏలియా బలి అర్పించెను.)

3. దక్షిణ ప్రదేశము:-- ఇక్కడ కూడ పర్వతములు, కొండలు గలవు గాని వర్షపాతము తక్కువైనందున, ఎటుచూచినను రాతి ప్రదేశమైనందున అంత పచ్చదనము కానరాదు. ఈ భూమి పంటలకు యోగ్యము కాదు. వట్టి ఎడారి ప్రదేశము. ప్రజలు త్రవ్వుకొనిన నూతులలోని నీటిపై ఆధారపడియుందురు. నేలంతయు గులక రాళ్ళతో నిండి యుండును. ఇక్కడ వర్షము శీతాకాలములో మాత్రము చెదురుమదురుగా కురియును. వేసవి కాలమున నీటి వాగులన్నియు పూర్తిగా ఎండి పోవును. అందువలన గొర్రెల, మేకల మందలు మేపేవారు తప్ప ఇంకెవ్వరును అక్కడ అంతగా నివసింపలేరు. దీనిని యూదా అరణ్యమని అందురు.

4. మధ్యధరా సముద్రపు ఒడ్డు:-- ఉత్తరమునుండి దక్షిణమువరకు ఈ ఒడ్డునకు మధ్యనున్న పర్వతమునకును సమాంతరముగా ఒక మైదానమున్నది. పర్వతముల అడుగు భాగమున కొండ చరియలు గలవు. వాటికి ''షెఫేలా'' అని పేరు. (ఇచ్చటనే సంసోను నివసించెడివాడు) ఈప్రాంతములో గోధుమలు,

యవలు మొదలగు పంటలు పండును. ఇక్కడ మిక్కిలి సారవంతమైన లోయలు ఎన్నో కలవు. శీతా కాలమున అంత చల్లగా లేనందువల్ల కొండ చరియలపై ద్రాక్షతోటలు, ఒలీవ చెట్లును ఇంకా దక్షిణ ప్రాంతములో అంజూరపు చెట్లు, బాదం చెట్లు ఉండును.

దక్షిణమునకు వెళ్ళు కొలది వర్షపాతము బహు తక్కువ. ఆ ప్రాంతము కేవలము అరణ్యము. దానిని నెగేవ్వ అందురు. (నేటి కాలమందు ఇశ్రాయేలీయులు గలిలయ సముద్రమునుండి సిమ్మెంటు పైపుల ద్వారా విస్తారముగా నీటిని ఈ ప్రాంతమునకు సరఫరా చేయుచున్నారు. "అరణ్యము, ఎండిన భూమియు సంతోషించును, అడవి ఉల్లసించి కస్తూరి పుష్పమువలె పూయును." అని ప్రవక్తయైన యెషయా చెప్పిన ప్రవచనములు నేడు నెరవేరినవి. (యెషయా 35:1).

5. యోర్దాను నది:-- యోర్దాను అను మాటకు క్రిందికి వెళ్ళునది అని అర్థము. అది సరియైన పేరే. ఇలాటి నది ప్రపంచములో మరి ఎక్కడా లేదు. 3,300 మీటర్ల ఎత్తయిన హెర్మోను పర్వతము మీదనున్న మంచు కరిగి ఆ నీరు మెరోము సరస్సు లోనికి వచ్చి అక్కడ నుండి మధ్యధరా సముద్రపు నీటి మట్టము కన్న 220 మీటర్లు క్రిందిగా నున్న గలిలయ సముద్రములోనికి ప్రవహించును. అనగా నీరు హెర్మోను పర్వతము నుండి, గలిలయ సముద్రము వరకు 3,520 మీటర్లు క్రిందికి ప్రవహించును. అక్కడ నుండి యోర్దాను నది తిన్నగా ఉత్తరమునుండి దక్షిణ దిక్కునకు మిక్కిలి లోతైన యోర్దాను లోయగుండా మృత సముద్రము వరకు ప్రవహించును. ఈ సముద్రము మధ్యధరా సముద్రము నీటి మట్టము కన్న 430 మీటర్లు దిగువగా ఉన్నది. మరియు అది 100 మీటర్లు లోతుగా ఉన్నది. గలిలయ సముద్రము నుండి మృత సముద్రము వరకు 1,04,000 మీటర్ల దూరము. యొర్దాను లోయ ఇరువైపుల గోడల వంటి ఎత్తైన కొండలు గలవు. ఆ నది దాటుట బహు కష్టతరమైన విషయము. సాధారణముగా ఆ నదిని దాటుటకు సరియైన మార్గము ఉండేది కాదు. ఒక స్థలమందైతే నది ఇరుకైన లోయగుండా వడిగా ప్రవహించి భయంకరమైన జలపాతముగా మారి పెద్ద పెద్ద రాళ్ళ మీద నుండి క్రిందికి దూకి ప్రవహించుచుండును. దక్షిణ ప్రాంతమున నదీ తీరమునందు అచ్చటచ్చట దట్టమైన పొదలున్నది.

మృత సముద్రము సమీపించేకొలది యోర్దాను నది విశాలమైన లోయగుండా ప్రవహించుచు, రెల్లు గడ్డితో కూడినదై మరియు నదీ గర్భమున బంక మట్టితో నిండి నెమ్మదిగా పారును. శీతా కాలమున వర్షపాతము ఎక్కువ అగుటచే భయంకరమైన వరదతో నిండి మిక్కిలి ప్రమాదకరముగా ప్రవహించుచుండును. విపరీతమైన బంక మట్టితో నిండి ఉండుట వలన వేసవికాలములో నది అంతా కూడా బురద నీటితో నిండి ఉండును. అందుచేతనే నయమాను ఆ నదిలో స్నానము చేయుటకు సంశయించెను.

6. గలిలయ సముద్రము:-- ఇది విస్తారమైన చేపలతో నిండి యున్నది. ఇది కేవలము సముద్రమే కాని యోర్దాను నదీ జలాలతో నిండినందు వలన ఇందలి నీరు మంచినీరుగా ఉన్నది. గలిలయ సముద్రము

మిక్కిలి లోతుగా ఉన్న కారణమున అక్కడి జాలరులు దోనెల సహాయముతోనే చేపలు పట్టుకొందురు. ఈ సముద్రము చుట్టు ఎత్తైన కొండలు కలవు. ప్రభువైన క్రీస్తు దినమెల్ల ప్రజల మధ్య పలు రకములైన సేవ చేసి రాత్రి వేళ ఈ కొండలలో అనేక సార్లు ఒంటరిగా ప్రార్థన చేసెడి వాడు. తూర్పు దిక్కునున్న కొండల మీదనుండి అప్పుడప్పుడు అకస్మాత్తుగా బలమైన గాలి వీచి చిన్నచిన్న తుఫానులు రేగుచుండును. లోతు ఎక్కువ కనుక అలలు  కూడా విపరీతమైన ఎత్తులో లేచును. కనుక అప్పుడు ఆ సముద్రము మీద దోనెలలోనుండుట అపాయకరము. ప్రభువు తుఫానును నిమ్మళ పరచిన సంఘటను ఈ సందర్భముగా జ్ఞాపకము చేసుకొనవలసి యున్నది.

7. మృత సముద్రము:-- ఇది యోర్దాను లోయలో మిక్కిలి దిగువ భాగము. నీరు అందులోనుండి బయటకు ప్రవహించే మార్గము లేనేలేదు. చూట్టును చెట్లు చేమలు లేని భయంకరమైన కొండలు పర్వతములు గలవు. అవి అగ్ని పర్వతముల వంటివి. మొదట అక్కడ ఏ సముద్రము ఉండెడిది కాదు. మొదట అది ఒక పచ్చగడ్డి లోయ. ఇక్కడ విస్తారమైన పచ్చగడ్డి లభించును. ఈ లోయను పరిశుద్ధ గ్రంథములో యెహోవా తోటతో పోల్చినారు. ఈ పచ్చగడ్డి లోయకు కొంచెము దూరములో సొదొమ గొమొర్రా పట్టణములు ఉండెడివి.  ఈ పచ్చగడ్డి లోయను చూచే లోతు తన మందల నిమిత్తము ఎంచుకొని సొదమ వైపు వెళ్ళెను. (ఆది 13అధ్యా) కాని దేవుడు ఆ పట్టణములపై చూపిన భయంకరమై తీర్పు అనగా అగ్ని గంధకములచేత ఆ పట్టణములను నాశనము చేయగా ఆ భయంకరమైన వేడి వలన ఈ లోయ చూట్టు ఉన్న అగ్ని పర్వతములు కూడ బ్రద్దలైనవి. వాటినుండి పైకి ఎగ జిమ్మబడిన లావా మరియు పట్టణములను కాల్చివేసిన అగ్ని గంధకములు కలసి ఈ లోయలోనికి  ప్రవహించినప్పుడు పచ్చ గడ్డి అంతయు కూడా కాలిపోయెను. ఈ సంధర్భంగా కలిగిన భయంకరమైన భూకంపముల వలన కూడా ఈ లోయ చాలా క్రిందకు దిగి పోవుట వలన యోర్దాను నీరు ఈ లోయలోనికి ప్రవహించుట ప్రారంభమైనది. చుట్టూ ఏర్పడిన లావా పొరల వలన యోర్దాను నీరు ఆ లోయను దాటి బయటకు వెళ్ళలేక అక్కడనే నిలచిపోయి ఒక మహా సముద్రముగా మారినది.

అయితే ఆ నిలిచి పోయిన యోర్దాను నీరు, లోయలోనున్న లావాతోను అగ్ని గంధకములతోను రసాయనిక క్రియజరుగుటవలన ఆలోయలో నిలిచిన నీరు  విషపుతో కూడిన ఉప్పు నీరుగా మారినవి. అందువలన ఆ విషపు ఉప్పు నీటి ప్రభావము వలన  ఎటువంటి జీవరాసులే కాకుండ కనీసం బాక్టీరియా సూక్ష్మజీవులు కూడా అ నీటిలో  నివసింపలేనందువలన అ సముద్రమునకు మృత సముద్రమని పేరు వచ్చెను.

ఆ ప్రదేశము గంధకమయము మరియు మిక్కిలి ఉష్ణ మండలము అగుటచేత మృత సముద్రము పరిసర ప్రాంతములు ఉప్పుతోను ఉప్పుగాలులతోను నిండి యుండుట వలన అది మానవ నివాసయోగ్యముగా లేకుండెను.  అందు వలన నేటి వరకు కూడా ఆ ప్రదేశము భయంకర నిర్జన ప్రదేశముగనే ఉండి పోయినది. ఈ మృత సముద్ర పరిసర ప్రాంతములలో పురావస్తు శాస్త్రజ్ఞులు ఉప్పుతో

ఏర్పడిన ఒక పెద్ద స్థంబమును కూడా కనుగొనిరి. (హోలీ లాండ్ పుస్తకము చూడుము) ఈ ఉప్పు స్థంబము దేవుని ఆజ్ఞను మీరి వెనుకకు తిరిగి చూచి శాపమునకు గురియైన లోతు భార్యదని వాఖ్యాన కర్తల అభిప్రాయము.

8. యొర్దాను ఆవలి భాగము:-- అది తూర్పు వైపునున్న బల్లపరుపు భూమి. అచ్చట అంతగా వర్షము కురియదు. దక్షిణ దిక్కున అరణ్య ప్రదేశముగా ఉన్నది. కాని ఉత్తరమునకు పోయిన కొలది పచ్చి గడ్డి నిండిన మైదానములు కొండలు కలవు. అందువలన కాపరులు ప్రాంతములలో ఎక్కువగా పశువులను మేపుచుందురు. పశువుల కొరకు పచ్చగడ్డి ఇక్కడ సమృద్ధిగా దొరుకును. అక్కడ ఎక్కువగా పట్టణములు లేవు. ఎందుకనగా ఈ ప్రాంతము చుట్టూ కూడా ఎడారి మరియు శత్రువులు (అమ్మోనీయులు, అమ్మోరీయులు, మోయాబీయులు, ఏదోమీయులు మొదలైనవారు) ఉండుట వలన ఆ కాలములో ఎవరు కూడా పట్టణములు ఇక్కడ కట్టలేక పోయిరి. ఈ శత్రువులు తరచుగా వచ్చి అక్కడ ఉన్నవారిని దోచుకొని పోయెడివారు. ఈ ప్రాంతములోనే కెరీతు వాగు కలదు. ఈ కెరీతు వాగు దగ్గరే దేవాది దేవుడు ఏలియాను కాకోలములచేత అత్యద్భుతముగా పోషించినాడు. ఈ ప్రాంతములోనే యబ్బోకు రేవు కలదు. యాకోబు తన ఇద్దరు భార్యలతోను తన ఇద్దరు దాసీలతోను తన పదకొండు మంది పిల్లలతోను ఈ యబ్బోకు రేవు దాటించి వారిని పంపివేసిన తరువాతనే దైవ దర్శనము కలిగి ఇశ్రాయేలుగా మారినాడు. ఈ అద్భుత సంఘటన ఆది కాండము 32:22-32 వచనములలో చూడగలము.

యెహోషువా చనిపోయిన తరువాత దేవుడు ఇశ్రాయేలీయులను కపాడుటకై న్యాయాధిపతులను ఏర్పాటు చేసినాడు.




Bible Lesson No - 7 **బైబిల్ పాఠము -7**

## న్యాయాధిపతుల కాలము (At the Time of Judges)

**యె**హోషువ తన జీవిత కాలమంతయు దండ యాత్రలు జరిపినను కానాను దేశములోని అన్య జనులను అందరిని వెళ్ళగొట్టలేకపోయెను. ఆయా గోత్రీకులు తమ తమ స్వాస్థ్యముల పొందిన పిమ్మట ఆయాచోట్ల నివసించే అన్యులను ఎవరికి వారే వెళ్ళగొట్టవలసివచ్చెను. అయినను ఏ గోత్రపు వారును ఆ అన్యజనులను పూర్తిగా వెళ్ళగొట్టలేకపోయిరి. (న్యాయ 1:21 -36) అందువలన ద్వితీయోపదేశకాండము 28వ అధ్యాయము లోని శాపములు ఇశ్రాయేలీయులు తమ మీదికి రప్పించుకొనిరి. యెహోవా దూత, అనగా అరణ్యముగుండ, అగ్ని, మేఘ స్తంభములో 40 సం॥లు వారిని నడిపించి, తరువాత యెహోవా

సేనాధిపతిగా యెహోషువాకు ప్రత్యక్షమైన క్రీస్తు, గిల్గాలులో యెహోషువా చనిపోయిన తరువాత మరియొకసారి ప్రత్యక్షమై ఇశ్రాయేలీయులు దేవుని చిత్తము చొప్పున అన్య జనులను వెళ్ళగొట్టలేకపోయినందువల్ల తాను ఇక వారికి సహాయము చేయనని చెప్పెను.




శేషించిన కానానీయులు వారికి ప్రక్కలో శూలములుగా ఉందురనియు, వారి దేవతలు ఇశ్రాయేలీయులకు వురిగా ఉందురని చెప్పెను. ప్రజలు ఎంత ఏడ్చినను ఈ పరిస్థితి వారికి తప్పలేదు. (న్యాయా 2 అధ్యాయయు)

కానాను దేశమునందలి జాతులవారిని ఈ క్రింది విధముగా విభజింప వచ్చును.

1. కానానీయులు:- కానానీయులు ఒక్కజాతి వారు కారు. లోయలలో నివసించుచు, సేద్యము చేయు ఏడు జాతులవారిని కానానీయులని పిలిచెడివారు.

2. అమ్మోరీయులు:- వీరు కూడా ఒకే జాతివారు కారు. కొండలపై నివసించుచు మందలను మేపుకొనువారు. యోర్దానుకు తూర్పువైపున ఉన్నవారిలో వీరు ఒకరు.

3. ఫిలిష్తీయులు:- వీరు మధ్యధరా సముద్రములోని క్రేతు అను ద్వీపమునుండి వచ్చి, కానాను దేశములోని ఈశాన్య దిశగా సముద్రతీరమున ఆరు పట్టణములను ఏర్పాటు చేసుకొని నివసించెడివారు. (గాజా, ఎగ్లోను, గాతు, ఎక్రోను, అష్టోదు మరియు అష్కాలోను అనునవి)

4. హిత్తీయులు, ఆరామీయులు:- వీరు ఉత్తర ప్రదేశమునుండి వచ్చి కానానుకు ఉత్తర దిక్కుగా స్థావరములు ఏర్పాటు చేసుకొనినారు.

5. మోయాబీయులు, అమ్మోనీయులు:- వీరు లోతునకు అతని కుమార్తెలకు జన్మించిన వారి సంతానము. దేవుని చేత మేలు పొందికూడా దానిని మరచి భ్రష్టులుగా ప్రవర్తించి కనినటువంటి సంతానము గనుక దేవుని శాపము పొందుకొనినవారు. వీరికి పది తరముల వరకు యెహోవా సన్నిధిని చేరకూడదనే శాపము కలదు. (ద్వితి. కా 23:8) వీరు యోర్దానుకు ఆవలివైపున అనగా తూర్పు ప్రదేశమున నివాసము. ఎర్పరచుకొనిరి.

6. ఏదోమీయులు:- వీరు ఇస్సాకు సహోదరుడైన ఏశావు (ఏదోము) నుండి వచ్చిన వారు. దేవుని కృపవలన వారు ఒక దేశమును ఎర్పరచుకొని కానానుకు దక్షిణముగా నివసించువారు.

ఆ కాలమును అందరు ప్రాకారములు గల పట్టణములలో నివసించుచుండెడివారు. ఒక్కొక్క పట్టణమును ఒక సామంతరాజు ఏలెడివాడు. వారు తరచుగా ఒకరితో నొకరు యుద్ధములు చేయుచుండెడివారు. బయటనుండి ఎవరైన బలమైన శత్రువులు వచ్చినప్పుడు వీరిలో వీరే సంధిచేసుకొని ఆ శత్రువులతో యుద్ధము చేసెడివారు.

వారి దేవుండ్లు స్థానిక దేవుండ్లు. కొండజాతివారికి కొండ దేవతలు, లోయజాతి వారికి మైదాన దేవతలు, అరణ్య జాతుల వారికి అరణ్య దేవతలుగా ఉండెడివారు. ఫిలిష్తీయులకు మత్స్యదేవుడు ప్రధానమైనవాడు. అయితే ఎక్కువ జాతులవారికి ఉమ్మడిగా 'బయలు' దేవుడుగా ఉన్నాడు. బయలు అనగా యజమానుడు లేక పెనిమిటి అని అర్థము. ఉదాహరణ 'బయల్పేయో' (న్యాయా 3:3, 1దినవృ 1:49, యెహో 11:17, సంఖ్యా 25:3, న్యాయా 8:34, యెహో 13:17 మొదలగునవి.) అదేవిధముగా ఎక్కువ జాతులవారికి ఉమ్మడిగా 'అష్తారోతు' అను ఆడదేవత ఉండేది. 'అష్తారోతు' అనగా తల్లి అని అర్థము. బయలు అను మగ దేవుడు ఆకాశమునుండి సూర్యరశ్మిని, వర్షమును, మంచును అనుగ్రహించగా, అష్తారోతు అను ఆడ దేవత భూగర్భములోనుండి పైరు పంటలు పండించేదని వారి ముఖ్యమైన మూఢ

నమ్మకము. వారు పూజలు చేయుటకు బయలు దేవుడు అను పేరుమీదుగా ఒక చెట్టు మ్రానుతో మానవాకారముగా చెక్కి దీని ప్రక్కన ఒక సన్నని స్థంభమును నిలువబెట్టెడివారు. అది అష్తారోతు దేవతకు గుర్తుగా ఉండెడిది. ఈ రెండు విగ్రహములను చెట్లుగల ఒక ఉన్నత స్థలములో నిలువబెట్టి అచ్చట ఒక బలిపీఠమును కట్టి దాని మీద ప్రత్యేకమైన బలులు అర్పించెడివారు. (న్యాయా 6:25-32) అట్టి బలిపీఠముల మీద పూర్వము నరబలులు మరియు చిన్న పిల్లలను బలిగా అర్పించెడు సాంప్రదాయము ఎక్కువ జాతులలో కలదు. మరియు వారి పూజా విధానము, చూచుటకు కూడా వీలులేని విపరీతమైన ఘోర వ్యభిచారముతో కూడి యుండెడిది. అందువలననే వారు మానసిక, శారీరిక భ్రష్టత్వం గలిగినవారు కనుక, వారి భ్రష్టత్వం ఇశ్రాయేలీయులకు సోకకుండా దేవుడు వారిని పూర్తిగా నిర్మూలము చేయమని ఆజ్ఞ ఇచ్చెను. న్యాయాధిపతుల గ్రంథములో ఈ సంఘటనల క్రమము మనకు కనిపించుచున్నది.

అయితే ఇశ్రాయేలీయులు యెహోవాను విడచి అన్యజనులతో స్నేహముచేసి వారితోబాటుగా విగ్రహారాధీకులైనారు. యెహోవా కోపాగ్ని ఇశ్రాయేలీయులమీద రగులగా శత్రువులు వారిని బాధించిరి. వారు యుద్ధములవలనను, భయంకర మైన వ్యాధులవలనను, నష్టములవలనను శపించబడిరి. వారు శ్రమకాలములో యెహోవాకు మొర్ర పెట్టగా ఆయన ఆయా శత్రువులతో యుద్ధమాడి వారిని విడిపించుటకు రక్షకులను ఏర్పరచెను. దేశములో వారి ఆధిపత్యము ఉన్నంతవరకు దేశము ప్రశాంతముగా నుండెను. కాని ఆ సుఖమును బట్టి ప్రజలు మరల యెహోవాను మరచిపోయి అనేకసార్లు పాపము చేసి అయా శ్రమలను మాటి మాటికి అనుభవించెడి వారు. మొత్తం పదమూడు మంది న్యాయాధిపతులను దేవుడు ఏర్పాటు చేసినాడు. కాని వారందరు 12 గోత్రములను ఏలినవారు కారు. వారు స్థానిక న్యాయాధిపతులు మాత్రమే. ఈ పాఠము చివర ఇవ్వబడిన పట్టికలో చూచినట్లయిన వారు ఏయే శత్రువులతో యుద్ధమాడినారో ఎన్ని సం॥లు న్యాయాధిపతులు దేశమునకు నెమ్మది కలుగ జేసినారో తెలిసికొనవచ్చును. మొత్తం దాదాపు 200 సంవత్సరములు న్యాయాధిపతులు దేశమును ఏలిరి. ఆ కాలములో దాను గోత్రపువారికి ఇవ్వబడిన స్వాస్థ్యము చాలక పోయినందువల్ల వారిలో కొంతమంది ఉత్తర దిశకు వెళ్ళి ఒక క్రొత్త ప్రాంతములో నివాసము ఏర్పరచుకొనిరి. (న్యాయా 1:34, 18:1)

ఈ పదముగ్గురు న్యాయాధిపతులు యుద్ధమాడి ఫిలిష్తీయులను మాత్రమేగాక షుమారుగా తక్కిన అన్య జనులందరిని పూర్తిగా ఓడించిరి. కాని సంసోను చనిపోయిన తరువాత ఫిలిష్తీయులు తిరిగి దేశమంతటిని ఆక్రమించుకొనుటకు ప్రయత్నించిరి. (న్యాయా 17 అధ్యాయము - 21 అధ్యాయము) అప్పుడు దేశము ఎంత హీనదశకు వచ్చినదో మనము తెలిసికొన వచ్చును. ఆ దినములలో ఇశ్రాయేలీయులకు రాజులేడు. ప్రతివాడు తన ఇష్టానుసారముగా ప్రవర్తించుచువచ్చెను. (న్యాయా 21:25)

ఇట్టి దౌర్భాగ్య స్థితి ప్రబలియుండగా ప్రధాన యాజకుడైన ఏలీ న్యాయాధిపత్యము చేపట్టెను, కాని తన స్వంత కుమారులనే సరియైన క్రమశిక్షణలో పెట్టలేనందున ఫిలిష్తీయులను ఏమాత్రమును జయించలేక పోయెను. ఇశ్రాయేలీయులు తరచుగా వారితో యుద్ధమాడవలసి వచ్చెను. ఆకాలమందు

అన్యజనులు తమ దేవతలను యుద్ధరంగములో సైన్యమునకు ముందు నడిపించెడివారు. అందువల్ల ఒక యుద్ధములో ఇశ్రాయేలీయులు దేవుని మందసమును అతి పరిశుద్ధ స్థలములోనుండి యుద్ధరంగమునకు తీసికొనిరాగా అది ఫిలిష్తీయులచేతికి చిక్కెను. (1 సమూ 5-6 అధ్యా)

ఆకాలమందు దేవుడు సమూయేలును న్యాయాధిపతిగాను, యాజకుడుగాను ప్రవక్తగాను ఉండుటకు సకలవిధముల ప్రజలను నీతిన్యాయములయందును, యెహోవా యందలి భయభక్తులయందును, నడిపించుటకు నియమించెను. అతని జీవితకాలమంతటిలో ఫిలిష్తీయులతో ఘోర యుద్ధములు జరిగినవి. ( 1 సమూ 14:52)

---

## Bible Lesson No - 8      బైబిల్ పాఠము -8

# సౌలు రాజ్యము (The Kingdom of Saul)

న్యాయాధిపతుల పాలన ఆఖరు దినములలో ఇశ్రాయేలీయుల గోత్రములు మూడు గుంపులుగా ఏర్పడిరి.

1. తూర్పు యోర్దాను ప్రాంతపు గోత్రములు

2. ఉత్తర కొండల ప్రాంతపు గోత్రములు

3. యెజ్రాయేలు లోయనుండి దక్షిణ ప్రాంత గోత్రములు.

ప్రత్యక్షపు గుడారము ఎఫ్రాయిము ప్రాంతములోని షిలోహులో నున్నది. ప్రజలందరు పండుగలనాచరించుటకై అచ్చటికే వెళ్ళవలసి వచ్చెడిది. గాని దైవభీతి వారిలో సన్నగిల్లినందున ప్రజలు అంత ఎక్కువగా వెళ్ళెడివారు కారు. ఈ విధముగా ఉండగా తూర్పు ప్రాంతపు వారికిని, దక్షిణ ప్రాంతపు వారికిని విభేదములు ఏర్పడినవి.

ఆ కాలములో ఫిలిష్తీయులు ఇశ్రాయేలీయుల దేశమును పూర్తిగా ఆక్రమించుకొనవలెననెడి ఉద్దేశముతో తరచుగా వారితో యుద్ధములాడెడివారు. అందువలన పంన్రెండు గోత్రికులును ఏకమై తమకు యుద్ధశూరుడైన ఒక రాజును నియమించుకొంటేనేగాని ఫిలిష్తీయులు లొంగిరారని అభిప్రాయపడిరి. ఆ దినములలో అన్యులు తమ రాజులు దైవ సమానులని భావించెడివారు. అందువలన ఇశ్రాయేలీయులకు రాజును నియమించినట్లయిన త్రియేక దేవుడైన తనను మరచి అన్యుల ఆచారము ప్రకారము ఆ రాజును దైవముగా భావించు అవకాశముగలదని దేవుడైన యెహోవా తానే దేవుడును రాజునైయుండి తాను నియమించిన ప్రవక్తలైన న్యాయాధిపతులచేత రాజ్యమునేలుచుండెను. అందువల్ల రాజును నియమించుట దేవునికి ఇష్టములేకుండెను. రాజును నియమించుటవల్ల ఎటువంటి శోధనలు, శ్రమలు వచ్చునో సమూయేలు ప్రజలకు తేటగా హెచ్చరించినను వారతని మాట వినక రాజు తమకు

ఉండవలెనని పదేపదే అడిగిరి. అందువలన కరుణామయుడైన దేవుడు తుదకు తన అభిప్రాయమును మార్చుకొనవలసి వచ్చెను. (1సమూయేలు 8 అధ్యా).

దేవుడు బెన్యామీనీయుడగు సౌలు అను యువకుని రాజుగా నుంచుటకు సెలవిచ్చెను. అతడు సౌందర్యవంతుడు, మంచి దేహధారుఢ్యము, పరాక్రమము, పలుకుబడి, పరిపాలనా శక్తిగలవాడు. అతడు సమూయేలుచేత రహస్యముగా అభిషేకించబడిన పిమ్మట దేవుని ఆత్మ అతనిపైన కుమ్మరించబడెను. (1 సమూయేలు 9-10అధ్యా). పాతనిబంధన కాలములో దేవుని ఆత్మ వ్యక్తులపైన ప్రత్యేకమైన సందర్భములయందు, ప్రత్యేక కార్యముల నిమిత్తమై బలముగా వచ్చెడిది. ఆ పని ముగియుటను బట్టిగాని లేక అతడు పాపముచేయుటను బట్టిగాని దేవుని ఆత్మ ఆ వ్యక్తిని విడనాడుట జరిగెడిది. (న్యాయా 14:19, 15:14, 16:20, 1 సమూయేలు 10:10, 11:6).

అమ్మోనీయులు తూర్పు యోర్దాను ప్రాంతములో నున్న యాబేష్గిలాదులోని ఇశ్రాయేలీయులను మిక్కిలి బాధించగా సౌలు శూరులందరిని యుద్ధమునకు సన్నద్ధముచేసి అమ్మోనీయులపై గొప్ప విజయమును సాధించెను. అందున అతడు రాజుగా నుండుటకు తగిన వాడని ప్రజలు గ్రహించి సమూయేలుచేత గిల్గాలలో అతనికి పట్టాభిషేకము చేయించి అతనిని తమకు రాజుగా నియమించుకొనిరి. (1 సమూ 11-12 అధ్యా). ఆ సమయమందు సమూయేలు రాజకీయ శాసనములు, న్యాయ చట్టములు ప్రజలకు చదివి వినిపించి యెహోవాయందు భయభక్తులు కలిగి యుండుట మరువరాదని ప్రజలను మరీ మరీ హెచ్చరించి తన బాధ్యతలన్నియు సౌలునకు అప్పగించెను. సౌలు అనేక దైవవరములను, దైవాత్మను కలిగినవాడైయుండి ఇశ్రాయేలీయుల పండ్రెండు గోత్రముల వారిని ఒక్క రాజ్యముగాను, ఒక్క జనాంగముగాను విలీనము చేయగలిగెను. దేశములోని అల్ప సంఖ్యాకులైన ఇతర జాతులవారు అప్పటికే వెళ్ళగొట్టబడెరి. దేశపు నలుమూలలలోను శత్రువులు మోయాబీయులు, అమ్మోనీయులు, ఏదోమీయులు, అమాలేకీయులు వీరందరిపై దండెత్తి ఓడించి దేశమునకు కొంత నెమ్మదిని కలుగజేసెను. అయినను అతడు దేవుని చిత్తము బట్టికాక తన ఇష్టానుసారముగా వ్యవహరించెడివాడు. అందువలన సమూయేలు ముమ్మారు అతనిని దర్శించి "నీ అవిధేయతను బట్టి దేవుడు నిన్ను విసర్జించెనని" చెప్పవలసి వచ్చెను. (1 సమూయేలు 13-14 అధ్యా).

దేవుని చిత్తానుసారమైన మనస్సు గలవాడగు దావీదు గొల్యాతును చంపుటవలన అతడు ప్రజల మన్ననలను పొందుచున్నాడని ఎరిగిన సౌలు దావీదుపై అసూయపడి షుమారు 16 సం॥లు అరణ్యములో దాగొనిన దావీదును తరుముచుండెను. సౌలు కుమారుడగు యోనాతాను దావీదునకు మంచి ప్రాణ స్నేహితునిగా ఉండెను. దేవుని ఆత్మ సౌలును విడిచిపోగా పగ, ద్వేషము గల్గిన దురాత్మయొకటి సౌలును ఆవరించెను. ఆకారణముచేత అతడు తన రాజ్యమును సరిగా పాలించలేక పోయెను. (1 సమూయేలు 19-25 అధ్యా). అతడు ముందుగా అన్యుల విగ్రహారాధన పద్ధతులను దేశమంతటినుండి తొలగించెనుగాని, ఆఖరు యుద్ధమునకు వెళ్ళక మునుపు తానే సోదెచెప్పు స్త్రీ యొద్దకు వెళ్ళి పాపము తెచ్చిపెట్టుకొనెను.

తన 40 సం॥ల ఏలుబడి కాలమంతటిలో ఫిలిష్తీయులను ఓడించలేక వారితో నిత్యము యుద్ధము చేయుచునే యుండెను. తుదకు అతడు గిల్బోవా పర్వతముపై వారితో యుద్ధమాడుచూ తన కుమారుడైన యోనాతానుతో సహా మరణించెను. ఇతని తరువాత దేవుడు దావీదును రాజుగా ఎన్నుకొనెను.

Bible Lesson No - 9 **బైబిల్ పాఠము** -9

# దావీదు రాజ్యము (The Kingdom of David)

దావీదు 16 సం॥ల వయస్సు గలవాడై మందలు కాయుచుండగా సమూయేలు చేత రహస్యముగా అభిషేకింపబడెను. కాని అతడు వెంటనే రాజు కాలేదు. అతడు దేవునికి ఇష్టానుసారమైన మనస్సు గలవాడైయున్నాడని తాను రచించిన కీర్తనలనుబట్టి మనము తెలిసికొనవచ్చును. అతడు అనేక సం॥లు సౌలు చేత తరుమబడినందున దేవునిపై ఆధారపడియుండుటకును, యధార్ధముగా నడుచుకొనుటకును నేర్చుకొనెను. సౌలుకు భయపడి, తప్పించుకొని తిరుగుచూ, అతడు దక్షిణ మధ్య ప్రదేశములో దేశదిమ్మరిగా నుండవలసి వచ్చెను. ఆ సంవత్సరములలో సౌలు ఏలుబడియందు అసంతృప్తి గల అనేకులు దావీదు నొద్దకు వచ్చి అరణ్యమందు అతనితో కూడా నివసించుచు వారు కూడా సౌలుచేత తరుమబడు చుండిరి. సౌలు చనిపోయిన పిదప వారు హెబ్రోనుపట్టణములో దావీదును రాజుగా అభిషేకించిరి. (2 సమూయేలు 2 అధ్యా).

దావీదు యూదా గోత్రికుడు గనుక అతడు దక్షిణ ప్రాంతపు గోత్రికులపై మాత్రమే రాజయ్యెను. ఉత్తర దక్షిణ ప్రాంతపువారి మధ్య చాలా కాలము క్రితమే అనగా సౌలు రాజు కాక ముందు నుండే విబేధములు కలవు. అందువల్ల ఉత్తర ప్రాంతపు గోత్రికులు దావీదును వెంటనే రాజుగా అంగీకరించక సౌలురాజు కుమారుని తమకు రాజుగా నియమించుకొనిరి. ఈ రెండు ప్రాంతముల వారికి షుమారు 7 సంవత్సరములు యుద్ధములు జరిగెను. కాల క్రమేణా దావీదు పక్షముగా ఉన్న దక్షిణ ప్రాంతమువారి యొక్క బలము అధికమవగా ఉత్తర ప్రాంతము నుండి అనేకులు వచ్చి దావీదు పక్షముగా చేరిరి. తుదకు దావీదు, తన పైకి దండెత్తి వచ్చిన సౌలురాజు కుమారుని ఓడించిన పిమ్మట 12 గోత్రములవారందరు షెకెములో దావీదును తమపై రాజుగా అభిషేకించుకొనిరి. (2 సమూయేలు 2-5అధ్యా).

అయితే దావీదుకు తన రాజ్యమునకు రాజధానిగా నియమించుకొను పట్టణముపై ఒక పెద్ద సమస్య వచ్చిపడినది. దక్షిణ ప్రాంతములోని హెబ్రోనును రాజధానిగా ఏర్పాటు చేసికొనినచో ఉత్తర ప్రాంతము వారు మనస్సు కష్టపెట్టుకొందురు. అదేవిధముగా ఉత్తర ప్రాంతములోని షెకెమును రాజధానిగా ఏర్పాటు చేసికొనినచో దక్షిణ ప్రాంతమువారు మనస్సు కష్టపెట్టుకొందురు. అతడు ఇప్పుడు రెండు ప్రాంతములవారికి రాజు గనుక ఇరువైపుల వారికి ఆమోదయోగ్యమైన పట్టణము ఒకటి దావీదునకు కావలసివచ్చినది. అదే సమయంలో ఆ దేశము మధ్యలో అనగా రెండు ప్రాంతముల మధ్యలో జయింప

శక్యముగాని గొప్ప పట్టణము ఒకటి కలదు. అది యెబూసీయుల పట్టణము. పై కారణమును బట్టి దానిని దావీదు తనకు రాజధానిగా నియమించుకొనదలచి మధ్య ప్రాంతములో ఉన్న ఆ యెబూసీయుల పట్టణమును జయించి దానిని తనకు రాజధానిగా చేసికొనెను. ఆ పట్టణమును జయించిన విధానమును 2 సమూయేలు 5:6-10 వచనములలో చదువ వచ్చును. దావీదు ఎంతో తెలివితో చేసిన ఈ కార్యమువలన అందరికి తృప్తి సంతోషము కలిగెను. జయింపబడిన ఆ గొప్ప పట్టణమునకు సీయోను అను పేరు పెట్టబడెను. అదే తరువాత యెరూషలేముగా మారెను. దానికి దావీదు పట్టణమని కూడా పేరు. ఆ పట్టణములో ఉన్న కోటను తనకు నివాసముగా ఏర్పాటు చేసుకొని, కోటచూట్టు ఒక ప్రాకారము కట్టించెను. దావీదు ఆ గొప్ప కోటకు 'దావీదుపురము' అని పేరు పెట్టెను. దేవుడు అతనికి తోడుగా ఉన్నందువలన దావీదు అంతకంతకు వర్ధిల్లెను.

దావీదు ప్రప్రథముగా చేసిన దేమనగా షుమారు 70 సంవత్సరముల క్రిందట ఏలీ కాలములో ఫిలిష్తీయులు దోచుకుపోయిన పరిశుద్ధమైన దేవుని మందసమును దావీదుపట్టణమగు యెరుషలేములో తాను నిలువబెట్టించిన ప్రత్యక్షగుడారములోని అతి పరిశుద్ధ స్థలమందు తిరిగి ప్రతిష్ఠించెను. తద్వారా యెహోవాకు ఆరాధనలు మరల ప్రారంభించబడెను. (2 సమూయేలు 6-7 అధ్యా). దావీదు మొదటి నుండి ఆ విధముగా దేవుని ఘనపరచుచూ "ఈ రాజ్యమును ఏలుచున్నది నేను కాదు యెహోవాయే" అని ప్రజలకు నిరూపించెను. అతడు దేవుని ఆజ్ఞలు గైకొని, ఆయన ఆశీర్వాదము పొంది, తాను చేసిన యుద్ధములన్నింటిలో జయము పొందుచుండెను. అతడు దండెత్తిన ప్రదేశములన్నింటిపైనా జయమును సాధించి తన రాజ్యమును బహుగా విస్తరింపజేసెను. దేవుడు అబ్రహాముకును (ఆది 15:18), మోషేకును (నిర్గమ 23:31) వాగ్దానము చేసిన సరిహద్దు వరకు అనగా, మధ్యధరా సముద్రమునుండి యూఫ్రటీసు నది వరకును తన రాజ్యమును స్థిరపరచెను. (2 సమూ 8 అధ్యా). దావీదు తన జనులందరిని నీతి న్యాయములను బట్టి ఏలుచుండెను.

ఆ కాలమందు యుద్ధమునకు పోవు సైనికులందరు వెలగల నగలతోను, వస్త్రములతోను యుద్ధరంగమునకు పోయెడివారు. ఓడిపోయినవారి నగలన్నియు జయించినవారు దోచుకొని ఆస్తిని సమకూర్చుకొనెడివారు. అట్లే దావీదుకూడా విస్తారమైన దోపుడు సొమ్ము, బంగారము, వెలగలరాళ్ళు సమకూర్చి వాటిని తన కొరకు వినియోగించుకొనక తాను కట్టింపగోరిన దేవుని మందిరము కొరకై భద్రపరచెను. (1దిన 29 అధ్యా). దావీదు తన యావజ్జీవితమున దేవుని ఘనపరచెనుగాని ఒక్క బత్షెబా విషయములో ఘోర పాపముచేసి తనతోపాటు తన కుటుంబమును కూడా దుర్భర ప్రాయశ్చిత్తమునకు గురిచేసెను. తన రాజ్యములో కూడా కొందరు విద్రోహులు అతనిపై కుట్రచేసి విప్లవము లేవదీసిరి. (2 సమూ 10-18అధ్యా). అయితే అవసానకాలములో దేవుడతనికి మరల నెమ్మది కలుగజేసెను. అప్పుడు తనకుమారుడైన సొలోమోను కట్టించనైయున్న మందిరపు నమూనాలు, ఆరాధన క్రమమును, అతనికి అప్పగించెను. తాను రచించిన కీర్తనలన్ని ఒక గ్రంధముగా దావీదు క్రమపరచెను. అదియే పరిశుద్ధ గ్రంధములోని దావీదు కీర్తనల గ్రంధము.



# సొలోమోను రాజ్యము (The Kingdom of Solomon)

శత వృద్ధుడైన దావీదు తన అవసాన కాలములో తన కుమారుడైన సొలోమోనును రాజుగా పట్టాభిషేకము చేసెను. దావీదు చనిపోయిన తరువాత ఆ రాజ్యమును అపహరింపజూచిన తన సోదరుని సొలోమోను చంపించి తన రాజ్యమును స్థిరపరచుకొనెను. (1 రాజులు 2 అధ్యా)

సొలోమోను రాజ్యమునకు వచ్చిన పిమ్మట దేవుడు ఒకనాడు దర్శనమందతనికి ప్రత్యక్షమై "నీకేమి కావలెనో కోరుకొనుమని" అడుగగా అతడు తనకు జ్ఞానవివేచనములను ప్రసాదించమని కోరెను. దేవుడు అట్లే అనుగ్రహించెను. సొలోమోను గొప్ప జ్ఞానవంతుడై సర్వలోకమున ప్రసిద్ధి కెక్కెను. (1 రాజులు 3 అధ్యా).

దావీదు కుమారుడైన సొలోమోను మిక్కిలి పనితనముగల, సుందరమైన దేవాలయమొకటి 7 సం॥ల కాలములో నిర్మించి దానిని గొప్ప వైభవముతో ఆవిష్కరించి దేవునికి ప్రతిష్టించెను. ఆ దినమున అతడు దేవుని ప్రార్థించి 22,000 ఎడ్లను 1,20,000 గొర్రెలను బలి అర్పించెను. దేవుడు అప్పుడు అతనికి మరల ప్రత్యక్షమై విగ్రహారాధన జోలికి ఎన్నడును పోవద్దని అతనిని హెచ్చరించెను. (1 రాజులు 8-9 అధ్యా). అయితే సొలోమోను తన స్వంత ఘనతను, తన మహిమా ప్రభావములను నిలుపుకొనగోరి తన నివాసముకొరకు పదమూడు సం॥లు శ్రమపడి ఒక గొప్ప నగరును కట్టించుకొనెను. ఆ దినములలో అన్యరాజులు తమ ఘనతా ప్రభావములను, శౌర్య వీరత్వములను ప్రదర్శించి భీకరముగా యుద్ధమాడుయో లేక విస్తారమైన భార్యలను ఉపపత్నులను ఉంచుకొనుటయో చేసెడివారు. సొలోమోను 700 మంది భార్యలను 300 మంది ఉపపత్నులను ఉంచుకొనెను. వీరు సామాన్యమైన స్త్రీలు కారు. రాజుల, సామంతుల కుమార్తెలు. వీరు యెరూషలేమునకు వచ్చినపుడు తమతోబాటు తమ దేవతలను, పూజారులను పనికత్తెలను కూడా తీసికొనివచ్చిరి. తన భార్యలపై తనకు మక్కువ కలదని చూపుటకు సొలోమోను వారి దేవతలకు కూడా ఆలయములను కట్టించెను. అంతేకాక వారు చేయు పూజాపునస్కారములలో కూడా అతడు పాల్గొందెను. అట్లు చేయనిచో తన మామలగు అన్యదేశపు రాజులందరికి కష్టము కల్గునని అతడు భయపడెను. ఈ విధముగా సొలోమోను ఆయా దేవతలకు పూజింప మొదలుబెట్టి దేవునికి విరోధియాయెను. ( 1 రాజులు 11 అధ్యా). మరియు సొలోమోను, భార్యలు ఉపపత్నులు మాత్రమే కాక, విస్తృతమైన మంత్రి మండలి, నపుంసకులు, గొప్ప పరివారమును కలిగి యుండెను. అంత వైభవముతో కూడిన రాజనగరును పోషించుటకు బహు విస్తారమైన ధనము సొలోమోనుకు అవసరమయ్యెను. తన తండ్రియైన దావీదు దండయాత్రలు చేసి విస్తారమైన కొల్లసొమ్ము తెచ్చెడివాడు, కాని సొలోమోను యుద్ధ శూరుడు కాడు. అందువలన అతడు అనేక దేశాలతో వ్యాపారము చేసెడివాడు. ఆఫ్రికా నుండి సుగంధ

ద్రవ్యములు, బంగారము, వెలగల వస్తువులు దిగుమతి చేసికొనుటకు ఎఱ్ఱ సముద్ర తీరమున యెజియోన్ గిబా యను ఓడరేవును నిర్మించి సముద్ర వ్యాపారము మొదలుపెట్టెను. కాని ఆవిధముగానయినను అతడు కాలసిన ధనమును సమకూర్చలేక ప్రజలపై భారమైన పెక్కు పన్నులను విధించెను. అన్యులచేత వెట్టి పనులు చేయించెను. అతడు ఎల్లపుడు తన పేరు ప్రతిష్ఠలను కాపాడుకొనుటయందే నిమగ్నుడై ప్రజల సౌఖ్యమును విస్మరించెను. అతడు పండ్రెండు మంది అధికారులను నియమించి వారిలో నెలకొక్కరు చొప్పున ఒక్కొక్క గోత్రమునుండి రాజు పరివారమునకు కావలసిన భోజన పదార్థములను తీసికొనువచ్చునట్లుగా ఏర్పాటు చేసెను. యవ్వనస్థులందరు సంవత్సరమునకు మూడు నెలలు రాజు పొలము కొరకై వెట్టి పనులను చేయవలసి వచ్చినందున తమ తమ సొంత పొలము పనులు చూచుకొనలేకపోయిరి. ఈ విధముగా ప్రజలు క్రమేణా కడు పేదవారైరి. (1 రాజు 10-11అధ్యా).

ప్రజలిట్టి దుర్భర జీవితమును భరించలేక రాజుపై విరక్తి చెందిరి. వారు మాత్రమేకాక దావీదు ఓడించిన అన్యులైన రాజులు ఏదోమీయులు, మోయాబీయులు, ఆరామీయులు సొలోమోను రాజు చేయుచున్న ఈ అమానుష కృత్యములను సహింపలేక తిరుగుబాటు చేసిరి. అట్లు అతడు తన తండ్రియైన దావీదు సంపాదించిన గొప్ప రాజ్యములోని చాలా భాగమును పోగొట్టుకొనెను. మరియు తాను చేసిన అన్యాయములను బట్టియు, విగ్రహారాధన బట్టియు దేవుని నామమును దూషించి ఆయనుకు విరోధియై తన ఆఖరు దినములు చాలా అవమానముతో గడిపెను. ( 1రాజు 10-11 అధ్యా).

---

Bible Lesson No - 11 **బైబిల్ పాఠము** -11

# విభాగింపబడిన రాజ్యము (The Divided Kingdom)

రాజైన సొలోమోను ఏలుబడిలో సొలోమోను చేత యరోబాము అను ఒక మహా బలాఢ్యుని యోసేపు సంతతి వారిమీద అధికారిగా నియమించెను. (1 రాజులు 11:28). సొలోమోను కాలములో జరుగుచున్న అన్యాయములను చూచి సహింపలేక ఆ అధికారియైన యరోబాము, ప్రజలచేత రాజైన సొలోమోనుపై వ్యతిరేకముగా తిరుగుబాటు లేవదీయ ప్రయత్నము చేసెను. కాని ఆ సంగతి రాజైన సొలోమోనుకు తెలియగా రాజుకు భయపడి యరోబాము రాజ్యము విడచి ఐగుప్తునకు పారిపోయెను. ఆ తరువాత రాజైన సొలోమోను మృతి చెందెను. ఆయనకు బదులుగా ప్రజలు ఆయన కుమారుడైన రెహబామునకు పట్టాభిషేకము చేసిరి. అయితే రెహబాము కూడా చెడుగానే పరిపాలన చేసెను. సొలోమోను మృతిచెందిన విషయమును ఐగుప్తులోనున్న యరోబాము ప్రజల ద్వారా తెలిసికొని ఐగుప్తునుండి తిరిగి యెరూషలేమునకు వచ్చెను. ప్రజలు సొలోమోను రాజు విధించిన పన్నుల భారముతో కృంగి పోవుచుండరి గనుక ఆ పన్నుల భారము తొలగించుకొనుటకు, సొలోమోను కుమారుడు రెహబామునకు పట్టాభిషేకము జరిగిన వెంటనే ప్రజలు యరోబాముతో కలసి ఆయన యొద్దకు వెళ్ళి తమ నికృష్టపు జీవితమునకు కారణమైన పన్నులను తగ్గించవలెనని విన్నవించుకొనిరి. కాని అతడు వారి మాట లక్ష్యపెట్టక, పన్ను తగ్గించకపోగా మరి యెక్కువ చేయుదునని భయపెట్టెను.

అందువలన ప్రజలలో అసంతృప్తి మరింత పెరిగి పోయినది. రెహబాము కాలములో ప్రజలలో రేగిన అసంతృప్తిని ఆధారముగా చేసుకొని యరోబాము ప్రజలకు నాయకత్వము వహించి మరల తిరుగుబాటుకు ప్రజలను ప్రేరేపించెను. ఇటువంటి పరిస్థితులలో ఇదివరలో ఉత్తర దక్షిణ ప్రజలకు కలిగిన విబేధములు మరల తలయెత్తెను. ఉత్తర దిశలోనున్న పది గోత్రముల ప్రజలు తిరుగుబాటుచేసి తమకు యరోబామును రాజుగా ఏర్పరచుకొని "ఇశ్రాయేలు దేశముగా" విడిపోయిరి. ఇట్లు తిరుగుబాటు చేసిన పది గోత్రములకు షెకెములో యరోబాము రాజుగా చేయబడెను. దక్షిణ దిశలోనున్న రెహబామునకు యూదా మరియు బెన్యామీను అను రెండు గోత్రములు మాత్రమే మిగిలెను. (1రాజులు 12:1-24) దక్షిణ దిశగానున్న ఈ రెండు గోత్రములకు "యూదా దేశమని" పేరు.

ఈ విధముగా సొలొమోను రాజ్యము ***ఇశ్రాయేలు రాజ్యము***గాను మరియు ***యూదా రాజ్యము***గాను విభాగింపబడెను. అయితే యరోబామునకు ఒక క్రొత్త సమస్య వచ్చినది. పది గోత్రాలు వారు ఇశ్రాయేలు రాజ్యముగా విడిపోయినారుగాని దేవాలయము మాత్రము యూదా రాజ్యములోని యెరూషలేములో ఉండుట వలన ఇశ్రాయేలు రాజ్య ప్రజలు ప్రతి ఏడాది పండుగలనాచరించుటకు యూదా రాజ్యమునకు వెళ్ళుట మొదలుపెట్టినారు. ఇది గమనించిన యరోబాము ప్రతి ఏడాది తన ప్రజలు యూదా రాజ్యములోని దేవాలయమునకు పండుగ ఆచరించుటకు వెళ్ళుటవలన వారు రెహబాము ప్రజలతో కలసిపోయి తన రాజ్యము బలహీనపడునేమోని భయపడినాడు. దీనిని నిలుపుచేసి తన రాజ్యమును స్థిరపరచుకొనుటకు యరోబాము ఒక మాయోపాయము చేసెను. అదేమనగా తన క్రొత్త రాజ్యమైన ఇశ్రాయేలు దేశములో ఒక క్రొత్త మత పద్ధతిని స్థాపించినాడు. ఆ కాలములో ప్రజలందరి నమ్మకమేమనగా ఆయా దేశాలలోని దేవుండ్లు సంహాసనాసీనులై తమ దేశములను ఏలుదురని ప్రజలు భావించెడివారు.

12 గోత్రాల వారి నమ్మకముకూడా యెహోవా యొక్క సింహాసనము, మందసముమీద ఖెరూబుల మధ్యనున్న కరుణాపీఠమని భావించెడివారు. యెహోవా తన ప్రజల మధ్య నివసించుటకు తనకు ప్రత్యక్షపు గుడారములో ఒక అతి పరిశుద్ధ స్థలము ఉండవలెననియు, దానిలో ఒక మందసపు పెట్టె ఉండవలెననియు మోషేకు ఆజ్ఞాపించెనుగదా! యెహోవా ఆజ్ఞమేరకు వారు సమస్తము చేసిరి. మందసముపై బంగారు కరుణా పీఠము ఉంచబడెను. దానికి ఇరుప్రక్కల రెండు బంగారు ఖెరూబులు ఉంచబడినవి. కరుణా పీఠము మీదనుండి అదృశ్యుడగు యెహోవా దేవుడు తన ప్రజలను కలుసుకొని, వారికి ఆజ్ఞలను, కట్టడలను, విధులను తెలియజేయుదునని సెలవిచ్చెను. ఆయన కరుణాపీఠమనే సింహాసనముపై ఆవిధముగా రాజ్యపాలన గావించెను. మరియు ఆయన అదృశ్యరూపుడైనను తన ప్రజలకు అత్యద్భుతమైన తన సన్నిధినిచ్చి వారి మధ్య తాను నివసించెను. అందువలన 12 గోత్రాల ప్రజలకు మందసము అనిన యెహోవా దేవుని సింహాసనము మరియు సన్నిధిగా భావించి పవిత్రముగా పూజించెడివారు. (నిర్గమ 25:21-22). 12 గోత్రాలవారు మందసమును పూజించిన విధముగానే అష్షూరు, తదితర దేశీయులు

తమ దేవుండ్లకు వాహనాలైన సింహములు మరియు దూడలను పవిత్రముగా భావించి పూజించెడివారు.

సరిగ్గా ఈ విషయమును గమనించిన యరోబాము తన మాయోపాయమును ఈ వాహనములైన సింహాసనముల ద్వారా అమలు పరచినాడు. ఈ ఉద్ధేశ్యముతోనే యరోబాము తమ దేవుడైన యెహోవాకు తమ దేశములోనే మందసమనే సింహాసనముకాకుండా మరి నూతనమైన సింహాసనాలను తయారు చేసి దేవునికి సమర్పించిన వాటిని పూజించవచ్చుని, మందసముయొక్క పూజకొరకు దూరమైన యూదా దేశము వెళ్ళనవసరములేకుండా పోతుందని అతడు తన ప్రజలను నమ్మించెను. అయితే యరోబాము ఆ సింహాసనములను రెండు బంగారు దూడల రూపములో చేయించెను. అయితే మనము గమనించవలసినదేమంటే ఆదూడలు విగ్రహములు కాదనియు అవి అదృశ్యరూపుడైన యెహోవాకు వాహనాములు మాత్రమేనని మనము గ్రహించుకొనవలెను. అనగా యరోబాము యెహోవాకు విగ్రహారాధనతో కూడిన ఒక నూతన ఆచారమును మొదలుపెట్టించెను. అయితే ఇది దేవుని ఆజ్ఞలకు పూర్తి విరుద్ధముగా ఉన్నది. కాని ఇశ్రాయేలు దేశ ప్రజలు ఆయన ఆజ్ఞలను విస్మరించి ఆ బంగారు దూడలను యెహోవాకు వాహనములుగా పూజించిరి. యరోబాము కడు యుక్తితో దేశం దక్షిణ సరిహద్దులోనున్న బేతేలు నందు మరియు ఉత్తర సరిహద్దులో నున్న దాను యందు రెండు పుణ్య క్షేత్రములను నెలకొల్పి, ఆ బంగారు దూడలను ఆ పుణ్య క్షేత్రాలలో ప్రతిష్ఠించెను. అనగా తన రాజ్యమైన ఇశ్రాయేలు దేశమునకు ఆవైపున ఒక పుణ్యక్షేత్రం మరియు ఈ వైపున ఒక పుణ్యక్షేత్రం నిర్మించి దూడలను ప్రతిష్ఠించినాడు. అనగా ప్రజలు ఆ వైపు నుండి గాని ఈ వైపు నుండి గాని పండుగలకొరకు బయటకు వెళ్ళకుండా ఈ ఏర్పాటు గావించినాడు.

యరోబాము ఇంకా తన ప్రజల ఆనందముకొరకు కొన్ని ప్రత్యేక ఏర్పాట్లు గావించినాడు. యెహోవా నియమించిన పండుగలకు బదులుగా క్రొత్త పండుగలను స్థాపించి ఉన్నత స్థలములను కట్టించి వాటిని మందిరములుగా ఏర్పరచుచు, ఆరాధించుటకు లేవియులను కాదని సామాన్యమైనవారిని కొందరిని యాజకులుగా నియమించెను. ఈక్రొత్త పూజలు పది గోత్రముల ఇశ్రాయేలు రాజ్యము నిలిచి ఉన్నంతకాలము కొనసాగుచూనే యుండెను. అది మాత్రమేకాక వారు అన్యదేవతలైన బయలు, అష్తారోతు అనువాటికి పూజచేసి భయంకరమైన విగ్రహారాధికులై యెహోవా ఆజ్ఞలను అతిక్రమించి ఆయనకు కోపము పుట్టించుచుండిరి. (1రాజులు12:26-14:26).

దక్షిణ ప్రాంతములోని మిగిలిన రెండు గోత్రములు యూదా రాజ్యమని పిలువబడెను. రెహబాము యొక్క రాజధాని యైన యెరూషలేములో సకలైశ్వర్యములతో కూడిన రాజనగరు, దేవాలయుము ఉండెను. అయితే వాటిని కాపాడు కొనుటకు తగిన సైన్యము లేనందున దక్షిణమునుండి ఐగుప్తురాజు దండెత్తి బహు సుళువుగా దేవాలయములోని బంగారు పాత్రలు, ఉపకరణములన్నిటిని కొల్లగొట్టుకొని పోయెను. తదుపరి యూదావారు కూడా సొలోమోను రాజు చేసిన విగ్రహారాధన కొనసాగించి దేవుని ఆశీర్వాదమును పోగొట్టుకొనిరి. (1రాజులు 14:21-31)

అయితే పరిస్థితిని గమనించిన కరుణామయుడైన దేవుడు ఇశ్రాయేలు దేశమునకును, యూదా దేశమునకును ప్రవక్తలను పంప మొదలుపెట్టెను. వారు ప్రజలను గద్దించి హెచ్చరించి, బుద్ధి చెప్పుచూ తమ వివిధ అద్భుత కార్యములచే ప్రజల దృష్టిని యెహోవా వైపునకు మళ్ళించ ప్రయత్నించిరి. అయినను ఎవరో కొద్ది మంది యూదారాజులు మాత్రమే వారి మాటలు లక్ష్యపెట్టి తమ ప్రజలను ఉజ్జీవింపజేసిరి. కాని ఇశ్రాయేలు రాజులలో ఏ ఒక్కరు కూడా ప్రవక్తల ఉపదేశములను లక్ష్యపెట్టక బంగారు దూడలను పూజించుచు ఆ నూతన ఆరాధన క్రమమునే కొనసాగించుచుండిరి.

ఉత్తరమునున్న ఇశ్రాయేలు దేశమున సారవంతమైన భూభాగము గలదు. మరియు అష్షూరునుండి ఐగుప్తునకు వెళ్ళు వర్తక మార్గము ఇశ్రాయేలు దేశముగుండా పోవుచున్నందువలన ఆ దేశ ప్రజలు వ్యవసాయము, వ్యాపారములు చేసి ఆస్తిపరులైరి. కాని వారి కలిమి విస్తరించుకొలది తమ మధ్యనున్న బీద ప్రజానీకమును అన్యాయముగా బాధించసాగిరి. అంతేగాక అనేక మంది అన్యులు ఆ దేశమునకు వ్యాపారము నిమిత్తము వచ్చుచు పోవుచున్నందువలన ఇశ్రాయేలు ప్రజలు ఆ అన్యుల మతపద్ధతులు ననుసరించి విస్తారముగా విగ్రహారాధీకులైరి. ఆహాబు తండ్రియగు ఒమ్రీ షోమ్రోను పట్టణమును రాజధానిగా కట్టించెను. రానురాను అది సమరయగా పిలువబడెను.

దక్షిణముననున్న యూదా దేశము, మొత్తము మీద నీటి వసతిలేని మన్య ప్రదేశము. ఆ దేశ ప్రజల ముఖ్య వృత్తి గొర్రెలు, మేకలు మేపుట. అందుచేత వారు విశేషముగా ధనవంతులు కాలేకపోయిరి. అంతేకాక అన్యజనులు, వ్యాపారమునకై ఆ దేశమునకు వచ్చెడివారుకారు. కావున వారు విగ్రహారాధన చేసినను అన్యుల పద్ధతులు ఎక్కువగా ఆచరించలేదు. భయభక్తులు కల్గిన కొద్దిమంది ఎప్పుడునూ వారిలో ఉండెడివారు.

---

Bible Lesson No - 12 **బైబిల్ పాఠము** -12

# ఇశ్రాయేలు, యూదా దేశపు చరిత్ర

## (The Downfall of Israel and Judah)

విభాగింపబడిన రాజ్యపు పూర్తి చరిత్రను గ్రహించ గల్గినచో అనేక ఆత్మీయపాఠములు నేర్చుకొనవచ్చును. ఇప్పటి వరకు నేర్చుకున్న బైబిల్ చరిత్రను మరల ఒకసారి పరిశీలన చేద్దాము.

పాతనిబంధన మరియు క్రొత్తనిబంధనలో ఉన్న భౌగోళిక చరిత్రను మనము గమనిస్తున్నాము. మోషే తరువాత యెహోషువా ఇశ్రాయేలు ప్రజలను నడిపించెను. అటు తరువాత దేవుడు న్యాయాధిపతులను పంపెను. ప్రజలు రాజు కావలెనని కోరగా దేవుడు సమూయేలు ద్వారా సౌలును నియమించెను. కాని అతడు దేవుని మాట చొప్పున చేయక రాజరికము పోగొట్టుకొనెను. తరువాత దావీదు దేవుని చిత్తానుసారముగా నడిచి రాజ్యమును బహు గొప్పగా విస్తరింపజేసెను. పిదప సొలోమోను ఎట్లు రాజ్యమును పాడుచేసెనో మనము చదివితిమి. సౌలు, దావీదు, సొలోమాను ఈ ముగ్గురు రాజులు

ఒక్కొక్కరు 40 సం॥లు ఏలిరి. మొత్తము సంయుక్త రాజ్యము దాదాపు 120 సం॥లు నిలిచెను. ఈ రాజుల చరిత్ర మొదటి, రెండు సమూయేలు గ్రంథములలో చదువచ్చును.

సొలోమోను కుమారుడు రెహబాము పెద్దల సలహాలు పాటించనందున అతని రాజ్యములోని పది గోత్రములు తిరుగుబాటు చేసి యరోబామును రాజుగా చేసుకొని ఇశ్రాయేలు దేశముగా ఏర్పడి చీలిపోయిరి. ఈ ఇశ్రాయేలు దేశములోని రాజ్యము 212 సం॥లు నిలిచెను. పందొమ్మండుగురు రాజులు ఏలిరి. వారు దావీదు వంశస్థులు కారు. ఈ ఇశ్రాయేలు దేశ చరిత్ర, మొదటి రెండు రాజుల గ్రంథములలో వ్రాయబడెను. కొంచెము మాత్రమే దినవృత్తాంత గ్రంథములో ఉన్నది. క్రీ.పూ 722 సంవత్సరములో ఇశ్రాయేలు దేశమువారు అనగా 10 గోత్రములవారు అష్షూరీయులచే పూర్తిగా ఓడింపబడిరి. ఓడింపబడిన ఇశ్రాయేలు రాజ్య ప్రజలు అష్షూరీయులచే నానా దేశములకు చెదరగొట్టబడిరి. వారు తిరిగి తమ దేశమునకు ఎన్నడును చేరుకొనలేదు.

యూదాదేశపు రాజులు అనగా దక్షిణ ప్రాంతమునందున్న రెండు గోత్రముల దేశపు రాజులందరును దావీదు గోత్రీకులే. వారిలో కొందరు దేవుని మార్గములయందు నడచి ప్రజలను దేవుని వైపునకు త్రిప్పి దేవుని ఆశీర్వాదము పొందిరి. అందు ముఖ్యరాజులు ఎవరనగా ఆసా, యెహోషాపాతు, ఉజ్జయి, హిజ్కియా, యోవాషు అనే రాజలు మాత్రమే. మిగిలినవారు అన్యదేవతలకు పూజలు చేసి దేవుని ఉగ్రతను తమపైకి తెచ్చుకొనిరి. యూదా రాజ్యము షుమారు 449 సం॥లు నిలిచెను. మొత్తం 20 మంది రాజులు ఏలిరి. తుదకు యెరూషలేము క్రీ.పూ 597 నుండి క్రీ.పూ 586 వరకు నెబుకద్నెజరు ఆధీనములో ఉండెను. ఈ యూదా దేశములోని ప్రజలు మూడు దఫాలుగా బెబేలు దేశమునకు చెరగొనిపోబడిరి. యెరూషలేము పట్టణము అందలి దేవాలయము క్రీ.పూ 586 లో పూర్తిగా నాశనము చేయబడి కాల్చబడెను.

యూదావారి చరిత్ర విపులముగా దినవృత్తాంత గ్రంథములయందు వ్రాయబడెను.

సంయుక్త రాజ్యము రెండు దేశములగా విభజింపబడి ఆ తరువాత ఏఏ రాజులు ఆదేశములను ఏ రీతిగా పరిపాలించినారో వారి ఏలుబడిలో ఏఏ ప్రవక్తలు దైవ సందేశములతో ప్రజలను మేల్కొలిపినారో మనము పట్టికల ద్వారా గమనించవచ్చును. తరువాత ఈ రెండు రాజ్యములు ఏఏ రాజ్యాల చేతిలో పతనమయినవో 10 గోత్రాల ఇశ్రాయేలు రాజులు మరియు 2 గోత్రాల యూదా రాజులు అను పాఠములను చూడుము.

# అష్షూరు రాజ్యము (The Kingdom of Assyria)

అష్షూరు రాజ్యము మొదటిగా యూఫ్రటీసు మరియు టైగ్రిస్ నదుల మధ్య ఉండెడిది. వారి రాజధాని నినెవె. అది నాగరికతగల గొప్ప నగరము. అష్షూరీయులు భయంకరమైన క్రూరులు మరియు వారు యుద్ధ ప్రవీణులు. అందువలన తరచుగా ఆ చుట్టు ప్రక్కల ప్రాంతములనందు ఉన్న దేశములపైకి దండెత్తెడివారు. రాను రాను వారి చుట్టూ ఉన్న రాజ్యములన్నింటిని జయించిరి.

వారు ఒక దేశమును జయించిన వెంటనే వృద్ధులను బలహీనులను పిల్లలను మినహాయించి ఆ దేశములోని బల పరాక్రమముగల ప్రజలందరిని చెరపట్టి తాము జయించిన ఇతర దేశములకు వారిని తీసుకొనిపోయి అయా పట్టణములలో ఉంచెడివారు. వారు జయించిన ప్రజలు తిరుగుబాటు చేయకుండునట్లును మరియు వారికి స్థాన బలము లేకుండునట్లును వారు ఈ విధముగా చేసెడివారు. చెరపట్టబడిన ప్రజలను ఆయా దేశములకు కొని పోవలసి వచ్చినప్పుడు అష్షూరు సైనికులు స్త్రీ పురుషులను వరుసగా నిలువబెట్టి గొలుసులతో బంధించి ప్రయాణములో సరిపోయినంత ఆహార పదార్థములివ్వక నిర్ధాక్షిణ్యంగా వారిని అనేక వందల మైళ్ళు కాలి నడకన నడిపించెడివారు. అందువలన మార్గమధ్యములో అనేకులు చనిపోవుచుండెడివారు.

ఈ విధముగా బలముగలిగిన 10 గోత్రాల ఇశ్రాయేలు దేశపువారందరిని నలుదిశలకు చెదరగొట్టిరి. చెదరగొట్టబడిన వారెన్నడును తిరిగి తమ స్వదేశమునకు రాలేదు. బలహీనులైన కుటుబంములు మరియు నిరుపేదలైన వారిని మాత్రము 10 గోత్రాల ఇశ్రాయేలు దేశములో ఉండనిచ్చిరి. ఖాళీ చేయించిన ఇశ్రాయేలు దేశము పట్టణములలో కాపురము ఉండుటకు అష్షూరీయులు తాము అప్పటికి జయించిన బబులోను, కూతా, అవ్వా, హమాతు మరియు సెపర్వయీము అను అయిదు దేశములనుండి (2రాజులు 17:24) జనులను రప్పించి 10 గోత్రాలవారికి మారుగా ఇశ్రాయేలు దేశపు గొప్ప పట్టణాలైన షోమ్రోను, షెకెము, బేతేలు తదితర పట్టణాలకు పంపిరి. వారక్కడ స్థిరపడిపోయి తమ తమ దేవతలకు పూజలు కొనసాగించిరి. బబులోను వారు సుక్కోత్బెనోతు దేవతను, కూతావారు నెర్గెలు దేవతను, హమాతువారు అషీమా దేవతను, సెపర్వయీమువారు అద్రమ్మెలెకు, అనెమ్మెలెకు అను దేవతలను పూజించుచుంటిరి. (2రాజులు 17:30). ఆ విధముగా ఇశ్రాయేలు దేశములో ప్రవేశించిన ఈ అన్యదేశములవారు శేషించిన ఇశ్రాయేలీయులను పెండ్లిండ్లు చేసికొనగా మిశ్రమ జనాంగము బయలుదేరినది. ఈ జనము పేరే సమరయులు. ***(200 సం॥లు అయిన తరువాత ఎజ్రా గ్రంథములో వ్రాయబడినట్లు బబులోను చెరనుండి తిరిగి వచ్చిన యూదులు యెరుషలేములోని దేవాలయము కట్టించు విషయములో ఈ సమరయులుకూడా పాల్గొనగోరిరి. కాని వారు మిశ్రమ జనాంగమైనందువలన యూదులు ఒప్పుకొనలేదు. ఆ కారణముచే క్రీ.పూ 420 సంవత్సరమున వారు గెరిజీము పర్వతముమీద తమకు ప్రత్యేకముగా ఒక ఆలయమును కట్టించుకొనిరి. (యోహాను 4:18-22).***

అష్షూరీయులు అన్ని దేశములను జయించిరిగాని ఒకే ఒక చిన్న దేశమగు రెండు గోత్రాల యూదా దేశమును మాత్రము జయించలేకపోయిరి. అది బహుచిన్నది. ఆ కాలమందు హిజ్కియా యెరూషలేములో రాజయ్యెను. హిజ్కియాకు ముందుకాలములోని యూదారాజులు అష్షూరీయులకు కప్పము చెల్లించెడివారు. కాని హజ్కియా మాత్రము ఆ కప్పము చెల్లించుట మాని వేసెను. అతడు పరిపాలన ప్రారభించినప్పటినుండి దేవుని యందు భయభక్తులు గలవాడై తన తండ్రియగు ఆహాజు, దేవాలయంలో నుంచిన బలిపీఠము, విగ్రహములన్నింటిని తొలగించి దేవాలయము శుద్ధీకరించి ఆరాధన క్రమమును మరల స్థాపించి యూదా దేశమంతటిలో గొప్ప ఉజ్జీవమును కలుగజేసెను. అతడు అష్షూరీయులచేత పాడైపోయిన ఇశ్రాయేలు దేశములోనికి దూతలను పంపి అచ్చట శేషించిన పది గోత్రాల ఇశ్రాయేలీయులను, యూదా వారితో కలసి యెరూషలేములో పస్కా పండుగ నాచరించుటకు రమ్మని ఆహ్వానించెను. ఏదో కొద్దిమంది మాత్రమే ఆ ఆహ్వానము అంగీకరించి వచ్చిరి.

యూదావారందరు మాత్రము గొప్ప ఉత్సవముతో ఆ పండుగ నాచరించిరి. హిజ్కియా ఈ విధముగా దేవుని ఘనపరచి, ఆయన మీద పూర్తిగా ఆధారపడినందున అష్షూరీయులు యూదాదేశముపై దండెత్తి సరిహద్దునున్న పట్టణములను మాత్రమే జయించగల్గిరి. యెరూషలేమును కూడా ముట్టడివేసిరి. కాని అదే సమయమున అష్షూరు రాజు ఐగుప్తు రాజుతో యుద్ధము చేయుచున్నందున సైన్యమంతటి ఐగుప్తులోనున్న లాకీషు దగ్గరకు పంపవలసి వచ్చినది. అందువలన యూదా దేశమును వశపరచుకొనుటకు వీలు కలుగలేదు. మరుసటి సంవత్సరమున అష్షూరీయులు మరియొక సారి యెరూషలేమును ముట్టడి వేసిరి. ముట్టడివేసిన కాలమందు ప్రజలు నీరు లేక అవస్థ పడుచుండగ, హిజ్కియా పట్టణములోనికి నీరు రప్పించుటకు ఒక గొప్ప సొరంగము త్రవ్వించెను. కాని దేవుడు మరణదూతను పంపి సైన్యములోని ముఖ్యులందరిని మొత్తగా వారు చనిపోయిరి. అందువల్ల మాములు సైనికులు యుద్ధము చేయకుండా తిరిగి స్వదేశమునుకు వెళ్ళిపోయిరి. కొంతకాలమునకు అష్షూరు రాజుకూడా చనిపోయెను. ఈ విధముగా చావు దెబ్బ తినిన అష్షూరీయులు ఎన్నడును యెరూషలేముమీదికి యుద్ధమునకు మరల రాలేదు. ఈ చరిత్ర భాగము చాలా ప్రాముఖ్యమైనందువల్ల దేవుడు పరిశుద్ధాత్మ చేత పాతనిబంధనలో మూడు గ్రంథములయందు వ్రాయించెను. ***(2దిన 29-33 అధ్యా, 2రాజు 18-20అధ్యా, యెషయా 36-39అధ్యా)***

సర్వలోకమును జయించి బహుగర్విష్టులైన అష్షూరీయులు సుఖసౌఖ్యములతో తులతూగుచు నినివె అను రాజధానియందు క్షేమముగా జీవించుచుంటిరి. అయితే ఒకనాడు తాను చేసిన ఘోరకృత్యములకు ప్రతిఫలము వారి మీదకు వచ్చునని, అనగా గొప్ప భవనములతో కూడిన సుందరమైన వారి నినివె పట్టణము నాశనమగునని దేవుడు ప్రవక్తయైన యోనా ద్వారా ముందుగా తెలిపెను. వారతని మాటలు విని పశ్చాత్తపపడినందున ఆ నాశనము వెంటనే జరుగలేదు. కాని క్రీ.పూ 616 సం॥లో వారిచేత జయించబడిన బబులోనీయులు తిరిగి బలము కూడగట్టుకొని వారిమీద తిరుగుబాటుచేసి, నినివె అను వారి గొప్ప రాజధానిని సర్వనాశనముచేసి, అందలి ప్రజలందరిని సంహరించి అష్షూరు రాజ్యమును

జయించిరి. ఈ నాశనమును గూర్చి ప్రవక్తయైన నహూము ముందుగా తెల్పెను. రాజైన హిజ్కియా చనిపోయిన దాదాపు 50 సంIIలకు మరొక రాజు దేశములో గొప్ప ఉజ్జీవము కలుగ జేసెను. అతని పేరు యోషియా. అతడు 8 సంIIలు వయస్సు గలవాడైనప్పుడు రాజయ్యెను. హిజ్కియావలె యవ్వనకాలమందు దేవాలయమును శుద్ధిచేసి, దేశములో అన్య విగ్రహారాధనకు స్వస్తి చెప్పెను.

పనివారు దేవాలయమును బాగుచేయుచున్నప్పుడు మోషే ధర్మశాస్త్ర గ్రంథమొకటి దొరికినది. యాజకులు దానిని చదివి రాజునొద్దకు తీసుకుపోగా, రాజు, ప్రజలు యెహోవా ఆజ్ఞలను తెలిసికొని, బహుగా ప్రలాపించి పశ్చాత్తపపడిరి. ఈ విధముగా దేశమంతటిలో హిజ్కియా కాలములోని ఉజ్జీవముకన్న మరిగొప్ప ఉజ్జీవము కలిగెను. (2దిన 34-35అధ్యా). అయినను పూర్వమువలె ప్రజలలో స్థిరమైన పరివర్తన కలుగలేదు. చివరికి ప్రజలు దేవునిమీద తిరుగుబాటు చేయగా యెహోవా వారిమీదకు బబులోనీయులను శిక్షగా పంపవలసి వచ్చెను. (2దిన 36అధ్యా). బబులోనీయులు వారిని ఏవిధముగా శిక్షించినది మరియు వారిని ఏవిధముగా మూడు దఫాలుగా బానిసలుగా బంధించి చెరపట్టుకొనిపోయినది మనము తరువాత పాఠములో నేర్చుకొనగలము.

---

Bible Lesson No - 14 **బైబిల్ పాఠము** -14

# బబులోను రాజ్యము (The Kingdom of Babylon)

అష్షూరు రాజ్యము తన పొరుగున ఉన్న చిన్న చిన్న రాజ్యములన్నింటిని జయించినట్లు చూచితిమి. కాని దిగువనున్న గొప్ప రాజ్యమగు ఐగుప్తు మీదకు ఎన్నిసార్లు దండెత్తినప్పటికి ఆ దేశమును జయించలేకపోయినది. ఐగుప్తు మరియు అష్షూరు సైన్యములు తరచుగా యూదా దేశములో యుద్ధమునకు తలపడెడివి. చిన్న దేశమగు యూదా, అష్షూరునకును మరియు ఐగుప్తునకును మధ్య ఉన్నందున ఆ రాజ్యపు స్థితి రెండు తిరుగటి రాళ్ళ మధ్య నలుగుచున్నటువంటి గింజవలె ఉండెను. అష్షూరీయులు తమ దేశమును పాడుచేయకుండునట్లు కొంతమంది యూదారాజులు అష్షూరు రాజుకు వెండి, బంగారములు కప్పముగా చెల్లించుచుండెడివారు. హిజ్కియా అట్లు చేయక కేవలము దేవునిపై ఆధారపడి తుదకు దేవుని అత్యద్భుత కార్యములద్వారా అష్షూరు సైన్యము నాశనమవ్వగా యూదులు రక్షింపబడిరి. యూఫ్రటీసు మరియు టైగ్రిస్ నదుల మధ్యనున్న దేశమే అష్షూరు మరియు మెసపొటేమియా అని పిలువబడేది. కాని ఇప్పుడు అది ఉత్తర ఇరాక్‌గా పిలవబడుచున్నది. అష్షూరు రాజ్యం క్రింద ప్రాంతములో కల్దీయుల దేశము ఉండెడిది. ఇప్పుడది దక్షిణ ఇరాక్‌గా పిలువబడుచున్నది. దీని రాజధాని బబులోను. బబులోను యొక్క గొప్పతనమును బట్టి ఆ ప్రాంతమంతటికి మరియు ఆ దేశమంతటికి బబులోను అను పేరు వచ్చినది. దీనిని మొదట పరిశుద్ధ గ్రంథములో షీనారు దేశమని పిలిచారు. (ఆది 10:10). క్రీ.పూ 745 సంIIలో అష్షూరు రాజు బబులోనును ఆక్రమించుకొని అందున్న బలమైన కొందరిని 10 గోత్రాల ఇశ్రాయేలు రాజ్యములోనికి నడిపించినారు. ఇంకా అనేక దేశాలకు బానిసలుగా పంపించినారు. క్రీ.పూ 626లో మరల బబులోను వారు కూడగట్టుకొని అష్షూరువారిని ఓడించినారు. అష్షూరు రాజ్యము బబులోను వారిచే నాశనమైనదని వినగానే యూదావారికి గొప్ప సంతోషము కలిగెను. రాజైన హిజ్కియా

బబులోను నుండి వచ్చిన రాయబారులను చేర్చుకొని తనకు కలిగిన ఆస్థినంతటిని వారికి చూపించెను. ఈ తెలివిమాలిన పనిని బట్టి దేవుడు ప్రవక్తయైన యెషయా ద్వారా "కొంతకాలమునకు దేవాలయములోని ఐశ్వర్యమంతటిని బాబెలు రాజు చేజిక్కించుకొనును" అని గద్దించెను. (2దిన 32అధ్యా). అష్షూరు రాజ్యము పతనమునకు కారణము వారిలో ఉన్న అంతర్గత కలహములే.

బబులోనువారు మహా పట్టణమైన అష్షూరు రాజధానియైన నినివెను విచ్ఛినంగావించిరి. ఆ విధముగా యోనా మరియు నహూము ప్రవక్తల ప్రవచనములు నెరవేర్చబడినవి. బబులోను రాజు చుట్టూ ఉన్న అనేక రాజ్యాలను ఆక్రమించుకొనెను. బాబెలువారు ఐగుప్తును కూడా జయించుటకు బయలుదేరిరి. ఐగుప్తునకు మార్గము యూదా దేశములోనుండి పోవుచున్నందువలన యూదావారు బాబెలువారికి భయపడి లొంగిపోయి బాబెలు రాజుకు ప్రతి సం॥ము కప్పము కట్టుచు వచ్చిరి. కాని రాజైన హిజ్కియా మాత్రము కప్పము కట్టక దేవుని మీద ఆధారపడెను. దేవుడతనికి సహాయముచేసి ఆశ్చర్యకరముగా యూదావారిని కాపాడెను. కాని తరువాత యూదారాజులు హిజ్కియావలె దేవుని మాటకు లోబడనొల్లకపోయినందువలన దేవుడు వారికి సహాయము చేయలేపోయెను.

హిజ్కియా ఏలుబడిలో ప్రవక్తయైన యెషయా, రాజుకును ప్రజలకును ఆత్మీయ సలహాలు ఇచ్చినవిధంగానే తరువాత కూడా 120 సం॥లకు ప్రవక్తయైన ఇర్మియా యూదారాజులకును అధికారులకును దేవుని మాటలు చెప్పెడివాడు. అదేమనగా యూదావారు కాపుదల నిమిత్తము దేవునివైపు చూడవలెననియు సహాయముకొరకు ఐగప్తువైపు చూడవద్దనియు సలహాలు ఇచ్చెడివాడు. కాని వారు వినలేదు. బబులోనుకు ఐగుప్తుకు మధ్య దీర్ఘయుద్ధం జరుగుచుండగా యూదారాజగు యెహోయాకీము ఇర్మియా సలహాకు విరుద్ధంగా ఐగుప్తుకు మద్దతునిచ్చాడు. (2రాజులు 24:1, యిర్మియా 27:9-11) అంతేకాక వారు తన మాట వినకపోయినయెడల బబులోను రాజగు నెబుకద్నెజరు వచ్చి యెరూషలేమును అందలి ప్రజలందరిని భవనములన్నింటిని, దేవాలయమును నాశనముచేసి సమస్త ఐశ్వర్యమును దోపుడు సొమ్ముగా తీసికొనిపోవునని యిర్మియా ప్రవచనము ద్వారా ఏంతో ముందుగా హెచ్చరిక చేసెను. ఇట్టి మాటలు చెప్పినందున యూదా దేశపు పెద్దలు ఇర్మియాను దేశద్రోహిగా భావించి అతనిని ఎన్నో విధములుగా దూషించి బంధించి, బాధించిరి. ప్రవక్తయైన ఇర్మియా తన మాటలను గ్రంధములోవ్రాయించినపుడు రాజైన యెహోయాకీము దానిని చింపి కాల్చివేసి ఇర్మియాను బంధించి బందీ గృహములో ఉంచెను. (ఇర్మియా 36 అధ్యా). అయిననూ ఇర్మియా యూదావారు 70 సం॥లు బాబెలు దేశములో బానిసలుగా నుండవలసి వచ్చునను మాటలే పదే పదే చెప్పెడివాడు. (యిర్మియా 11, 13,16, 19, 26, 36, 37 అధ్యా)

యిర్మియా చెప్పినట్లే అంతా జరిగెను. రాజైన నెబుకద్నెజరు క్రీ.పూ 597లో యెరూషలేముమీద దండెత్తి ప్రజలను మూడు దఫాలుగా తన దేశమునకు చెరగా తీసికొనిపోయెను. రాజకుటుంబీకులను, శిల్పకారులను, కంసాలివారిని, కుమ్మరివారిని, తాపీ పనివారిని, వడ్రంగులను మొదలగు నేర్పరితనముగలవారిని బబులోను దేశమునకు తీసికొనిపోయెను. అచ్చట తాను జయించిన

దేశములన్నిటినుండి చెరగా తీసుకొని తెచ్చినవారి పనితనముతో అతడు బాబెలు పట్టణమును బహుగొప్పగా కట్టించెను. బాబెలు నిజముగా మిక్కిలి సుందరమైన నగరము (దాని 4:28). బబులోను పట్టణము నెబుకద్నెజరు కాలములో అన్నింటికంటె గొప్ప ప్రాకారమాయెను. దాని చుట్టుకొలత 42 మైళ్ళు. దాని ప్రాకారములు 112 గజములు ఎత్తుగాను 28 గజములు వెడల్పుగాను ఉండెడివి. వాటికి ఇత్తడి ద్వారములుండెడివి. బబులోను పట్టణమందలి ఉద్యాన వనములు ప్రపంచ ప్రఖ్యాతి చెందినవి. ఈనాడు దక్షిణ ఇరాక్‌లోనున్న ప్రపంచ ఏడు వింతలలో ఒకటైన వ్రేలాడు వనములు ***(Hanging Gardens)*** బబులోనుకు చెందినదే. బబులోను పట్టణము ఈ లోకమహిమకు సాదృశ్యముగా ఉండెడిది. కాని దేవుడు బబులోను పట్టణమును సర్వనాశనము చేసెను. ఒక్క వ్రేలాడు వనములు తప్ప ఆనాటి బబులోను పట్టణమునకు సంబంధిచినవి ఏవికూడా ఇప్పుడు లేవు.

నెబుకద్నెజరు తాను తెచ్చిన బందీలలో నుండి ఉన్నత కుటుంబాలకు చెందిన తెలివైన యువకులకు అందరికి కల్దీయ భాషలో విద్యను, రాజ్యాంగ పద్ధతులను నేర్పించి తుదకు వారికి ప్రభుత్వ ఉద్యోగములను ఇప్పించెను. అట్టివారిలో దానియేలు, షద్రకు, మేషకు, అబెద్నెగోలు ఉండిరి. నెబుకద్నెజరు మొదటిసారి యెరూషలేముపైకి దండెత్తి దానిని జయించి యూదారాజైన యెహోయాకీమును బందీగా బబులోనుకు కొనిపోవు సమయములో అతనికి ప్రతిగా యూదా దేశమునకు సామంతరాజుగా దావీదు వంస్థుడైన సిద్కియాను నియమించెను. ఇతడు యూదారాజైన యోషీయా కుమారులలో మూడవవాడు. యూదా రాజ్యమునేలిన రాజులలో 20వ రాజు మరియు చివరి రాజు. "నీవు ఏ స్థితినుండి పడితివో అది జ్ఞాపకము చేసికొని మారు మనస్సు పొంది ఆ మొదటి క్రియలను చేయుము. అట్లు చేసి నీవు మారుమనస్సు పొందితేనే సరి. లేనియెడల నేను నీయొద్దకు వచ్చి నీ దీప స్థంభమును దాని చోటునుండి తీసివేయుదును." (ప్రకటన 2:5) అని ప్రభువు వాక్యము సెలవిచ్చుచున్నది. నిజముగా యూదారాజులులలో అధికులు దావీదు నడిచిన మార్గములందు నడువక తమ మొదటి స్థితిని పోగొట్టుకొనిరి. అయినను దేవుడు దయతో తన ప్రవక్తలను పంపి ఆ మొదటి స్థితిలోనికి అనగా దావీదు ఏ విధంగా నడిచాడో ఆవిధముగా నడువమని బుద్ధి చెప్పినను అధికార ధన గర్వమువలన వినరైరి. అందుకే దేవుడు వారి దీపస్థంభమైన దావీదు వంశముయొక్క రాజరికమును నరికి వేయుటకు ఆయుత్తమైనాడు. ఈ సంఘటన మన ఆత్మీయజీవితాలకు ఎంతో గుణపాఠముచెప్పగలదై యున్నది. వారి పాపము పండవలసియున్నది గనుక రాజైనా సిద్కియాగాని, అధికారులుగాని ప్రజలలో ఎవరుగాని దేవుడు పంపిన ప్రవక్తయైన ఇర్మియా మాటలు ఎంతకూ వినరైరి. విగ్రహములను నిలిపి, దేవాలయమును అపవిత్రపరచి, న్యాయముతీర్చుట అనునది దేశమందు లేకుండా చేసెను. సిద్కియా ఏలుబడి ప్రారంభించగనే ఏదోము, మోయాబు, అమ్మోను, తూరు, సీదోను మొదలగు వారు ఒక్కుమ్మడిగా బబులోను వారిపై తిరుగుబాటు చేసే ఏర్పాటుచేసుకొనిరి. కాని ఇది దైవ చిత్తముకాదు కనుక దేవుడు తన ప్రవక్తయైన యిర్మియాను పంపి కఠినముగా ఖండింపచేసెను. (యిర్మి 27:1-11). దేవుని విరోధులైన ఈ రాజ్యాలన్నింటిని బబులోను రాజుకు ఇచ్చుట దేవుని ఉద్దేశమని దేవుడే తన ప్రవక్తల ద్వారా తెలియజేశాడు. (యిర్మి 27:5-6). "యెహోవాకు వ్యతిరేకమైన ఏ ఆలోచనయు నిలువనేరదు." (సామె 21:30). చివరికి సిద్కియా బహుమూర్ఖుడై దేవునిమీద తిరుగబడి తనను

గద్దెనెక్కించిన రాజైన నెబుకద్నెజరుకే ఎసరుపెట్టాడు. అందుకే ఇక దేవుడు కూడా సహించలేకపోయాడు.

దేవుడు ఎంతోకాలమునుండి యూదారాజుల పాపమును ఓర్చుకుంటూ వచ్చాడు గాని ఇచ్చిన సమయము ముగియగానే దేవుని కోపము ఒక్కసారే మండుట ఫలితముగా సిద్కియా ఏలుబడి 9వ సం॥ము, 10వ నెల, 10వ దినమున బబులోను రాజైన నెబుకద్నెజరు మూడవసారి క్రీ.పూ 586 సం॥న యెరూషలేము మీద దండెత్తి, అతడు పట్టణమును పూర్తిగా నాశనముచేసి దేవాలయములోని బంగారు, వెండి ఉపకరణములను అన్నింటిని కొల్లగొట్టి బబులోనుకు కొనిపోయెను. బబులోను సైన్యములు యెరూషలేము ప్రాకారములు పడగొట్టి యౌవనులు, ముసలివారని తేడా చూపక కనికరములేకుండా అందరిని అనగా యెరూషలేములో నిలిచిన వారందరిని కత్తితో సంహరించెను. యూదా రాజగు సిద్కియాను దోషిగా నిర్ణయించి అతని కన్నుల ముందరే అతని కుమారులను పట్టుకొని చంపివేసిరి. తాను చేసిన పాపములకు తన కన్నుల ఎదుటనే శిక్షకూడా చూడ వలసి వచ్చినది. వెంటనే రాజైన నెబుకద్నెజరు సిద్కియా కన్నులు పొడిచి ఊడబెరికించి, సంకెళ్ళువేసి అతనిని కూడా బబులోను తీసుకొనిపోయెను. తన మరణమువరకు సిద్కియా బబులోను చెరలోనే యుండెను. (యిర్మీ 52:11). దేవుని వాక్యము నిర్లక్ష్యముచేయువారి చివరి పరిస్థితి ఎంత భయంకరమో గమనించినారా! సిద్కియా అనగా 'యెహోవా నీతి' అని అర్ధము. కాని దేవుని నీతిని వెదకవలసిన ఇతడు ప్రవక్తల దేవుని వాక్యమును వినకుండా వాక్యమును హేళనచేసి దేవుని నామమునకు అవమానకరముగా ప్రవర్తించినందుకు ఘోరముగా శిక్షింపబడి, పరిశుద్ధపట్టణమైన యెరూషలేము అన్య జనులచే త్రొక్కబడి కాల్చబడి యూదులందరు చెరగొని పోబడి చివరకు దావీదు సింహాసనమే తీసివేయబడినది. సిద్కియా ఏలుబడి అంతటిలో యిర్మీయా ప్రవచించుచునే యుండెను. ఈ సిద్కియా పేరు యిర్మీయా గ్రంథములో 48 సార్లు వ్రాయబడినది. రాజులు దినవృత్తాంత గ్రంథములో కేవలము 14 సార్లు మాత్రమే పేర్కొనబడినది.

యూదా జనాంగము బబులోను చెరలో తిరుగులాడుచు సియోనును జ్ఞాపకము చేసికొనుచూ యేడ్చినారు. ప్రజల దుస్థితి ఎట్లున్నదో వారి నాయకులు వారిని ఎట్లు నరకమునకు నడిపించిరో పరిశుద్ధ గ్రంథములో మనకు గుణపాఠముగా వ్రాయబడెను. పాపులైన రాజులు ఈ విధముగా ప్రవర్తించినందువలన కన్నులారా చూచుచుండగనే గొప్ప గొప్ప నాయకులు, న్యాయాధిపతులు, రాజలు, ప్రవక్తలు, యాజకులు జన్మించిన దేవుని ప్రజల రాజ్యము సర్వనాశనము చేయబడినది. ఇంతటితో ముగియుచున్న ఈ యూదా రాజుల చరిత్రయంతటిలో మనము నేర్చుకొనవలసినది ఒక్కటే. ఏ మానవుడైనను, అనగా పురుషుడైనను స్త్రీయైనను మానక పాపము చేసినయెడల చూచుచుండగనే ఏదో ఒక రోజు పాపము పరిపక్వమై మరణమును కనును. ఎవరైతే దావీదు మాదిరిగా తననుతాను తగ్గించుకొని, పాపములను ఒప్పుకొని, క్షమాపణ పొందిన యెడల ఆయన స్థిరమైన రాజ్యమునకు వారసులు కాగలరు.

యూదులందరు ఒక్కసారి చెరకు కొని పోబడలేదుగాని, మూడు పర్యాయములు మరియు దావీదు పట్టణమైన యెరూషలేము కాల్చబడిన తరువాత మరియెకసారి జరిగినది. మొదటిగా నెబుకద్నెజరు క్రీ.పూ 606 సం॥న యూదారాజైన యెహోయాకీమును జయించి రాజ సంతతిని, దేవాలయపు ధనరాశులను,

అధికారులను మేధావులను ప్రవక్తయైన దానియేలుతో సహా అందరిని బాబెలు తోడుకొని పోయెను. రెండవసారి యెహోయాకీము కుమారుడైన రాజు యెహోయాకీను కాలములో అనగా క్రీ.పూ 597 సం॥లో జరిగెను. యూదారాజైన యెహోయాకీనును, పదివేలమంది అధిపతులను, పరాక్రమశాలురను, మరియు వివిధపనులలో నైపుణ్యముగలవారిని బాబెలు చెరగొని పోయెను. మూడవసారి తన సామంత రాజైన సిద్కియాను, ఇంకా అనేక మందిని చెరగొనిపోయెను. ఈవిధముగా నెబుకద్నెజరు 20 సం॥లలో 3 పర్యాయములు యెరూషలేమును ముట్టడించి నాశనముచేసెను. తరువాత మరల 5 సం॥లకు వచ్చి 745 మందిని చెరపట్టి (యిర్మి 52:30) బాబెలునకు తీసుకొనిపోయెను.

బబులోనీయులు బాధించువారైనను, అష్షూరీయులంత క్రూరులుకాదు. బబులోనువారు చెరగొనిపోయినను ప్రజలను నానా స్థలములకు చెదరగొట్టెడివారు కారు. నెబుకద్నెజరు వారందరిని బాబెలు దేశమునకు తీసికొనిపోయి అచ్చట వారిచేత కొంత కాలము వెట్టి పనులు చేయించెను. తరువాత యూదులను కొన్ని కొన్ని పట్టణములలో నిర్భయముగా నివాసము చేయనిచ్చెను. యోగ్యత గలవారికి ప్రభుత్వములో ఉద్యోగములనిచ్చెను. కొంతకాలమునకు దానియేలు ప్రధాన మంత్రి అయ్యెను. వారక్కడ 70 సం॥లు ఉండవలసినదని ప్రవక్తయైన యిర్మీయా ముందుగా యెరూషలేములో చెప్పినను అప్పుడు ఎవరును అతని మాటలను లక్ష్య పెట్టలేదు. అబద్ధ ప్రవక్తలనేకమంది లేచి యూదులు తిరిగి స్వదేశమునకు వచ్చెదరని ప్రకటించెడివారు. అందువల్ల యిర్మీయా బాబెలు దేశములో చెరలోనున్న వారికొక ఉత్తరము వ్రాసి పంపెను. వారు అక్కడ 70 సం॥లు ఉండవలయునని, కనుక వారు ఇండ్లు కట్టించుకొని, తాము వ్యాపారములు, పెండ్లిండ్లు చేసికొని, తాము నివసించుచున్న పట్టణముల క్షేమము కొరకు ప్రార్థన చేయవలసినదని, 70 సం॥లైన పిదప వారు తిరిగి యెరూషలేమునకు వచ్చి దేవాలయము కట్టించవలసియున్నదని ఆ ఉత్తరములో వ్రాసెను. (ఇర్మీయా 29 అధ్యా). దేవుడు యవ్వన ప్రవక్తయైన యెహెజ్కేలు ద్వారా వాక్యమును చెరలో ఉన్న యూదులకు సజీవముగా ఉంచెను. దానియేలు తన ముగురు స్నేహితులను బట్టి రాజు మొదలుకొని ప్రజలవరకు యూదావారి దేవుడు మహోన్నతుడని సజీవుడని నిజమైన జీవముగల దేవుడును, తన ప్రజలను రక్షింప సమర్థుడునై యున్నాడని తెలుసుకొనిరి. (దానియేలు 2:47, 3:28-29, 4:34-37, 6:25-28).

Bible Lesson No - 15 **బైబిల్ పాఠము** -15

# పారశీక రాజ్యము (The Kingdom of Persian)

బబులోను రాజ్యము బహు వైభవముతో విలసిల్లినను అది షుమారు 60 సం॥లు మాత్రమే నిలిచెను. ఆ దినములలో మరియొక రాజ్యము బల ప్రభావములను సంపాదించుకొనుచుండెను. అదే మాదీయ, పారశీక రాజ్యము. అందలి మొదటి రాజు కోరేషు. అతడు తన రాజ్యము బహుగా విస్తరింపజేయవలెనని కోరెను. అందునుబట్టి బాబెలు రాజ్యమంతటిని ఆక్రమించ తలంచెను. యుద్ధములు చేసి తన రాజ్యమును పటిష్టము గావించుకొనుట అతనికి ఏమాత్రము ఇష్టములేదు. రాజధాని పట్టణమైన బబులోనును యుద్ధము చేయకుండానే చేజిక్కించుకొని తద్వారా బాబెలు రాజ్యమును వున్నది వున్నట్లే

వశీకరించుకొనవలెనని నిశ్చయించుకొనెను.

కోరేషునకిట్టి ఉద్దేశము కలుగగా అతడు మాయోపాయము ఒకటి పన్నెను. బాబెలు పట్టణము మధ్య యూఫ్రటీసు నది ప్రవహించుచుండెడిది. ఆ పట్టణము యొక్క ప్రాకారములు ఆ నదిపైన వంతెనవలె కట్టబడినవి గనుక కోరేషు సైన్యము నదికి ఎగువను కొన్ని మైళ్ళ దూరమున ఒక పెద్ద ఆనకట్ట కట్టి నదిలోని నీటిని కాలువల లోనికి మళ్ళించుటకు రహస్య ఏర్పాట్లు చేసెను. ఆ విధముగా నదిలోని నీరు ఎండి పోజేసిరి. ఈ ఎత్తుగడ ఎపుడు వేసిరనగా బబులోను రాజనగరులో గొప్ప విందు జరుగుచున్న దినములలో బాబెలు పురములో రాజైన బెల్షాజరు గోడమీదనున్న వ్రాతను చూచి మిక్కిలి భయపడుచున్న రాత్రియే కోరేషు సైన్యము నదీ గర్భములో ఆరిన నేలపై నడుచుచూ వచ్చి ప్రాకారముల అడుగు భాగముగుండా వచ్చి పట్టణములోనికి ప్రవేశించెను. ఎక్కువగా పట్టణమును, పట్టణస్తులను నాశనము చేయకుండా కోరేషు, బబులోను రాజైన బెల్షాజరును, మంత్రి వర్గమును మాత్రమే సంహరించి ప్రభుత్వమును క్రీ.పూ 539లో వశపరచుకొనెను. తదుపరి రాజ్యము
నంతటిని హస్తగతము చేసికొనెను.

కోరేషు రాజు అష్షూరీయులవలె ప్రజలను క్రూరముగా బాధించి హింసించలేదు. బబులోనీయులవలె ప్రజలను దూర దేశములకు చెరగొని పోవుటవంటి పనులు కూడా చేయక ఒక నూతన విధానమును అవలంబించెను. అదేమనగా బాబెలుకు ఇదివరలో ఆయాదేశములనుండి చెరగా తీసికొని రాబడిన ప్రజలను తిరిగి తమతమ స్వదేశములకు పంపివేయ నిశ్చయించుకొనెను. ఆవిధముగా చేసినచో వారు బహుగా సంతోషించి తనను ఎక్కువ భక్తితో సేవించెదరని కోరేషు భావించెను. ఎవరి రాష్ట్రమును వారే పరిపాలించుకొనుచూ వ్యాపారముచేసికొనుచూ, రాష్ట్రములన్ని ఒక రాజ్యముగా ఉండవలెనని కోరేషు ఉద్దేశించెను. అందుచేత అతడు బాబెలు పట్టణమునుగాని మరియే ఇతర పట్టణములనుగాని నాశనముచేయక, తన రాజ్యము చిరకాలము వర్ధిల్లునట్లు ఎవరి దేవతలను వారు ప్రార్థింపవలెనని కోరెను. ముఖ్యముగా కోరేషు, దానియేలు తదితర యూదులు ఇచ్చిన సాక్ష్యములను బట్టి ప్రభావితుడై యూదుల దేవుడే అన్ని దేవతల కన్న గొప్ప దేవుడని, జీవముగల దేవుడని, గ్రహించుకొన్నందున యూదులు యెరుషలేముకు వెళ్ళి దేవాలయము కట్టించి బలులర్పించి తన నిమిత్తమై ప్రార్థించవలెనని ఒక ప్రత్యేకమైన శాసనము ప్రకటించెను. మరియు ఆయా కారణములచేత యెరూషలేముకు తిరిగి వెళ్ళలేని వారు, వెళ్ళేవారికి ఆర్థిక సహాయము చేయవలెనని ఆజ్ఞాపించెను. ఇది 2 దిన వృత్తాంతములు 36:22-23లోను, ఎజ్రా 1:1-4లోను చదువవచ్చును. అట్లే క్రీ.పూ 538వ సం॥న వేలకొలది యూదులు మూడు జట్లుగా తమ దేశమునకు తిరిగి వెళ్ళ నారంభించిరి. జెరుబ్బాబెలు షెష్బజరు యెహోషువ అనువారి నాయకత్వమున బ్రంహ్మాండమైన ఇశ్రాయేలీయుల మొదటి జట్టు బాబెలు దేశము విడిచి యూఫ్రటీసు నదీతీరము ననుసరించి కొండలుదాటి 800 మైళ్ళ దూరము ప్రయాణము చేసి, యెరూషలేము చేరుకొనిరి. దీనిలో కడు ఆశ్చర్యమేమనగా కోరేషు అను ఒక గొప్పరాజు శాసనమును బట్టి చెరగొనిపోబడిన అనేకమంది యూదులు పాడై పోయిన యెరూషలేమునకు తిరిగి పంపబడి దానిని

పునర్నిర్మాణము చేయుదురని దాదాపు 200 సం॥లకు పూర్వమే దేవుడు ప్రవక్తయైన యెషయాద్వారా పలికించెను. ఇశ్రాయేలీయులను చెరనుండి విముక్తి చేయు ఆ రాజు పేరుకూడా దేవుడు ముందుగా తెలిపెను. (యెషయా 45:1). అట్లే యిర్మీయా ప్రవక్త ఇశ్రాయేలీయులను గూర్చి పల్కిన ప్రవచనములన్నియు కూడ అతడు చెప్పినట్లే 70 సం॥లు పూర్తికాగానే నెరవేరినవి. యూదులు బబులోను చెరలోనుండి విముక్తిపొంది తిరిగి యెరూషలేమునకు వచ్చిరి. దేవుడు సెలవిచ్చిన ప్రవచనములన్నియు తప్పక నెరవేరును గదా!

యెరూషలేములోని దేవాలయమును బహు చక్కగా తిరిగి కట్టవలెనని ప్రవక్తయగు యెహెజ్కేలు కూడా బాబెలు దేశములోని యూదులను ప్రోత్సహించెను. ప్రభువునందు ఆసక్తిగలవారు మాత్రమే ఆ కష్టతరమైన ప్రయాణము చేయుటకు ముందుకు వచ్చిరి. తీరా యెరూషలేమునకు వచ్చి చూచినప్పుడు వారు కడు నిరాశ చెందిరి. ఎందుకనగా యెరూషలేము పూర్తిగా పాడై 70 సం॥ములనుండి పూర్తి శిథిలావస్థలోనుండెను. దేశపు విస్తీర్ణము బహు తక్కువ. ఉన్నవారైనను మిక్కిలి బలహీనులు, దరిద్రులు. షష్బజరు దేవాలయములోనికి కావలసిన బంగారు, వెండి పాత్రలు మరియు ఉపకరణములు తీసికొని వచ్చెను. యెహెజ్కేలు ప్రోత్సహించనట్లు బహు గొప్ప దేవాలయుమును కట్టవలెనని వారు నిరీక్షణతో వచ్చిరి. కాని వారి ఆశ అనతి కాలములో నిరాశగా మారిపోయెను. అచ్చట జీవించుటే వారికి బహు కష్టముగా ఉండెను. నివాసమునకు ఇళ్ళు లేవు  కనుక ఇళ్ళు కట్టించుకొనవలెను. తినుటకు ధాన్యము లేదు కనుక వ్యవసాయము చేయవలసి వచ్చెను. పొలములు అనేక సం॥లనుండి సేద్యము చేయబడనందువలన బీడు భూములుగా మారియుండెను. మేము బాబెలులోని మా చక్కని గృహములను సారవంతమైన భూములను సంపాద్యములను ఇందుకొరకే విడిచిపెట్టితిమాయని వారు బహుగా ప్రలాపించిరి. విలువైన తమ స్వంత సరకులను, దేవాలయముయొక్క ఉపకరణములు భద్రముగా ఉంచుకొనుటకు తగిన స్థలములేక వారు కడు నిరాశ చెందిరి. కాని వారు ముందుగా ఒక బలిపీఠమును కట్టి దానిపై దేవునికి బలులు అర్పించి ఆరాధన స్థాపించి, ఆ విధముగా ధైర్యము తెచ్చుకొని ఆత్మ బలముతో తాము వచ్చిన పనిని మొదలుబెట్టిరి. అయితే ఆ దేశములో నివసించు మిశ్రపు జనమగు సమరయులు ఆ పనికి నానా రకములైన ఆటంకములు కలుగజేసి వారికి శ్రమలు కలుగజేసినందున కొంతకాలము నిరాశతో వారు మందిర నిర్మాణపు పనిని మానివేసిరి. అయితే దేవుడు ప్రవక్తలగు హగ్గయిని జెకర్యాను పంపించి వారిచే ప్రజలను ప్రోత్సహించగా ప్రజలు ఆ దేవాలయమును మరల కట్టుటకు పూనుకొనిరి. క్రీ.పూ 516 సం॥లో ఆ దేవాలయుమును గొప్ప ఆనందోత్సాహములతో దేవునికి ప్రతిష్ఠించిరి. (ఎజ్రా 1-6 అధ్యాయములు). తదుపరి క్రీ.పూ 458 సం॥న శాస్త్రియగు ఎజ్రా ఇంకొక జట్టుతో బాబెలు దేశమునుండి వచ్చెను. అతడు పారశీక రాజుచే పంపబడి యెరూషలేములోను, చిన్న దేశమైన యూదాలోను నూతనముగా నీతి న్యాయ చట్టములను నియమించి, ఆరాధనను క్రమముగా జరిపించెను. అతడు ధర్మశాస్త్రానుసారముగా దేవుని ప్రజలను నడిపించి వారిని క్రమశిక్షణలో పెట్టెను. (ఎజ్రా 7-10 అధ్యయములు)

పారశీక రాజ్యము ముందున్న రాజ్యములన్నిటి కంటే బహు విశాలమైనది. అది ఐరోపా ఖండము మొదలుకొని మన ఇండియా వరకు వ్యాపించి యుండెను. దాని రాజధాని షూషను. పారశీక రాజుకు నెహెమ్యా అను యూదుడు గిన్నె అందించువాడుగా (Cupbearer) ఉండెను. యెరూషలేములో పునరావాసమునకు వెళ్ళిన యూదులు సమరయులచేత హింసింపబడినారని విని, యెరూషలేమునకు ప్రాకారమును కట్టించుటకు సెలవిమ్మని అతడు రాజును అడిగెను. రాజు సెలవైన పిమ్మట నెహెమ్యా క్రీ.పూ 445 సం॥లో అతడు మూడవ చిన్న జట్టుతో యెరూషలేమునకు వచ్చి అక్కడ కొంతకాలము అధిపతిగా ఉండెను. ఆ ప్రాకారములు ఎడున్నర వారములలో అనగా 52దినములలో పూర్తిగా కట్టించి సమరయులు పెట్టిన ఆటంకములన్నింటిని లెక్కచేయక తాను చేయపూనుకొన్న కార్యమును పూర్తిగా ముగించెను. తదుపరి ప్రజలందరు మిక్కిలి సంతోషముతో "మేము దేవుని వాక్యముననుసరించి, ఆయన విధులను, ఆజ్ఞలను గైకొందుమని" యెహోవా యెదుట ప్రమాణము చేసిరి. (నెహె 1-10 అధ్యా) కొంతకాలమునకు నెహెమ్యా తిరిగి షూషను కోటకు వెళ్ళవలసి వచ్చెను. అప్పుడు ప్రజలు కాల క్రమేణా యాధావిధిగా తమ స్వంతపనులయందు నిమగ్నమై దైవ కార్యములను నిర్లక్ష్యముచేసి ఇష్టానుసారముగా దేవుని వాక్యమునకు విరుద్ధముగా జీవించిరి. నెహెమ్యా కొంతకాలమునకు యెరూషలేమునకు తిరిగి వచ్చి వారిని గద్దించెను. అప్పుడు దేవుడు ప్రవక్తయగు మలాకీ ద్వారా మరల వారిని హెచ్చరించి తన తట్టు త్రిప్పుకొనెను. నెహెమ్యా కాలము పిమ్మట నూటయాబది సం॥ల వరకు పారశీకులు యూదా ప్రజలను పాలించిరి. మత పరమగు పండుగలను జరుపుకొనుటకు పారశీక ప్రభుత్వము యూదులకు అనుమతి నిచ్చెను. పారశీక ప్రభుత్వము నియమించిన యూదా ప్రధాన యాజకులు యూదా దేశమునకు అధిపతులుగా ఉండిరి. ఈ విధముగా పారశీకుల పాలనలో యూదులు సుఖజీవనము చేయగలిగిరి. కాని ఈ ఏర్పాటు వలన ప్రధాన యాజకత్వ ఉద్యోగము ఇంతకు ముందు ఎన్నడూ లేనివిధముగా రాజకీయములతో ముడిపడెను. తత్ఫలితముగా ప్రధాన యాజకత్వ ఉద్యోగమును పొందగోరినవారు పవిత్రతను వదలి ఆధికారకాంక్షతో, ద్వేషము, కుట్రలు, హత్యలతో కూడిన బహువిధ దుష్కార్యములకు పాల్పడిరి.

ఈ విధముగా యెరూషలేము పట్టణములో జరుగుచుండగా, పారశీక రాజ్యమందు ఎస్తేరు చరిత్ర జరుగుచుండెను. ఆ గ్రంథమందు దేవుడు ఆయా దేశములలోనికి చెదరగొట్టబడిన తన ప్రజలను ఎట్లు నాశనమునుండి కాపాడెనో, మనము చదువవచ్చును. ఇక్కడితో పాతనిబంధన చరిత్ర ముగియుచున్నది. పాతనిబంధన చరిత్రకు క్రొత్తనిబంధన చరిత్రకు మధ్య 400సం॥లు జరిగినవి. ఆ నిశబ్ద సం॥లలో జరిగిన చరిత్ర బైబిలు గ్రంథములో వ్రాయబడకపోయినా ఇతర అప్రమాణిక చరిత్ర గ్రంథాల ద్వారా మనము తదుపరి పాఠములో తెలుసుకొనబోవుచున్నాము.

# గ్రీకు రాజ్యము (The Kingdom of Greece)

దానియేలు 20వ అధ్యాయములో నెబుకద్నెజరు కనిన కలలలో ఒక గొప్ప ప్రతిమ కనిపించెను. దాని శిరస్సు బంగారము, దాని రొమ్ము భుజములును వెండి, దాని ఉదరము, తొడలు ఇత్తడివి, దాని మోకాళ్ళు ఇనుము, దాని పాదములు ఇనుము మరియు మట్టి మిశ్రమము. ఈ నాల్గు లోహములు నాలుగు గొప్ప సామ్రాజ్యములను సూచించుచున్నవి.

**బబులోను=బంగారమువంటిరాజ్యము**

**పారశీకము = వెండివంటి రాజ్యము**

**గ్రీకు = ఇత్తడివంటి రాజ్యము**

**రోమా = ఇనుమువంటి రాజ్యము**

దానియేలు 7వ అధ్యాయములో ఈ నాల్గు రాజ్యములే మరియొక విధముగా వివరించబడెను. ఎట్లనగా---

**బబులోను = సింహము**

**పారశీకము = ఎలుగుబంటి**

**గ్రీకు = చిఱుతపులి**

**రోమా = భయంకరమైన జంతువు**

**(ఇనుపదంతములు కలది)**

ఈ రెండు పోలికలను పరిశీలించిన బంగారము వంటి బబులోను రాజ్యము సింహమువలె క్రూరత్వము కలది. పారశీకరాజ్యము అంత ఐశ్వర్యవంతముమైనది కాకపోయినను ఎలుగుబంటివలె భయపెట్టు స్వభావము కలిగినది. ఇత్తడి వంటి గ్రీకు రాజ్యము చిరుతపులివలె చుట్టు ప్రక్కలనున్న చిన్న చిన్న రాజ్యములన్నిటిని మ్రింగివేయుటకు పొంచియుండెను. ఆఖరుగా రోమా రాజ్యము మహా భయంకరమైన అడవి మృగమువంటిది. రోమియులు నిర్ధాక్షిణ్యంగా ఇనప దండముతో రాజ్యములన్నింటిని అణచివేసిరి. ఈ నాలుగు సామ్రాజ్యములు దానియేలు కాలమునుండి ప్రభువు కాలము వరకు వరసగా ఒకటి తరువాత మరియొకటి పాలస్తీనా దేశముపై ఆధిపత్యము వహించెను. యూదావారు తమ స్వదేశమును తామే పరిపాలించుకొనజూచిరి. కాని అది వీలు పడలేదు. అయినను యూదులు ఎన్నోసార్లు స్వాతంత్ర్యము పొందవలెననెడి ఆశతో తమ్ముకు పాలించుచున్న పరాయి రాజులపై తిరుగుబాటు చేసిరి.

పారశీకులు ఒక గొప్ప పొరబాటు చేసిరి. అదేమనగా వారు పరిపాలించలేనంత విస్తారమైన రాజ్యమును సంపాదించిరి. ఆఫ్రికాలోని ఐగుప్తును వారు ఆక్రమించిరి. వారి రాజ్యము ఆసియాలోని

మన భారత దేశమువరకు వ్యాప్తిచెందెను. అయితే వారు ఐరోపాలోని గ్రీసు దేశమునకు వచ్చినపుడు గ్రీకులు వారిని యుద్ధమునందు ఓడించగా వారు తిరిగి పారశీక దేశమునకు పారిపోవలసి వచ్చెను. కాని గ్రీకులు వారిని వదలిపెట్టకుండ అసమాన ధైర్యమును ప్రదర్శించి వారిని తరిమికొట్టి పారశీక సామ్రాజ్యములోని అనేక రాజ్యములను జయించి తమ చిన్న గ్రీసుదేశమును గొప్పగా వృద్ధిచేసికొనిరి.

మహనీయుడైన అలెగ్జాండరు యౌవనుడైనను బహుజ్ఞానము గల్గిన చక్రవర్తి. అలెగ్జాండరు తూరు సీదోనులను జయించి ఫిలిష్తీయుల దేశమువరకు వెళ్ళెను. ఐగుప్తీయులు అప్పటికే పారశీకులచే పరిపాలింపబడుచుండిరి. అయితే గ్రీకులు వారిని పారశీకులబారినుండి విడిపించిరి. అందుకు గుర్తుగా అలెగ్జాంద్రియా అను ఒక మహా పట్టణమును ఐగుప్తులో అలెగ్జాండరు కట్టించెను. (పటములో చూడుము). అందు అనేకమందియూదులు నివసించిరి. ఆకాలములో వారు పాతనిబంధనను గ్రీకు భాషలోనికి తర్జుమా చేసిరి. అది క్రీ.పూ 200వ సం॥ములో పూర్తిచేసిరి. యూదులు తమ మతాచారములను యధావిధిగా జరుపుకొనుటకు అలెగ్జాండరు సెలవిచ్చెను. అదేవిధముగా అలెగ్జాంద్రియా పట్టణములో యూదులు గ్రీకులతోకలసి సమాన హక్కులు పొందునట్లు శాసించెను. అలెగ్జాండరు చక్రవర్తి, ఆ తదుపరి ఐగుప్తునుండి వెళ్ళి పారశీక దేశమంతా జయించెను. అతడు తన సేనలతో జయోత్సవముగా పాలస్తీనా, సిరియా దేశములగుండా ప్రయాణించి తూర్పు ప్రాంతములకు వెళ్ళి బబులోను, పర్షియా దేశములను జయించెను. అటు పిమ్మట క్రీ.పూ 327లో భారతదేశములో ప్రవేశించెను. పంజాబు ప్రాంతమువరకు వచ్చెను. అయితే అలెగ్జాండరు భారతదేశమునకు వర్షాకాలములో వచ్చినందున అతని సైనికులు అంతటి వర్షమును ఎన్నడును చూడనందున మరియు సంవత్సరముల తరబడి దండయాత్రలు చేయుచున్నందున, విసుగుచెంది గ్రీకుదేశమునకు తిరిగి వెళ్ళిపోయిరి.

అలెగ్జాండరు ఎచ్చటకు వెళ్ళినను గ్రీకు దేశ సంస్కృతిని పరిజ్ఞానమును వ్యాపింపచేసెను. అతని సామ్రాజ్యమందలి దేశములన్నిటిలో ఒక్కొక్క నూతన పట్టణమును ప్రతిచోట నిర్మించెను. అపట్టణములు కేవలము గ్రీకు సంప్రదాయము ననుసరించి నిర్మించబడెను. గ్రీకుదేశములో ఉన్నట్లు అపట్టణములలో గ్రీకుల సంప్రదాయము ప్రకారము గొప్ప భవనములు, విశాల క్రీడారంగములు నాటక శాలలను నిర్మించెను. గ్రీకు పేర్లు పెట్టుకొనుటకు, గ్రీకుల భాష మాట్లాడుటకును, గ్రీకుల దుస్తులు ధరించుకొనుటకును పలుదేశముల ప్రజలను ప్రోత్సహించుచుండెను. గ్రీకుల పాలన వలన యూదుల జీవనవిధానములో కొంత మార్పువచ్చెను. గ్రీకుల ప్రభుత్వమువలన కలిగిన సౌకర్యములు పాలిత ప్రాంత ప్రజలను బహుగా ఆకర్షించెను. వ్యాపారస్తులకు వ్యాపారముద్వారా గొప్ప ఆదాయము వచ్చెను. పుస్తకభాండాగారములు, పాఠశాలలు విరివిగా స్థాపించబడుటవలన విద్యావేత్తలు హర్షించిరి. మంచి గృహములు, మంచి ఆహారము లభ్యమగుటచే ప్రజల దైనందిన జీవిత ప్రమాణము హెచ్చెను. గ్రీకు సంస్కృతి వలన తమకిట్టి వసతులు లభించినందుకు యూదులు తదితర దేశ ప్రజలు సంతోషించిరి. అట్టిపరిస్థితులలో చాలామంది యూదులు గ్రీకు పేర్లు పెట్టుకొనిరి. అలెగ్జాండరు గ్రీకు తత్వవేత్తయైన అరిస్టాటిల్ శిష్యుడుగనుక అనేక మంది యూదులు గ్రీకు తత్వశాస్త్రమునందు అభిలాషచూపిరి. వారి పితరుల విశ్వాసముతో గ్రీకు జ్ఞానమును

జోడించిరి. మరికొందరు యూదులు గ్రీకుల తత్వశాస్త్రమునెదిరించి, తమ ధర్మశాస్త్రము నందు ఎక్కువగా నమ్మకముఉంచిరి. ఈవిధముగా గ్రీకుల పాలనలో యూదులు మొదటిసారిగా పాశ్చాత్యదేశ నాగరికతకు వారి సంస్కృతికి వారి భావములకు అలవాటు పడవలసివచ్చెను. పారశీకులవలెగాక గ్రీకులు తమ సంస్కృతిని ఇతర దేశములలో బహుళ ప్రచారము గావించిరి. మహా అలెగ్జాండరు కేవలము రాజ్యములను జయించుటయే మాత్రముగాక గ్రీకుల సంస్కృతి స్థాపకుడుగా బహుగా కృషిచేసెను. అలెగ్జాండరు భారతదేశ సందర్శన మూలముగా వారి గ్రీకుభాష నీడలు మనదేశ గణితమునందు మరియు సాంకేతిక శాస్త్రములమీదకూడా పడినవి. ఇప్పటికి గ్రీకు అక్షరములను మన విద్యావిధానములలో వాడుచున్నాము. రెండు విభిన్న నాగరికతలు ఒకేచోట తారసిల్లినపుడు ఉన్నతస్థాయి నాగరికిత దిగువస్థాయి నాగరికతను మ్రింగివేయుట సహజము. ఒక్క మతవిషయములో తప్ప తక్కిన సమస్తమైన విషయములలో గ్రీకు సంస్కృతి యూదా సంస్కృతి పై గొప్పగా ఉండెను. అందువలన అనేక మంది యూదులు గ్రీకులవైపు ఆకర్షితులై క్రొత మతమును స్థాపించుకొనిరి. వీరినే హెల్లేనీయులని అందురు. ఈ విషయము అప్రమాణిక గ్రంథమైన మక్కాబీయుల గ్రంథమునందు ఉదహరింపబడినవి. (1 మక్కబి 1:15) యూదామతమునకు గ్రీకు సంస్కృతికి గల పోరాటమే పాత క్రొత్తనిబంధనల మధ్యకాలపు ముఖ్య విషయము.

అలెగ్జాండరు భారతదేశమునుండి తిరిగి వెళ్ళిన మరుసటి సం॥న తన 32వ ఏట బబులోనులో మరణించెను. అలెగ్జాండరుకు వారసులు లేక గ్రీకురాజ్యములో కొన్ని సంవత్సరముల వరకు భవిష్యత్తు అగమ్యముగా ఉండెను. అలెగ్జాండరు సంపాదించిన రాజ్యమునకై నలుగురు సైన్యాధిపతుల మధ్య కలహములు చెలరేగి రాజ్యమును తమలో తామే విభాగించుకొనిరి. మహా అలెగ్జాండరు దిగ్విజయములుగాని అతని రాజ్య విస్తరణము గూర్చిన విషయములుగాని పాతనిబంధనలో ఉదహరింపబడలేదు. కాని దానియేలు 11:2-13లోను మరియు జెకర్యా 9:13 లోను కేవలము సూత్రప్రాయముగా వ్రాయబడెను. అలెగ్జాండరు నలుగురు సైన్యాధికారులలో ఒకరైన మొదటి టోలెమి ఐగుప్తు, దక్షిణ సిరియా మరియు పాలస్తీనా ప్రాంతములను విభజించి రాజ్యమును ఏర్పాటు చేసుకొని పరిపాలించెను. మొదటి టోలెమి రాజు మరిణించిన తదుపరి వచ్చిన రెండవ టోలెమి కాలములో గ్రీకు భాష అధికార భాష అయినందున హెబ్రీ భాషలో ఉన్న పాతనిబంధనను గ్రీకు భాషలోనికి తర్జుమా చేసిరి. గ్రీకులోనికి తర్జుమా చేయబడిన పాతనిబంధనను 'సెప్టూజియంట్' అని పిలిచినారు. దీని గురించి మనము సంపూర్ణముగా తదుపరి పాఠములో చదువుకొనగలము.

Bible Lesson No - 17 **బైబిల్ పాఠము** -17

## సెప్టూజియంట్-అపోక్రిఫా (The Septuagint - Apocrypha)

**సెప్టూజియంట్:--**నెబుకద్నెజరు కాలములో యూదులు బబులోనులో కల్దీయుల భాష నేర్చుకొనిరి. (దానియేలు గ్రంథము కల్దీయుల భాషలోనే వ్రాయబడెను.) ఇంటిలో మాత్రమే వారు హెబ్రీ భాష

మాట్లాడుకొనేవారు. గ్రీకు రాజ్యము ప్రపంచమంతటా విస్తరించిన తదుపరి విద్యా వ్యాపారమంతయు గ్రీకు భాషలోనే జరుపబడెను. ఆవిధముగా క్రమేపీ చెదరిపోయిన యూదులు అనేకులు తమ స్వంతభాషనే మరచిపోయిరి. అలెగ్జాండరు తరువాత రాజ్యము అతని నలుగురు సైన్యాధిపతులు మధ్య విభజింపబడినది. వారంతట వారే తమ్మును తాము రాజులుగా ఏర్పాటు చేసుకొనిరి. వారెవరనగా

***1. ఐగుప్తును, దక్షిణ సిరియాను పాలించిన టోలమీ,***

***2. చిన్న ఆసియాను, ఉత్తర సిరియాను పాలించిన సెల్యూకస్,***

3. త్రేస్‌ను పాలించిన లిసిమేకస్,

4.మాసిదోనియాను పరిపాలించిన కస్సాండరు.

వీరి నలుగురులో టోలమీయులకు మరియు సెల్యూసిడ్లకు మాత్రమే యూదులతో సంబంధములు ఉన్నవి కనుక మనము వీరి ఇరువురి గురించి మాత్రమే కుప్లముగా నేర్చుకొనబోవు చున్నాము. ముఖ్యముగా టోలమీయులు, మరియు సెల్యూసీయులు పాలస్తీనాను స్వాధీన పరచుకొనుటకు తీవ్రముగా ప్రయత్నించిరి. కాని మొదటి టోలమీ దానిని స్వాధీనపరచుకొనెను. ఐగుప్తు, దక్షిణ సిరియా మరియు పాలస్తీనా భాగములకు చారిత్రాత్మకమైన అలెగ్జాండ్రియాను రాజధానిగా చేసుకొని టోలమీయులు పరిపాలన కొనసాగించిరి.

అలెగ్జాండరు నలుగురు సైన్యాధికారులలో ఒకరైన మొదటి టోలెమి మరణించిన తరువాత రెండవ టోలమీ పరిపాలనలో ఇతడు అలెగ్జాండ్రియా పట్టణమునందు నివసించెడు యూదులను ఎంతో దయతో చూచెడివాడు. అందువలన ఈ అలెగ్జాండ్రియా పట్టణము యూదా మతమునకు చాలా కాలము ముఖ్యస్థానముగా ఉండెను. మొదటి టోలెమి రాజు మరిణించిన తదుపరి వచ్చిన రెండవ టోలెమి కాలములో గ్రీకు భాష అధికార భాష అయినందున హెబ్రీ భాషలో ఉన్న పాతనిబంధనను యూదులు సరిగా అర్ధము చేసుకొనలేక పోయిరి. ఈ సందర్భముగా ఒక విషయమును మనము మరువరాదు. యూదులు చెరగొనిపోబడినపుడు వారు వేర్వేరు ప్రాంతములకు కొనిపోబడిరి. అట్లు చెరగొనిపోబడినవారు అందరు తిరిగి పాలస్తీనా దేశము చేరలేదు. వారిలో కొందరు మాత్రమే తిరిగి వచ్చిరి. కాని వారు తమ హెబ్రీ భాషను మరచిపోయి అరమేక్ భాషను మాట్లాడుచుండిరి. అయితే ఈ అరమేక్ బదులుగా గ్రీకు భాష ప్రాధాన్యతలోనికి వచ్చినందున అలెగ్జాండ్రియాలోని యూదులు గ్రీకు భాషనకు అలవాటు పడిరి. ఇదే సమయములో రాజైన రెండవ టోలమి తమ రాజధానియగు అలెగ్జాండ్రియాలోని ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన గ్రంథాయలములోనికి విలువగలిగిన మరియు ప్రసిద్ధి చెందిన అనేక గొప్ప పుస్తకములను మరియు తమ పట్టణములో ఉన్న విద్యావంతులైన యూదుల కొరకు వారి మత గ్రంథ ధర్మశాస్త్రమును కూడా రాజైన రెండవ టోలమీ తెప్పించెను. అయితే అది యూదులకు తెలియని హెబ్రీ భాషలో వ్రాయబడియున్నందున ఆ మత గ్రంధమును గ్రీకు భాషలోనికి అనువదించాలని గ్రంథాలయ అధికారులు

రెండవ టోలమీ రాజును కోరిరి. ఈ కోరిక మేరకు రెండవ టోలమి సంతోషముతో ఈ తర్జుమాకు సమ్మతించెను. ఈ కార్యర్థమై రాజైన రెండవ టోలమి, కొందరు యూదా మతప్రవిష్టులను యెరుషలేములోఉన్న ప్రధానయాజకునియొద్దకు పంపించి ఈ కోరికను తెలియపర్చెను. అందుకు ప్రధాన యాజకుడు ఎంతో సంతోషముతో అంగీకరించి గ్రంధమును అనువదించుటకు తమ పండ్రెండు గోత్రములనుండి ఒక్కొక్క గోత్రమునకు ఆరేసి మంది చొప్పున 72మంది యూదా ధర్మశాస్త్ర పండితులను ఐగుప్తులోని అలెగ్జాండ్రియా పట్టణమునకు పంపెను. రాజు ఆ 72 మంది పండితులను సన్మానించి వారికి గొప్ప కానుకలను ఇచ్చి ఒక్కొక్కరిని ఒక్కొక్క గదిలో ఉంచి పాతనిబంధనను అనువదించుటకు ఏర్పాట్లు చేసెను. ఈ గొప్ప కార్యమును వారు సరిగ్గా 72 దినములలో పూర్తి చేసిరి. తదుపరి ఆ 72 గ్రంధములను చదువగా ప్రత్యేకముగా అనువదించబడిన ఆ 72 తర్జుమాలన్నియూ ఒకేరీతిగా ఉండెను. ఈ కార్యమునందు 72 మంది పాల్గొనిననూ, 70 మందియే అనువదించినట్లుగా అర్ధము వచ్చువిధముగా గ్రీకులోనికి తర్జుమా చేయబడిన పాతనిబంధనను **'సెప్టూజియంట్'** అని పిలిచినారు. అనగా ***డెబ్బది మంది కృషి*** అని అర్ధము. సెప్టా అనగ 70 అని అర్ధము.

అయితే కాలక్రమేణా ఈ అనువాదమునందు పాతనిబంధనలోని 39 పుస్తకములేగాక అప్రమాణిక గ్రంధములుగా ఎంచబడిన 15 **'అపొక్రిఫా'** పుస్తకములు కూడా ప్రభువైన యేసుక్రీస్తు జీవించిన నాటికి చేర్చబడినవి. అపొక్రిఫా అనగా **'దాచబడిన'** అని అర్ధము. అయితే ఈ 15 పుస్తకములు, తర్జుమా చేయకముందున్న నిజ హెబ్రీ పాతనిబంధన గ్రంధములో లేవు కనుక, మరియు ఈ 15 అపొక్రిఫా పుస్తకములలో కొన్నిటిలో యూదా మతానికి అభ్యంతరకరమైన విషయములున్నందున వీటిని అందరు చదువకూడదని భావించి వాటిని కేవలము యాజకులు మాత్రమే చదువవలెనని ఈ పేరు పెట్టబడెను. ఈ విధముగా 54 పుస్తకములుగల ఈ పాతనిబంధన గ్రీకు సెప్టూజియంట్ క్రీ.శ 90 వరకు కొనసాగినది. అయితే క్రీ.శ 90వ సం॥లో జామ్నియా అను స్థలమున జరిగిన యూదుల సమావేశములో కేవలము 39 పుస్తకములు మాత్రమే దైవావేశముతో వ్రాయబడినవని నిర్ణయించి వానినిమాత్రమే పాతనిబంధన పుస్తకములుగా నిర్ణయించిరి. అయితే ఐగుప్తులోని అలెగ్జాండ్రియా పట్టణమందున్న సెప్టూజియంట్‌లో మాత్రము ఏ మార్పు జరగలేదు కనుక అక్కడ ఉన్న యూదులు అపోక్రిఫా పుస్తకములను కూడా పవిత్రముగా భావించిరి. అపోక్రిఫాలోని 15 పుస్తకములేవనగా

***1. మొదటి ఎస్ద్రోను***
***2. రెండవ ఎస్ద్రోను***
***3. తోబితు (టోబిట్)***
***4. యూదీతు (జూడిత్)***
***5. ఎస్తేరు గ్రంధము (10వ అధ్యాయము 4వ వచనమునుండి 16వ అధ్యాయము వరకు.)***
***6. సొలోమోను జ్ఞాన గ్రంధము***
***7. సీరాకు కుమారుడైన యేసు రచించిన గ్రంధము***
***8. బారూకు***

***9. ఇర్మియా రెండవ భాగము***
***10. పరిశుద్ధులైన ముగ్గురు బాలుర కీర్తన***
***11. సూసన్న చరిత్ర***
***12. బేలు దేవత మరియు ఘటసర్పము***
***13. రాజగు మనష్షే చేసిన ప్రార్థన***
***14. మొదటి మక్కబీయుల గ్రంథము***
***15. రెండవ మక్కబీయుల గ్రంథము***

క్రీ.శ 347సం॥ములో గ్రీకు బైబిల్‌ను లాటిన్ లోనికి తర్జుమా చేసిన పరి. జెరోమ్ మరియు క్రీ.శ 16వ శతాబ్ధములో గ్రీకు బైబిల్‌ను జర్మనీలోనికి తర్జుమా చేసిన డాక్టర్ మార్టిన్ లూథర్ కూడా అవి దైవప్రేరితములు కాకపోయినా ఈ 15 పుస్తకములు, పాతనిబంధన మరియు క్రొత్త నిబంధనలను కలుపు వంతెనలాంటివని భావించి వాటిని కూడా తర్జుమా చేసి ప్రత్యేక పుస్తకములుగా వేరుపర్చిరి. కనుక ఈ అపోక్రిఫా పుస్తకములు పరిశుద్ధ లేఖనములు కాకపోయినా నిశ్శబ్ధ 400 సం॥లలోని చరిత్ర తెలుసుకొనుటకు ఈ అపోక్రిఫా గ్రంథములు ఎంతో ఉపయోగ పడగలవు కనుక అవికూడా చదువుట మంచిదని భావించిరి కాని, పరిశుద్ధ గ్రంథములో మాత్రము వాటిని చేర్చుటకు వారు ఇష్టపడలేదు. ఇది ప్రొటెస్టాంట్ శాఖలవారి అభిప్రాయము. కాని క్రీ.శ 1546లో జరిగిన రోమన్ కేథలిక్ సంఘముయొక్క సమావేశము ప్రకారము ఈ అపోక్రిఫా లోని 15 పుస్తకములలోనుండి 11 పుస్తకములను ప్రామాణికముగా భావించి అధికారపూర్వకముగా వాటిని తమ పరిశుద్ధ గ్రంథములోని పాతనిబంధనలో చేర్చుకొనుటకు ఒప్పుకొనిరి. అందుచేత నేటి వరకు వారి బైబిల్‌లో అవి ఒక భాగముగా ఉన్నవి. కాని ప్రొటెస్టెంట్ శాఖలైన లూథరన్, బాప్టిస్ట్, పెంతెకొస్తు, మెథడిస్టు మొదలైన అనేకులు దీనికి ఒప్పుకొనలేదు కనుక వారి బైబిల్ గ్రంథములోని పాతనిబంధనలో కేవలము 39 పుస్తకములు మాత్రమే ఉన్నవి. ముఖ్యముగా ఈ క్రింది కారణములను బట్టి వారు నిరాకరించిరి.

1. అపోక్రిఫాలోనుండి ఏవాక్యముగాని, క్రొత్తనిబంధనలో ఎత్తి వ్రాయబడలేదు.
2. ప్రభువు శిష్యులకు అపోక్రిఫా తెలిసినను వారు ఎన్నడును తమ గ్రంథములలో లేఖన భాగములుగా వాటిని ఉపయోగించలేదు.
3. ప్రామాణిక గ్రంథముల భాషా శైలికి అపోక్రిఫా గ్రంథముల భాషా శైలికి వ్యత్యాసము కలదు.
4. అపోక్రిఫా గ్రంథములలో కొన్ని చారిత్రిక, భౌగోళిక విషయములు సత్యదూరముగా ఉన్నవి.
5. కాలమును పరిగణించుటలో కొన్ని పొరపాట్లు కలవు.
6. యూదులు మత సంప్రదాయములకు కొన్ని విషయములు అభ్యంతరకరముగా ఉన్నవి.

సెప్టూజియంట్ వ్రాయబడిన తరువాత గ్రీకుల పాలనలో తిరిగి కట్టబడిన యెరూషలేము నందు యూదులు నెమ్మదిగాను, నిర్భయముగాను నివాసము చేసిరిగాని, అలెగ్జాండరు చనిపోయిన తరువాత ఒక గ్రీకు రాజ్యాధిపతి యెరూషలేము వచ్చి తన విజయమునకు గుర్తుగా అన్యుల పద్ధతి చొప్పున

దేవాలయములో బలి అర్పింప ప్రయత్నించెను. యూదులు దానిక ఒప్పుకొనక తిరుగుబాటు చేసిరి. అందుకు అతడు కోపముతో యూదులను హింసింప మొదలుబెట్టెను. అనేక మందిని హతము చేసెను.

కొలది కాలమునకు అంతియోక్ ఎపిఫనీస్ అను మరియొక రాజ్యాధిపతి గ్రీకు రాజ్యమంతటిలో తానే దేవుడనని అందరూ తన్ను పూజింపవలెనని శాసించెను. యూదులు దానికి ఒప్పుకొనక పోయినందున యూదా మతమును నిర్మూలము చేయవలెనని శాసనము గావించెను. అతడు దేవాలయమును దోచుకొని, అతి పరిశుద్ధస్థలమున తన స్వంత ప్రతిమను నిలువబెట్టి తనకు దొరికిన గ్రంథపు చుట్టలను కాల్చివేసి, సున్నతి ఆచారమును మాన్పించి విశ్రాంతి దినములను పండుగ దినములను ఆచరించుట నిషేధించెను. అయితే ఇంత భయంకరముగా హింస వచ్చినను యూదులు తమ మతాచారముల చొప్పున చేయుచున్నందువలన అతడు సైన్యమును యెరూషలేముమీదకు పంపించి ఆ పట్టణమును పూర్తిగా పాడు చేయించి అందలి నివాసులందరిని నాశనము చేయించెను. ఈ విధముగా జరుగునని ప్రవక్తయైన దానియేలు 11వ అధ్యాయములో ముందుగానే తెలియజేసెను. యూదయలోని ప్రతివీధిలో గ్రీకు విగ్రహములు నిలువబెట్టబడెను. వాటికి నమస్కరించని యూదులు కఠినముగా శిక్షింపబడి తదుపరి చంపబడిరి. ఈ హింసలను బట్టి యూదులు అందరు ఏకముగా కొండలకు పారిపోయి అక్కడ ఒక సైన్యమును సిద్ధముచేసిరి. దైవభక్తిపరులుగా ఉన్న 'మక్కబీ' అను కుటుంబ సభ్యులు తమ నాయకత్వములో ఆ సైన్యమును నడిపించి మరల యెరూషలేమును వశపరచుకొని దేవాలయమును శుద్ధిచేసి ఆరాధన క్రమమును తిరిగి స్థాపించిరి. కాని మరల గ్రీకులు దండెత్తి వారిని దేశమునుండి వెళ్ళ గొట్టుటకు ప్రయత్నించిరి. అయితే మక్కబీ నాయకత్వములోని యూదా సైన్యము వారిని ఎదిరించుటకు శక్తిలేక వారు వేరొక క్రొత్తరాజ్యమును సహాయమును కోరిరి. క్రొత్తగా బయలుదేరుచున్న ఆ బలమైన రాజ్యమే **"రోమా రాజ్యము"**. గ్రీకులను మరియు అన్ని రాజ్యములను జయింపవలెనను కోరికగల రోమారాజ్యము సంతోషముగా యూదులకు సహాయము చేసెను. ఈవిధముగా గ్రీకు రాజ్యము ఒకే చక్రవర్తిపాలనలో లేనందువలను బలహీనముగా మారెను. రోమారాజ్యం అంతకంతకు ప్రబలమై ఐరోపా ఖండమును మధ్యధరాసముద్రము చుట్టు ఉన్న దేశములన్నిటిని జయించి అంతకుముందున్న మూడురాజ్యములకన్న బలమైన సామ్రాజ్యముగా మారెను. దీనిని గురించి మనము తదుపరి పాఠములో నేర్చుకొనగలము.

Bible Lesson No - 18 **బైబిల్ పాఠము** -18

# రోమా రాజ్యము (The Kingdom of Rome)

బైబిల్ భూభాగములను అందులో ముఖ్యముగా పాలస్తీనా దేశమును వరుసగా ఐగుప్తీయులు, అష్షూరీయులు, బబులోనీయులు, జయించిన పిదప పారశీకులు, తదుపరి గ్రీకులు జయించి పరిపాలించిరి. చివరిగా ఆ ప్రాంతమంతయు రోమియుల వశమాయెను. రోమా రాజ్యము దానియేలు గ్రంథమందలి నాల్గవ రాజ్యము. ఇది ఇనుము వంటిది. యుద్ధములలో వీరు బహు క్రూరముగా

వ్యవహరించెడివారు. వారిది మిక్కిలి కఠినమైన ప్రభుత్వము. రోమా రాజ్యములో మంచి తర్ఫీదు పొందిన సైన్యమున్నది. వారు ఆయా దేశములు జయించి అందలి ముఖ్య అధికారులను రోమా పట్టణమునకు చెరగా కొనిపోయి అక్కడ గొప్ప విజయోత్సవముతో వారిని వీధులలో ఊరేగించి అవమానించెడివారు.

పరిపాలనా యంత్రాంగమందు, న్యాయ శాస్త్రమునందును, రోమియులు సిద్ధహస్తులు. అయితే పాతనిబంధన గ్రంథములో రోమియుల రాకను గూర్చి ప్రత్యక్షముగా ఎచ్చటను ఉదహరింపబడలేదు. అనేక దేశములను యుద్ధములు చేయకయే భయపెట్టి మేమే మీదేశమును ఏలుదమని, శాంతి సమాధానములు కలుగజేయుదుమని చెప్పి స్వాధీనము చేసికొనెడివారు. రోమియులకు భయపడి అనేక దేశములు వాటంతట అవే లొంగిపోయినవి. ఈ విధముగా వారు మధ్యధరా సముద్రము చుట్టునున్న దేశములన్నిటిని, ఆసియా ఖండములోని మరికొన్ని దేశములను జయించిరి. సుమారు ఐరోపా ఖండములోని దేశములన్నిటిని జయించినారు. ఆయా దేశములలోని వేరువేరు జాతులవారందరు రోమియుల పరిపాలన క్రింద ఒకే రాజ్యముగా చేయబడిరి. గ్రీకులను ఓడించిన తరువాత రోమియులు సువిశాలమైన సామ్రాజ్యము స్థాపించగలిగిరి. క్రీ.పూ 67 కాలములో ఈవిధముగా సంపాదించిన ఆ గొప్ప సువిశాలమైన రోమా సామ్రాజ్యమును **బ్రూటస్ మరియు కాస్సియస్** అను ఇరువురు స్నేహితులు ఒక **సెనెట్** (పాలకసభ) గా ఏర్పడి పరిపాలించుచుండిరి. రోమియులు తాము జయించిన దేశాలలో తమకు తోడ్పడేవారిని అధికారులునుగా నియమించెడివారు. రోమా ''సెనెట్'' సహకారముతో మక్కబీయులు పాలస్తీనాను గ్రీకులబారినుండి విడిపించగలిగినారు కనుక **మక్కబీయులను** తమ అధిపతులుగా పాలస్తీనాపై నియమించినారు.

అయితే అంత సువిశాలమైన రోమా సామ్రాజ్యములో అప్పుడప్పుడు తిరుగుబాట్లు వచ్చు ప్రమాదము ఉన్నదని వారు గ్రహించినారు. రోమియులు గ్రీకులవంటివారు కారు. వారు మతవిషయములు ముఖ్యమని ఎంచక రాజకీయ సంస్థాపన విషయమే ఎక్కువగా పట్టించుకొనెడివారు. వారు జయించిన రాజ్యములన్నిటిలో తిరుగుబాట్లు లేవకుండా వాటిని ఒక క్రమపద్ధతిలో నడిపించుటకై ఎక్కువ సైన్యమును ఉపయోగించెడివారు. అనగా సైన్యమునకు ఎక్కువ అధికారములను ఇచ్చెడి వారు. ప్రతి వందమంది సైనికులకు ఒక నాయకుడిని నియమించెడివారు. ఆ నాయకుడిని 'శాతాధిపతి' అని పిలిచెడివారు. ఈ శాతాధిపతులకు సంపూర్ణ అధికారములను అప్పగించి ప్రజలు తిరుగుబాటు చేయు స్థలములయందు వారిని ఎక్కువగా ఉపయోగించెడివారు. (లూకా 7:1-10, 23:47, అపో.కా 10 అధ్యా) ప్రజలందరు తమ శాసనములను, చట్టములను గైకొనునట్లు రోమియులు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసెడివారు. తిరుగుబాటు వార్తలు సుళువుగా రోమా పట్టణ చక్రవర్తికి చేరునట్లు ఎక్కువగా గుర్రములను వాడి చక్కని రాజమార్గములను వేయించిరి. ఆ రహదారులపై పూర్తి అధికారమును ఆయా ప్రదేశములందున్న సైనికులకు అప్పగించెడి వారు. ఆదినములలో ప్రయాణసౌకర్యములు బాగుండుట వలన ఇతర దేశములనుండి వ్యాపారులు ఎక్కువ సంఖ్యలో వచ్చుచుండుటవలన రాజ్యము ఎంతో అభివృద్ధి చెందినది.

ఇతర దేశములనుండి మిక్కిలి ఖరీదుగల వస్తువులు దుస్తులు వచ్చుచుండుట వలన రోమా పట్టణ అధికారులు మరియు సైనికులు అందరు లాభపడుచుండెడి వారు. అందువలన వారు గొప్ప వైభవముతో జీవించుచుండెడివారు. విద్యను అభ్యసించుటకు కూడా అనేకులు ప్రయాణ సౌకర్యములను ఉపయోగించుట వలన విద్యాపరంగా కూడా రాజ్యము అభివృద్ధి చెందినది.

అయినా తిరుగుబాట్లు లేవకుండా ఇంత కట్టు దిట్టమైన ఏర్పాట్లు చేసుకొన్న "సెనెట్"కు నమ్మకము కుదరలేదు. అందువలన రాజ్యమంతటిని రెండు భాగములుగా విభజించి తమ సర్వసేనానాయకులైన "**పాంపే మరియు జూలియస్‌సీజర్(కైసరు)**" అను వారికి అప్పగించి తాము ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఉండెడివారు. రోమా రాజ్యపు తూర్పుభాగము అనగా పాలస్తీనావైపు పాంపే పాలించుచుండెను, మరియు పశ్చిమ భాగమును సీజర్ పాలించుచుండెను. కొంత కాలమునకు వారిరువురి మధ్య అంత:కలహములు బయలు దేరినవి. తన రాజ్యమును విస్తరించుకొనుట కొరకు పాంపే పాలస్తీనాను కూడా తన రాజ్యములో కలుపు కొనుటకు నిర్ణయించెను. ఆకాలములో పాలస్తీనాను యూదా దేశభక్తులైన మక్కబీయులు పరిపాలించు చుండిరి. సహాయమడిగిన యూదులకు సహాయము చేసినట్లే చేసి వారి పాలస్తీనా దేశమును పాంపే హస్తగతము చేసికొనెను. ఈ యుద్ధ ఫలితముగా పాలస్తీనా సిరియాలో ఒక భాగమైనది. ఫలితముగా పాలస్తీనా పలు జిల్లా ప్రాంతములుగా విభజింపబడినది. ఉత్తరమున గలిలయ జిల్లా, మధ్య ప్రాంతమున దెకపొలి జిల్లా, యొర్దానుకు తూర్పున పెరయ జిల్లా, మధ్యధరా సముద్రము వైపు అనగా పశ్చిమమున సమరయ జిల్లా మరియు దక్షిణమున ఇదూమయ జిల్లా ఏర్పడెను. (ఏదోముగా ఉన్న ప్రాంతము రోమియుల వలన ఇదూమయ అయినది.) పాంపే పాలస్తీనాకు ఏరాజును నియమించకుండా కేవలము తన స్నేహితుడు మరియు ఏదోమీయుడైన ***అంటిపేటర్*** అనునతని అధికారి (ప్రధానయాజకుడు)గా నియమించెను. ఆ తదుపరి క్రీ.పూ 48లో **సెనెట్** కు వ్యతిరేకముగా పాంపే మరియు జూలియస్ సీజర్‌ల మధ్య యుద్ధము చెలరేగినది. ఆ యుద్ధములో పాంపే హతమార్చబడెను. దీనివలన పాలస్తీనాపై అధికారిగా ఉన్న పాంపే స్నేహితుడైన ఆంటిపేటర్ పెద్దచిక్కులో పడెను. కాని ఇంతలో సీజరు ఐగుప్తును పాలిస్తున్న 12వ టోలమీతో యుద్ధములో చిక్కుకొనెను. అటువంటి పరిస్థితులలో ఐగుప్తునకు దగ్గరగా పాలస్తీనాలో ఉన్న ఆంటిపేటర్ యుద్ధమునకు సీజరుకు సైన్యసహాయము పంపుటయేకాక ఐగుప్తులో ఉన్న యూదులను కూడా సీజరుకు సహాయముగా పంపెను. ఆ సహాయమువలన సీజరు ఐగుప్తు యుద్ధములో గెలిచి ఐగుప్తును రోమాలో కలిపెను. ఈవిధముగా ఆంటిపేటరు సీజరుకు స్నేహితుడాయెను. దీనికి కృతజ్ఞతగా సీజరు ఎప్పటివలెనే ఆంటిపేటరును పాలస్తీనాపై అధికారిగా ఉండుటకు అంగీకరించెను. అంతేకాక అతనికి రోమా పౌరసత్వమునిచ్చి రోమాకు ఎట్టి కప్పము చెల్లించనక్కరలేదని ఆజ్ఞాపించెను. ఈవిధముగా సీజరు మొత్తం రోమా సామ్రాజ్యాన్ని తన వశము చేసికొని చక్రవర్తి ఆయెను. ప్రపంచంలోనే అతి పెద్దరాజ్యమైన రోమాకు సీజరు మొదటి చక్రవర్తి కనుక అతని తరువాత పరిపాలించి రాజులందరు అతని గౌరవార్థముగా "సీజరు అనగా కైసరు" అని బిరుదు వహించుట ప్రారంభమాయెను. సీజరుకు వారసులు లేనందున తన రక్తసంబంధియైన ***"ఓక్టేవియన్"***ను దత్తత తీసికొనెను. సీజరు చక్రవర్తి యగుట **సెనెట్**కు వ్యతిరేకంగా జరిగినందున

సెనెట్ సభ్యులైన **బ్రూటస్ మరియు కాస్సియస్** కలసి క్రీ.పూ 44లో సీజరును చంపిరి. సీజరు హత్య చేయబడినప్పుడు 18సం॥ వయస్సులో ఉన్న **ఒక్టేవియస్**ను కూడా సెనెటర్లు హతమార్చ ప్రయత్నించిరి. అయితే చాలా చాకచక్యముగా ఒక్టేవియస్ తప్పించుకొనెను. ఆ తదుపరి తప్పించుకొనిన ఒక్టేవియస్ తన సోదరి భర్తయైన **ఆంతోని** మరియ అతని స్నేహితుడైన **లెఫిడియస్** అనువారి సహాయముతో తన శత్రువులైన సెనటర్లు బ్రూటస్‌ను మరియు కాస్సియస్ అనువారిని క్రీ.పూ 42లో హతమార్చి పగతీర్చుకొనెను. ఆ తదుపరి బావగారైన ఆంతోనికి తూర్పు భాగమును, అతని స్నేహితుడైన లెఫిడియస్‌కు ఆఫ్రికాలోని ఐగుప్తు తదితర ప్రాంతములను అప్పగించి, రోమా సామ్రాజ్యపు పశ్చిమ భాగమును తాను పరిపాలించెను.

ఇదే సమయములో పాలస్తీనాపై అధికారిగా నున్న ఏదోమీయుడైన ఆంటిపీటర్‌పై యూదా దేశభక్తులైన మక్కబీయులు మరల దండెత్తి హతమార్చెను. ఆంటిపేటర్ పెద్దకుమారుడైన ఫసాయేలు ఆత్మహత్య చేసుకొనగా రెండవ కుమారుడైన హేరోదు రోమునకు పారిపోయి ఒక్టేవియస్ దగ్గరకు చేరెను. పాలస్తీనాపై అధికారిగా ఉన్న మరియు ఏదోమీయుడైన ఆంటిపీటర్‌పై యూదా దేశభక్తులైన మక్కబీయులు దండెత్తి హతమార్చినపుడు ఆంటిపేటర్ పెద్దకుమారుడైన ఫసాయేలు ఆత్మహత్య చేసుకొనగా రెండవ కుమారుడైన హేరోదు రోమునకు పారిపోయి ఒక్టేవియస్ దగ్గరకు చేరెను. ఈ విధముగా పారిపోయిన హేరోదు, క్రీ.పూ37లో రోమా రాజులు ఒక్టేవియస్, ఆంతోని మరియ లెఫిడియస్ దయను సంపాదించి మరల పాలస్తీనాకు తిరిగి వచ్చి మక్కబీయులను జయించి తిరిగి పాలస్తీనాపై అధికారమును పొందెను. ఆ తదుపరి యూదుల సహకారము పొందుటకు రోమా రాజుల చేత "యూదుల రాజు" అను బిరుదును పొందినాడు. తనను తన రాజ్యమును పడగొట్టగలరని మక్కబీయ వంశస్థులందరని ఒకరి తరువాత మరియొకరిని హేరోదు హతమార్చెను. ఇంకా మిగిలిన మక్కబీయులు ఎవరైనా ఉన్నచో వారితో తనకు శాశ్వతముగా కయ్యము లేకుండా మక్కబీయురాలు మరియు రూపవతి యైన మరియామ్నేను వివాహమాడి ఆమె ద్వారా ఇరువురు కుమారులను అనగా అలెగ్జాండర్ మరియు అరిస్టొబ్యులస్‌ను కనెను. హేరోదుకు ఉన్న పది మంది భార్యలలో మరియామ్నే యొకతి. ఈ హేరోదు గురించి మనము ముందు ముందు చరిత్రలో మరింత విపులముగా తెలుసు కొనగలము.

సెనెటర్లను ఓడించిన **ఒక్టేవియన్** తన బావగారైన ఆంతోనికి తూర్పు భాగమును, అతని స్నేహితుడైన లెఫిడియస్‌కు ఆఫ్రికాలోని ఐగుప్తు తదితర ప్రాంతములను అప్పగించి, రోమా సామ్రాజ్యపు పశ్చిమ భాగమును తాను పరిపాలించుట మనము ఇంతకు ముందు గమనించినాము. కొంతకాలమునకు ఐగుప్తును పాలిస్తున్న లెఫిడియస్‌కు మరియు పశ్చిమరోమును పాలిస్తున్న ఒక్టేవియస్‌కు మధ్య విభేదములు కలుగగా, లేఫిడియస్‌ను ఒక్టేవియస్ జయించి హతమార్చెను. అదే సమయములో సెల్యూసిడ్ల కుమార్తె మరియు ఐగుప్తును పాలించిన టోలమీయుల కోడలు యైన క్లియోపాత్ర, గ్రీకుల కాలము అంతరించినా ఇంకా ఐగుప్తునందే ఉండెను. ఐగుప్తీయురాలుగా ఉన్న క్లియోపాత్ర అద్భుత సౌందర్యమునకు మరియు ఐగుప్తు ఆడంబరమునకు ఒక్టేవియస్ బావగారైన ఆంతోని ఎంతో అకర్షింపబడి క్లియోపాత్రను వివాహమాడి ప్రజలను మరచి ఐగుప్తులోనే ఆడంబర జీవితమును గడుపుచుండెను. ఈ విషయమును గమనించిన

ఒక్టేవియస్ రోమా సామ్రాజ్యమందు తన స్థానమును బలపర్చుకొనుచుండెను. ఆడంబర జీవితమునందు కాలము గడుపుచుండిన ఆంతోని మీదకు క్రీ.పూ 31లో ఒక్టేవియస్ యుద్ధమునకు వెళ్ళి జయించి తన బావగారని చూడక అతనిని బంధించి అంతమొందించుటకు వెళ్ళగా ఆంతోని మరియు క్లియోపాత్ర ఆత్మహత్య చేసుకొనిరి. ఈవిధముగా సువిశాలమైన రోమా సామ్రాజ్యమంతయు ఒక్టేవియస్‌కు స్వాధీనమాయెను. ఏంతో ఓపికతో తెలివితో ఈ ఘనతను సాధించిన ఒక్టేవియస్‌నకు రోమా ప్రజలు గౌరవభావంతో "పూజ్యనీయుడు" అని అర్ధమిచ్చు "ఔగుస్తు"**(Augustus)**అను నామమును ఇచ్చినారు. అదేవిధముగా తన పెంపుడు తండ్రిగారైన జూలియస్ సీజరు (కైసరు అనగా చక్రవర్తి) గౌరవ జ్ఞాపకార్థం ఆపేరును కూడ ఒక్టేవియస్ స్వీకరించి తనపేరును "కైసరు ఔగుస్తు" **(Ceaser Augustus)**గా మార్చుకొనెను. ఆ తదుపరి ఇక వెనుదిరిగి చూడకుండా క్రీ.పూ 30 సం॥ నుండి క్రీ.శ 14సం॥ వరకు అనగా 44 సంవత్సరములు ఏక చత్రాధిపత్యము వహించి రోమా సామ్రాజ్యమును తిరుగులేకుండా పరిపాలించెను. లూకా సువార్తలో చెప్పబడిన కైసరు ఔగుస్తు యే ఈ ఒక్టేవియస్ అని మనము గమనించవలెను(లూకా 2:1). ఆ విధముగా ఆరంభమైన రోమా చక్రవర్తుల సామ్రాజ్య పరిపాలన క్రీ.శ 1453 వరకు నిలిచియుండి ఆ తదుపరి పరిశుద్ధ రోమా చక్ర మండలము **(Holy Roman Empire)** గా అవతరించి క్రీ.శ 19వ శతాబ్దము వరకు నిలిచెను. ఆ తదుపరి ఎన్నో మార్పులు చెంది రోమన్ కేథలిక్‌గా సంఘముగా మారి నేటికి నిలిచియుండెను.

ఈ విధముగా కైసరు ఔగుస్తు రోమా రాజ్యమంతటిని పరిపాలిస్తూ ఉండగా ఒక దినమున తన సార్వభౌమాధిపత్యమును ప్రపంచములో చిరస్థాయిగా నిలుచుట కొరకు మరియు తాను అనేక కోట్లమంది ప్రజలకు చక్రవర్తినని ప్రపంచ చరిత్రలో తన పేరు సువర్ణాక్షరాలతో లిఖింపబడుటకొరకు తన రోమా సామ్రాజ్యమంతటిలో "ప్రజా సంఖ్య" వ్రాయవలెనని ఆజ్ఞఇచ్చెను (లూకా 2:1). వాస్తవముగా ఇది దేవుని రక్షణ ప్రణాళిక ప్రకారము కైసరు ఔగుస్తుకు దేవుడు కలుగజేసిన ప్రేరేపణ మాత్రమే కాని అతని స్వంత ఆలోచన కాదని మనము గ్రహించవలెను.

ఈ ఆజ్ఞ గైకొనవలసిన సమయముననే మన ప్రభువైన యేసుక్రీస్తు పుట్టెనని మనకు తెలియును. కొంత కాలమునకు ఆతడు ఇంకొక ఆజ్ఞను కూడా అమలులో పెట్ట ప్రయత్నించెను. అదేదనగా కైసరు దేవుడు కనుక రోమా రాజ్యములో నున్న సమస్తమైన వారందరు తమ స్వంత దేవుండ్లకు గాక కైసరును పూజింపవలెనని ఆజ్ఞ ఇచ్చెను. అయితే యూదులు తాము బబులోను దేశమునకు చెరగా తీసికొని పోబడినప్పటి నుండి ఎట్టి విగ్రహారధనయైనను చేయలేదు. కనుక అనేకసార్లు ఈ విషయమై యూదులు వ్యతిరేకించుచు వారు తిరుగుబాటు చేసిరి. అట్టివారికి రోమాసైన్యము నిర్దాక్షిణ్యంగా మరణ శిక్ష విధించెడిది. ప్రభువైన క్రీస్తుయేసు పుట్టిన సమయమున బంగారు పక్షిరాజు సంకేతముగల రోమా పతాకమును రోమియులు యెరూషలేము దేవాలయముపై నిలువబెట్టగా యూదులందరు ఏకమై, మహోన్నతుడు, సర్వసృష్టికర్త మరియు సైన్యములకు అధిపతియగు యెహోవా నివసించు పరిశుద్ధస్థలమునకు జరిగిన అవమానమునకు రగిలిపోయి, మిగుల కోపమును తెచ్చుకొని సర్వలోక రోమా చక్రవర్తి యొక్క ఆజ్ఞ అని

కూడా చూడకుండా దానిని పడగొట్టి కాల్చివేసిరి. రోమా సిపాయిలు ఆ పని చేసిన యూదులను సజీవులుగానే కాల్చి వేయుటకు రాగా తక్కిన యూదులు ఆ రోమా సిపాయిలను రాళ్ళతో కొట్టి చంపివేసిరి. అనేకమంది యూదులట్లు తిరుగుబాటు చేయగా రోమా సేనాధిపతి ఒకడు తన ఘనత కొరకు వేలాది రోమా సైన్యముతో యూదుల మీదకు దండెత్తివచ్చి 2000మంది యూదులను పట్టుకొని సజీవముగా సిలువ వేయించెను. ఆ విధముగా మరణించిన యూదుల మృత దేహములు చాలా దినములవరకు యెరూషలేమునుండి గలలియ వెళ్ళే మార్గమున అట్లే వ్రేలాడినవి. ఈ విధముగా అన్ని దేశాలలో తిరుగుబాటు చేయుచున్న ప్రజలందరిని రోమియులు నిర్ధాక్షిణ్యంగాను, కఠినముగాను శిక్షించి అణచివేసిరి. రోమా చక్రవర్తులు తమ పేరు ప్రతిష్టల కోసం ఐశ్వర్యము విస్తరించుకొలది తమ జీవితములను హేయకరమైన పాపపు అలవాట్లకు లోబరుచుకొని భ్రష్టులైరి. కొందరు ముఖ్యమైన రోమా చక్రవర్తుల పేర్లు ఈ క్రింద ఇవ్వబడినవి.

1. క్రీ.పూ 67 ముందు సెనెట్ (బ్రూటస్ మరియు కాస్సియస్)
2. క్రీ.పూ 67-48 పాంపే మరియు జూలియస్ సీజర్
3. క్రీ.పూ 48-44 జూలియస్ సీజర్
4. క్రీ.పూ 44-30 ఓక్టేవియస్, ఆంతోని, లెఫిడియస్
5. క్రీ.పూ 30-క్రీ.శ 14 అనగా 44 సం॥లు ఓక్టేవియస్ ( ఓక్టేవియస్ చక్రవర్తి కైసరు ఔగుస్తుగా మారెను.)
6. క్రీ.శ 14-37 తిబెరియ (లూకా 3:1)
7. క్రీ.శ 37-41 కలిగుల
8. క్రీ.శ 41-54 క్లౌదియా (అపో.కా 11:28, 18:2)
9. క్రీ.శ 54-68 నీరో (రోమా కాల్చివేత క్రీ.పూ 64)
10. క్రీ.శ 68-79 వెస్పేజియన్
11. క్రీ.శ 79-81 తీతు (టైటస్)(యెరూషలేమును సర్వనాశనము చేసిన రోమా చక్రవర్తి)
12. క్రీ.శ 81-96 డొమేషియన్
13. క్రీ.శ 96-312 నెర్వా మొదలుకొని కాన్స్టాంటైన్ వరకు

వీరిలో కొంత మంది మిక్కిలి క్రూరమైనవారు. వారు యూదులను, ఆదిమ సంఘ క్రైస్తవులను, అపోస్తలులను భయంకరముగా హింసించి, వారికి దారుణమైన మరణ శిక్షలు విధించిరి. వారు చేసిన ఆ అతి భయంకర ఘోరకృత్యములు రానున్న క్రొత్తనిబంధన భౌగోళిక చరిత్ర పాఠములలో మనము ముందు ముందు నేర్చుకొనగలము.

ఇంతటితో పాతనిబంధన మరియు తరువాత జరిగిన 400 నిశ్శబ్ద సం॥ల చరిత్ర సంపూర్ణముగా ముగియుచున్నది. క్రీస్తు కాలమునకు మరియు క్రొత్త నిబంధన చరిత్రకు వెళ్ళక ముందు మనము నేర్చుకున్న పాఠములను మరిముఖ్యముగా యూదుల చరిత్రలోని కొన్ని ముఖ్య ఘట్టములను మరియు ఇంచుమించు కాలములను పరిశీలన చేద్దాం.

ఆది కాలము:-సృష్టి-ఏదేనుతోట-ఆదాము హవ్వలు-జల ప్రవాహము మరియు నోవహు-బాబెలు గోపురం

క్రీ.పూ 2000-పితరుల చరిత్ర :-- అబ్రహాము కానానుకు వచ్చుట - ఇస్సాకు - యాకోబు - 12 మంది గోత్రకర్తలు - యోసేపు ఐగుప్తు అధికారములోనికి వచ్చుట
క్రీ.పూ 1800 -ఇశ్రాయేలీయులు ఐగుప్తులో నివసించుట- వారు వెట్టి చాకిరీలు చేయుట
క్రీ.పూ 1600-అరణ్య ప్రయాణము - మోషే ఇశ్రాయేలీయులను ఐగుప్తునుండి విడిపించుట
సీనాయి పర్వతము వద్ద దేవుని పది ఆజ్ఞలు పొందుట
క్రీ.పూ 1200-కానాను దేశమును జయించుట - యెహోషువా - న్యాయాధిపతులు
క్రీ.పూ 1040- సౌలు ఇశ్రాయేలీయులకు మొదటి రాజగుట
క్రీ.పూ 1000-దావీదు ఇశ్రాయేలీయులకు రాజగుట
క్రీ.పూ 962-సొలొమోను ఇశ్రాయేలీయులకు రాజగుట
క్రీ.పూ 931-రాజ్యము విభాగింపబడుట- రెండు గోత్రాల యూదా రాజ్యము(దక్షిణం) సొలొమోను కుమారుడు రెహబాముచే పరిపాలింపబడుట, ముఖ్యపట్టణము యెరూషలేము - పది గోత్రాల ఇశ్రాయేలురాజ్యము (ఉత్తరం) తిరుగుబాటుదారుడు యరోబాముచే స్థాపించబడుట, ముఖ్యపట్టణము షోమ్రోను
క్రీ.పూ 722- షోమ్రోను నాశనమగుట - పది గోత్రముల ఇశ్రాయేలు రాజ్యము అష్షూరీయులచే చెదరగొట్టబడుట - వారు ఎన్నడును తిరిగి స్వదేశమునకు రాలేదు.
క్రీ.పూ 600-బబులోనువారు అష్షూరీయులను జయించుట - బాబెలు గొప్ప రాజ్యమగుట
క్రీ.పూ 597-యెరూషలేము బబులోను రాజగు నెబుకద్నెజరుచే పూర్తిగా నాశనము చేయబడుట - యూదులు బబులోనుకు చెరగా తీసికొనిపోబడుట
క్రీ.పూ 528-పారశీక రాజు కోరేషు, బబులోనును జయించి, యూదులు యెరూషలేమునకు తిరిగి వెళ్ళవచ్చుననే శాసనము చేయుట
క్రీ.పూ 527-జెరుబ్బాబెలు తన నాయకత్వమున యూదుల మొదటి జట్టు తిరిగి యెరూషలేమునకు వచ్చుట
క్రీ.పూ 516-యెరూషలేములోని దేవాలయము తిరిగి కట్టబడుట (ఇది సొలొమోను కట్టించిన దేవాలయముకన్న చిన్నది)
క్రీ.పూ 458-ఎజ్రా మరియొక యూదుల జట్టును యెరూషలేమునకు నడిపించుట
క్రీ.పూ 445-యూదుల మూడవజట్టుతో నెహెమ్యా యెరూషలేము వెళ్ళి ప్రాకారములను తిరిగి కట్టించుట
క్రీ.పూ 420-సమరయులు యెరూషలేములో దేవుని ఆరాధించుటకు అనుమతింపబడనందున తాము స్వంతముగా దేవాలయమును గెరిజీము పర్వతముపై కట్టించుట.
క్రీ.పూ 333-అలెగ్జాండరు చక్రవర్తి యూదా దేశమును జయించుట
క్రీ.పూ 198- సెల్యూకిడ్, టోలమి మొదలగు గ్రీకు సైన్యాధిపతులు యూదా దేశమును ఏల నారంభించుట
క్రీ.పూ 175-గ్రీకు అధిపతి అంతియోక్ ఎపిఫానీస్ యూదా మత నిర్మూలనకు ప్రయత్నించుట
క్రీ.పూ 169-గ్రీకు అధిపతి అంతియోక్ ఎపిఫానీస్ దేవాలయమును దోచుకొని రాజు విగ్రహమును దానియందు నిలబెట్టుట

క్రీ.పూ 167-మక్కబీయ కుటుంబీకులు గ్రీకు సిపాయిలను చంపినందున యూదులు మక్కబీ కుటుంబపు నాయకత్వము క్రింద ఒక సైన్యముగా నడిపింపబడుట

క్రీ.పూ 165-రోమియులు వచ్చి యూదులకు సహాయము చేయుట - కాని వారు కూడా దేవాలయమును అపవిత్ర పరచగా వారిని మక్కబీ కుటుంబీకులు దానిలోనుండి తొలగించుట

క్రీ.పూ 139-రోమియులు యూదా దేశమునకు కొంత స్వతంత్ర్యము నిచ్చుట, అయినను యూదులు ఎల్లప్పుడు రోమియుల మీద తిరుగు బాటు చేయుచునే యుండిరి.

క్రీ.పూ 63-రోమా చక్రవర్తి పాంపే యెరూషలేమును జయించుట

క్రీ.పూ 37-ఏదోమీయుడైన హేరోదు యెరూషలేములో రోమీయులచేత "యూదుల రాజు" అను బిరుదు సంపాదించుకొనుట

క్రీ.పూ 30- కైసరు ఔగుస్తు పరిపాలన

క్రీ.పూ 20-హేరోదు యెరూషలేము దేవాలయమును తిరిగి కట్టింప మొదలు పెట్టుట

క్రీ.పూ 4 - యేసుక్రీస్తు బెత్లెహేములో జన్మించుట -

క్రీ.పూ 1 - హేరోదు మరణము

క్రీ.శ 30- యేసుక్రీస్తు సిలువవేయబడి చనిపోయి తిరిగి లేచుట

క్రీ.శ 65 - నీరో చక్రవర్తి చేతిలో పౌలు హతసాక్షి యగుట

క్రీ.శ 70- టైటస్ (తీతు) చక్రవర్తి యెరూషలేమును ముట్టడివేసి దానిని నాశనము చేయుట, యూదులలో అనేకులు హతము చేయబడగా మిగిలినవారు పూర్తిగా చెదరగొట్టబడుట.

క్రీ.శ 1948 - యూదులు తిరిగి తమ స్వదేశమును చేరుకొని "ఇశ్రాయేల్" అను క్రొత్త దేశమును స్థాపించుకొనుట.